www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఇంజెక్షన్లతో బీపీకి చెక్

ఏడాదికి రెండు సార్లు చేయించుకుంటే చాలు!

శాస్త్రవేత్తల పరిశోధనల్లో సత్ఫలితాలు: లాన్సెట్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: రక్తపోటు (బీపీ) నియంత్రణకు ఇక రోజూ మాత్రలు వేసుకోవాల్సిన అవసరం ఉండకపోవచ్చు! ఏడాదికి రెండు ఇంజెక్షన్లు చేయించుకుంటే చాలు! ఇవి సమీప భవిష్యత్తులో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ దిశగా శాస్త్రవేత్తల పరిశోధనలు సత్ఫలితాలిస్తున్నాయని ప్రముఖ మెడికల్ జర్నల్ 'లాన్సెట్' ఓ వ్యాసం ప్రచురించింది. దాని ప్రకారం.. అమెరికాకు చెందిన రోచీ అండ్ అల్నిలమ్ ఫార్మాస్యూటికల్స్.. ఆర్ఎన్ఏ టెక్నాలజీతో జిలెబెసిరన్ అనే ఇంజెక్షన్‌ను అభివృద్ధి చేసింది. ప్రస్తుతం మూడో దశ ట్రయల్స్‌లో ఉంది. ఇది బీపీకి ప్రధాన కారణమైన, కాలేయం నుంచి ఉత్పత్తి అయ్యే యాంజియోటెన్సినోజెన్ అనే ప్రొటీన్‌కు అడ్డుకట్ట వేస్తుంది. ఇది 6 నెలల పాటు ప్రభావవంతంగా పనిచేసినట్టు పరిశోధనల్లో గుర్తించారు.

సోమవారం | 16-2-2026 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 341

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి సా.5:34 తదుపరి అమావాస్య; నక్షత్రం: శ్రవణం రా.8:48 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: రా.12:52-2:30; దుర్ముహూర్తం: మ.12:52-1:38, మ.3:09-3:55; అమృతఘడియలు: ఉ.9:58-11:38; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6:45; సూర్యాస్తమయం: 6:13

గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

స్పీకర్ తొలగింపుపై 9న చర్చ

అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో అదే రోజు ఓటింగ్

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు వెల్లడి.. మలి విడత సమావేశాలు ఆసక్తికరం

ఓ కీలక బిల్లు తీసుకురాబోతున్నాం.. అదేమిటో ఇప్పుడు బహిర్గతం చేయం

పార్లమెంటు నడవడానికి సహకరించకుంటే గిలెటిన్ చేసుకుంటూ పోతాం

విపక్షాలకు కేంద్ర మంత్రి హెచ్చరిక

2



'వైట్ కాలర్' ఉగ్ర గ్రూపు!

పేలుళ్ల కోసం 'అన్సార్ ఇంటెరిమ్' సంస్థను ఏర్పాటు చేసిన ఉగ్ర డాక్టర్లు

ఆదిల్, గనీ, ఉమర్ తదితర సభ్యులు

కశ్మీర్ సహా దేశవ్యాప్తంగా పలు చోట్ల విధ్వంస కార్యకలాపాలకు ప్రణాళికలు

ఢిల్లీ పేలుడు ఘటన దర్యాప్తులో సంచలన విషయాలు

2





ప్యాకేజ్డ్ ఆహారంపై 'హెచ్చరిక' ఉండాల్సిందే

ఆరోగ్యం ప్రాథమిక హక్కు.. రాజీపడే ప్రసక్తే లేదు

ప్రజల ఆరోగ్యంతో ఆటలొద్దు

ఎఫ్ఎస్ఎస్ఏఐకు సుప్రీంకోర్టు స్పష్టీకరణ

4 వారాల్లో సమగ్ర నివేదికతో రావాలని ఆదేశం

2



వార్ వన్‌సైడ్

టీ20 వరల్డ్‌కప్‌లో భారత్ చేతిలో పాక్ చిత్తు

బ్యాట్‌తో ఇషాన్ తాండవం.. సూపర్-8కు సూర్య సేన

10

న్యూయార్క్, దుబాయ్, కొలంబో... వేదిక ఏదైనా టీమిండియాదే జోరు. పాకిస్థాన్‌ది అదే బేజారు. టీ20 వరల్డ్‌కప్‌లో భారత్‌తో మేం తలపడం అంటూ రచ్చ చేసి గత్యంతరం లేక బరిలోకి దిగిన పాకిస్థాన్‌కు తలవంపులు తప్పలేదు. పాక్‌కు మళ్లీ పీడకలే మిగిలింది. వెరసి టీమిండియా చిరకాల ప్రత్యర్థిపై ఆధిపత్యాన్ని కొనసాగించింది. టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా కొలంబోలో ఆదివారం జరిగిన గ్రూప్ మ్యాచ్‌లో భారత్ 61 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసి సూపర్-8కు దూసుకెళ్లింది. అద్భుత ఫామ్‌లో ఉన్న కీపర్, బ్యాటర్ ఇషాన్ కిషన్ (77) పాక్ బౌలర్లపై విరుచుకుపడి అదిరే ఆరంభాన్నిచ్చాడు. తొలుత భారత్ 20 ఓవర్లలో 175/7 స్కోరు చేసింది. ఇక ఛేదనలో భారత బౌలర్ల ధాటికి బెంబేలెత్తిన పాక్ 114 పరుగులకే ఆలౌటైంది.



ఇషాన్ కిషన్ (77)

ఉక్కు..తుక్కు!

జగన్ హయాంలో అడ్డగోలుగా దోపిడీ

రూ.100 కోట్ల విలువైన 16 వేల టన్నుల స్టీల్‌కు తుప్పు

పేదల ఇళ్ల నిర్మాణం పేరిట ఎన్నో అక్రమాలు

మార్కెట్ కంటే అధిక ధరకు స్టీల్ కొనుగోలు

2022లో 1,91,812 టన్నుల సేకరణ

కంపెనీలకు 10.28 కోట్లు దోచిపెట్టిన వైనం

350 కోట్ల ఇతర మెటీరియలూ ఎక్కువ రేట్లకు

కంపెనీల నుంచి అధికారులకు కమీషన్లు

విజిలెన్స్ నివేదికలో వాస్తవాలు వెలుగులోకి

ఆ మెటీరియల్ కూడా చాలావరకు పక్కదారి

మిగిలి ఉన్నదీ వినియోగించలేని దుస్థితి

మార్కెట్లో వెయ్యి రూపాయల విలువ చేసే ఓ వస్తువును టోకున భారీ స్థాయిలో వేలు, లక్షల సంఖ్యలో కొనుగోలు చేశామనుకుందాం..! సాధారణంగా ఏ కంపెనీలు అయినా ధర తగ్గిస్తాయి. దేశంలో ఎక్కడికెళ్లినా ఇంతే. జగన్ హయాంలో పేదల ఇళ్ల నిర్మాణానికి 2022లో ఏకంగా 1,91,812 టన్నుల స్టీల్ కొనుగోలు చేశారు. ఇంత భారీ స్థాయిలో కొన్నందుకు మార్కెట్ ధర కంటే తక్కువ రేటుకు రావాలి కదా..! కానీ మార్కెట్ రేటు కంటే అదనంగా రూ.10.28 కోట్లు చెల్లించారు. ఇందుకు ప్రతిఫలంగా ఆయా కంపెనీల నుంచి భారీ మొత్తాల్లో కమీషన్లు దండుకున్నారు. నాడు పేదల ఇళ్ల నిర్మాణం పేరిట చేసిన మోసం విజిలెన్స్ విచారణలో వెలుగు చూసింది.



అనంతపురం జిల్లా రాప్తాడు మండలం టీటీడీసీ శిక్షణ కేంద్రం ప్రాంగణంలో చెట్ల కింద వదిలేసిన వందల టన్నుల స్టీలు. నాలుగేళ్లుగా తుప్పు పట్టిపోయి వినియోగానికి పనికి రాని దుస్థితి.

> స్టీల్ మాత్రమే కాదు ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే 11 రకాల ఇతర మెటీరియల్‌నూ అధిక ధరలకు కొనుగోలు చేశారు. సెంటు జాగాలో కట్టే ఒక్కో చిన్న ఇంటికి రూ.1.12 లక్షల విలువ జేసే వస్తువులు కొన్నారు. దాదాపు రూ.350 కోట్లు వెచ్చించి నాసిరకం వస్తువులు సేకరించి జిల్లాల్లోని గోడౌన్లలో పడేశారు. వీటిని కూడా చాలావరకు క్షేత్రస్థాయి అధికారులు పక్కదారి పట్టించారు. మిగిలి ఉన్న మెటీరియల్‌లో కనీసం వంద కోట్ల విలువైన 16 వేల టన్నుల స్టీల్ తుప్పు పట్టింది. ఇతర మెటీరియలూ వినియోగించలేని దుస్థితి.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పేరేమో పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణ పథకం..! పైగా జగనన్న కాలనీలనే పేరు..! చేసిందంతా దోపిడీ, మోసం..! నాడు జగన్ హయాంలో పేదల పేరిట కోట్లాది రూపాయలు దోచేశారు. భూముల చదును పేరిట దోపిడీ. సిమెంట్ కొనుగోళ్లలో అక్రమాలు. పనులు చేయకుండానే కాంట్రాక్టర్లకు బిల్లులు. చివరకు స్టీల్, ఇతర మెటీరియల్ కొనుగోళ్లలోనూ కమీషన్లు. నాడు వైసీపీ నాయకులు, గృహ నిర్మాణ శాఖ అధికారులు కుమ్మక్కై అడుగడుగునా, అడ్డగోలుగా సాగించిన అవినీతి, అక్రమాలు, కుంభకోణాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. స్టీల్, ఇతర మెటీరియల్ కొనుగోళ్లలో మార్కెట్ ధర కంటే ఎక్కువ చెల్లించి కమీషన్లు

మిగతా 12వ పేజీలో...



ఆదివారం అర్ధరాత్రి పాగాలంకరణలో శ్రీశైలం మల్లన్న ఆలయం

సర్వం.. శివోహం!

శ్రీశైలంలో కమనీయంగా స్వామి, అమ్మవార్ల కల్యాణం

అర్ధరాత్రి వైభవంగా పాగాలంకరణ

భక్తులతో కిక్కిరిసిన దక్షిణ కైలాసం 'శ్రీకాళహస్తి'

కోటప్పకొండలో కొలువుదీరిన 23 విద్యుత్ ప్రభలు

3

నేడు అమరావతికి బిల్ గేట్స్

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్‌లతో భేటీ

సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ పనితీరు పరిశీలన

ఉండవల్లిలోని ఏఐ ఆధారిత వ్యవసాయ క్షేత్రంలోనూ పర్యటన

11



బిల్ గేట్స్‌తో చంద్రబాబు (ఫైల్)

శక్తితోనే సాధించాం!

వాణిజ్య ఒప్పందాల్లో బలమైన స్థితిలో ఉండి చర్చలు

యూపీఏ ప్రభుత్వం ఆత్మవిశ్వాసంతో చర్చలు జరపలేదు

మేం తెచ్చిన బడ్జెట్లు సాదాసీదావి కావు.. దేనికవే ప్రత్యేకం


వికసిత్ భారత్ తర్వాతి దశలో ప్రైవేటు రంగమే కీలకం

డిజిటల్, ఏఐ రంగాలకు కేంద్రంగా మారుతున్న భారత్

ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా రక్షణ రంగం ఆధునికీకరణ

ప్రైవేటు సంస్థలు లాభాల్లో కార్మికులకు న్యాయమైన వాటా ఇవ్వాలి

పీటీఐ ఇంటర్వ్యూలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ



2



రైతులను ముంచిన మోదీ

వాణిజ్య ఒప్పందంతో దేశాన్ని అమ్మేశారు

ఇక మన పంటలు అమెరికాపై ఆధారపడాల్సిందేనా?

జన్యుమార్పిడిపై మన వైఖరి సడలిందా?

ప్రధానికి ఐదు ప్రశ్నలు సంధించిన రాహుల్



మంత్రి నాదెండ్ల మనోహర్ నుంచి పార్టీ సభ్యత్వాన్ని అందుకుంటున్న పవన్

కార్యకర్త కష్టాన్ని గుర్తిద్దాం

పార్టీకి లక్షల మెదళ్లను కదిలించేవాళ్లు కావాలి

జనసేన పార్టీ భావజాలం చాలా బలమైనది

జనసేన ఏ ప్రాంతానికో పరిమితం కాదు

అందుకే తమిళనాడు, కర్ణాటక నుంచి ఆహ్వానం

పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభంలో పవన్

పార్టీకి 2 కోట్ల విరాళం అందించిన జనసేనాని

12

మళ్లీ తెరపైకి బాక్సైట్!

మన్యంలోని ఆరు బ్లాకుల్లో 615 మిలియన్ టన్నుల నిల్వలు

వీటిలో మైనింగ్‌కు ఏపీఎండీసీకి లీజులివ్వాలి

నామినేషన్ లేదా వేలంలో ఇప్పించాలి

ప్రభుత్వానికి గనుల శాఖ నివేదిక

తర్వాత ప్రైవేటు కంపెనీకి డెవలపర్ బాధ్యతలు

1.50 లక్షల కోట్ల పెట్టుబడులకు చాన్స్


60 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి

లీజుల నిర్ణయాధికారం కేంద్రానిదే

తొలుత రాష్ట్రం విధాన నిర్ణయం తీసుకోవాలి

తర్వాత కేంద్రానికి సిఫారసు చేయాలి

11



కేంద్రం పరిశీలనకు బీసీ బిల్లు!

రక్షణ చట్టం హామీ అమలుకు కూటమి ప్రయత్నం

జాతీయ బీసీ కమిషన్ పరిశీలన అనంతరం సభలోకి

ఉమ్మడి జాబితాలోని అంశం కావడంతో పరిశీలనకు బిల్లు

ఆర్డినెన్స్ ద్వారా లేదా వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చట్టం

అమరావతి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ మేరకు బీసీలకు రక్షణ చట్టం తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. జాతీయ బీసీ కమిషన్ పరిశీలనకు పంపిన అనంతరం కేంద్రం అనుమతితో అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని భావిస్తోంది. ఎస్సీ, ఎస్టీల తరహాలోనే రాష్ట్రంలో బీసీలకు రక్షణ కల్పించేలా ప్రభుత్వం

మిగతా 12వ పేజీలో...



యుద్ధ విమానం విన్యాసం

విశాఖ తీరంలో నేవీ పండుగ

- ఐఎఫ్ఆర్, మిలాన్-2026 ప్రారంభం
- మిలాన్ విలేజ్‌ను ప్రారంభించిన తూర్పు నౌకాదళ వైస్ అడ్మిరల్
- సాగర తీరంలో ఆకట్టుకొన్న నేవీ రిహార్సల్స్

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ తీరంలో నేవీ పండుగ మొదలైంది. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్), మిలాన్-2026 వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాగర తీరంలో యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలు, ట్యాంకర్లు, హెలికాప్టర్లు పలు విన్యాసాలు ప్రదర్శించాయి. ఐఎన్ఎస్ సముద్రిక ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మిలాన్ విలేజ్‌ను తూర్పు నౌకాదళ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేవీ అధికారుల మధ్య స్నేహభావం, సాంస్కృతిక అనుబంధం బలోపేతమయ్యేందుకు మిలాన్ విలేజ్ దోహదపడుతుందని అన్నారు. ఆయా దేశాల మధ్య నౌకాదళ సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఐఎఫ్ఆర్ దోహదం చేస్తుందన్నారు. 1995లో నాలుగు దేశాలకు చెందిన నౌకాదళాలతో ప్రారంభమైన మిలాన్ విన్యాసాలు, ప్రస్తుతం 65కుపైగా దేశాలతో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ నెల 19న నిర్వహించే సిటీ పరేడ్‌లో 45 దేశాల మర్చంట్ కంటింజెంట్స్ పాల్గొంటాయన్నారు. అనంతరం మిలాన్ విలేజ్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను ఆయన సందర్శించారు.

సాగర తీరంలో నేవీ రిహార్సల్స్

ఐఎఫ్ఆర్, మిలాన్-2026 వేడుకల్లో భాగంగా తూర్పు నావికా దళం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం విశాఖ సాగర తీరంలో ఆర్‌కే బీచ్ వద్ద రిహార్సల్స్ జరిగాయి. యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, యుద్ధ నౌకలు, ట్యాంకర్లతో పలు విన్యాసాలు ప్రదర్శించారు. యుద్ధవిమానాల నుంచి జారవిడిచిన బాంబుల మోతతో సముద్ర తీరం దద్దరిల్లింది. యుద్ధ సమయాల్లో శత్రు మూకలను వాయు, సముద్ర మార్గాల్లో ఎదుర్కొనే తీరును కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు.

24న శశికళ కొత్త పార్టీ

చెన్నై, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి, అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు వీకే శశికళ కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం ఆమె తన నివాసంలో తన అనుయాయులతో వరుసగా భేటీ అవుతున్నారు. తన సన్నిహితురాలు జయలలిత జయంతి రోజైన ఫిబ్రవరి 24న పార్టీ స్థాపించాలని నిర్ణయించుకున్నారు. ఆ రోజున పార్టీ పేరు, చిహ్నం, విధివిధానాలను కూడా వెల్లడించనున్నారు.

రష్యా చమురు కొనబోమని భారత్ హామీ

- అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: రష్యా నుంచి చమురు కొనుగోళ్ల విషయంలో భారత్, అమెరికాల నుంచి పరస్పర విరుద్ధమైన ప్రకటనలు వస్తూనే ఉన్నాయి. శనివారం ఒకే వేదికపై నుంచి రెండు దేశాల విదేశాంగ మంత్రులు భిన్నమైన ప్రకటనలు చేశారు. మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో మాట్లాడుతూ.. రష్యా నుంచి అదనపు చమురును కొనబోమని భారత్ తమకు హామీ ఇచ్చిందని తెలిపారు. అదే కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ మాట్లాడుతూ.. నిర్ణయాలు తీసుకోవటంలో భారత్‌కు వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి ఉందని తెలిపారు. లభ్యత, ధర, రిస్క్‌లను బేరీజు వేసుకున్న తర్వాతే చమురు కంపెనీలు ఇంధన కొనుగోళ్లపై ముందుకెళ్తాయని తెలిపారు.

భారత్‌లో తొలి గో సంస్కృతి మ్యూజియం

మథుర, ఫిబ్రవరి 15: శాస్త్రపరంగా గో ఉత్పత్తుల విశిష్టతను తెలియ చెప్పే లక్ష్యంతో ఉత్తరప్రదేశ్ మథురలోని పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వెటెర్నరీ సైన్స్ యూనివర్సిటీ క్యాంపస్‌లో గో సంస్కృతి మ్యూజియం ఏర్పాటు చేయనున్నారు. బ్రజ్ తీర్థ్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో దేశంలోనే ఈ తరహాలో ఏర్పాటు చేసే తొలి మ్యూజియం ఇది. వందకు పైగా దేశవాళీ ఆవుల మోడల్స్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తారు. ఇదే చోట ఓ డైరీ పార్లర్ కూడా ఏర్పాటు చేసి ఆవు పాలు, పెరుగు, నెయ్యితో పాటు ఇతర గో ఉత్పత్తులను సాధారణ ప్రజానీకానికి అందుబాటులో ఉంచుతారు. గో ఉత్పత్తులతో కలిగే లాభాలను శాస్త్రపరంగా వివరిస్తారు.

ఏప్రిల్ 22 నుంచి కేదార్‌నాథ్‌లో పునఃదర్శనాలు

రుద్రప్రయాగ్, ఫిబ్రవరి 15: ఉత్తరాఖండ్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కేదార్‌నాథ్ ఆలయంలో దర్శనాలు తిరిగి ఏప్రిల్ 22న ప్రారంభం కానున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా ఉఖీమఠ్‌లోని ఓంకారేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు ఈ తేదీని ఖరారు చేసినట్లు బద్రీనాథ్- కేదార్‌నాథ్ ఆలయ కమిటీ అధికారులు తెలిపారు. బద్రీనాథ్ ఆలయం ఏప్రిల్ 23న, గంగోత్రి, యమునోత్రి ధామాలు ఏప్రిల్ 19న అక్షయ తృతీయ సందర్భంగా తిరిగి తెరుచుకోనున్నాయి.

ఆగండి.. మీ ఐడీ కార్డు చూపండి?

- మ్యూనిక్ సదస్సులో పాక్ ఆర్మీ చీఫ్‌ను ఆపిన భద్రతా అధికారి

బెర్లిన్, ఫిబ్రవరి 15: జర్మనీలో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిం మునీర్‌కు ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. మ్యూనిక్ అంతర్జాతీయ భద్రత సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన మునీర్‌కు ఊహించని షాక్ తగిలింది. అక్కడి భద్రతా సిబ్బంది ఆయన్ను ఆపి... ఐడీ కార్డు చూపించాలని అడిగారు. మునీర్ వేదిక వద్దకు వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది. ఓ మహిళా అధికారిణి.. 'ఆగండి.. మీ ఐడీ కార్డు ఎక్కడ? కనిపించేలా ఉంచండి' అంటూ మునీర్‌ను ఉద్దేశించి అన్నారు. దీంతో ఆయన కాస్త ఇబ్బంది పడ్డారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చర్చనీయాంశమైంది. పాక్ మాజీ సైనికాధికారి అదిల్ రాజా స్పందిస్తూ.. అంతర్జాతీయ వేదికలపై మునీర్‌ను ఎవరూ గుర్తించరని అన్నారు. గేట్ కీపర్లు ప్రశ్నించినా మునీర్ వినయంగా తనను తాను ఫీల్డ్ మార్షల్ అంటూ పరిచయం చేసుకుంటారని ఎద్దేవా చేశారు.

ప్రయాగ్‌రాజ్‌లో ముగిసిన మాఘ మేళా

ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 15: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించిన మాఘ మేళా ఆదివారం ముగిసింది. మౌనీ అమావాస్య సందర్భంగా జనవరి 18న ప్రారంభమైన ఈ మేళాకు శివరాత్రి పర్వదినం ముగింపు రోజు కావడం గమనార్హం. చివరి రోజున 40లక్షల మందికిపైగా భక్తులు పవిత్ర సంగమంలో పుణ్యస్నానాలు చేశారు. ఈ ఏడాది మాఘ మేళాకు మొత్తం 22 కోట్ల మంది భక్తులు వచ్చారని జిల్లా కలెక్టర్ మనీష్ కుమార్ వర్మ చెప్పారు.

విమానంలో బిగ్గరగా పాటలు వింటే చర్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: విమాన ప్రయాణాల్లో తోటి ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తూ, ఇయర్ ఫోన్లు లేకుండా బిగ్గరగా పాటలు వినేవారిపై కఠిన చర్యలు తప్పవని కేంద్రం హెచ్చరించింది. ఇలాంటి సందర్భాల్లో సదరు ప్రయాణికుడిని 'అన్‌రూలీ ప్యాసెంజర్' (క్రమశిక్షణలేని ప్రయాణికుడు)గా పరిగణించి విమానం నుంచి దించేయడం లేదా భవిష్యత్తులో ప్రయాణించకుండా నిషేధించడం వంటి చర్యలు తీసుకోవచ్చని స్పష్టం చేసింది. లోక్‌సభలో ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు విమానయాన శాఖ సహాయమంత్రి మురళీధర్ మోహోల్ సమాధానమిస్తూ, క్రమశిక్షణారహితంగా ప్రవర్తించే ప్రయాణికులపై చర్యలు తీసుకునేందుకు ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్1937 కింద ఇప్పటికే నిబంధనలు ఉన్నాయని చెప్పారు. ముందస్తు అనుమతి లేకుండా విమానాశ్రయాల్లో, విమానంలో ఉన్నప్పుడు ఫొటోలు తీయడం నిబంధనలకు విరుద్ధమని ఆయన గుర్తుచేశారు.

శక్తితోనే సాధించాం!



వాణిజ్య ఒప్పందాల్లో బలమైన స్థితిలో ఉండి చర్చలు

- పీటీఐ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ
- జాగ్రత్తగా తయారుచేసిన స్క్రిప్టు ప్రకారమే ఇంటర్వ్యూ: కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: అంతర్జాతీయంగా ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా స్థిరమైన వృద్ధితో భారత్ నేడు ప్రపంచానికి గొప్ప ఆర్థిక వృద్ధి కేంద్రంగా మారిందని ప్రధాని మోదీ అన్నారు. ఇతర దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద (ఎఫ్‌టీఏ) చర్చల్లో బలమైన స్థానంలో ఉండి బేరసారాలు నిర్వహించగలుగుతోందని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం వాణిజ్య ఒప్పందాల విషయంలో ఆత్మవిశ్వాసంతో బేరమాడే స్థితిలో లేకపోవటంతో ఒప్పందాలు కుదరలేదని విమర్శించారు. ప్రముఖ వార్తా సంస్థ పీటీఐకి ఆదివారం ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్ నుంచి వివిధ దేశాలతో ఎఫ్‌టీఏలు, దేశ వృద్ధి ప్రస్థానం, వికసిత్ భారత్ భవిష్యత్ లక్ష్యాలు తదితర అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

బలమైన స్థానంలో ఉండి బేరమాడాం


అమెరికాతో ట్రేడ్ డీల్ విషయంలో ప్రతిపక్షాల విమర్శలను ప్రధాని తిప్పికొట్టారు. 'ట్రేడ్ డీల్స్ చర్చల్లో బలమైన స్థానంలో ఉండి బేరసారాలు నిర్వహించామని తెలిపారు. 'ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశంలో రాజకీయ స్థిరత్వాన్ని పునరుద్ధరించటంతో పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరిగింది. దానివల్లే మేం బలమైన స్థితిలో ఉండి వాణిజ్య ఒప్పంద చర్చల్లో బేరసారాలు నిర్వహించగలిగాం. వస్త్రాలు, తోలు, కెమికల్స్, చేతివృత్తులు, రత్నాలు తదితర రంగాల్లో ఎంఎస్ఎంఈ పరిశ్రమలు మరింత విస్తరించేలా ఎఫ్‌టీఏలను డిజైన్ చేశాం' అని ప్రధాని మోదీ వివరించారు.

ప్రైవేటు రంగానిదే కీలకపాత్ర

దేశ అభివృద్ధిలో ఇకపై ప్రైవేటు రంగమే కీలక పాత్ర పోషించనుందని ప్రధాని తెలిపారు. ఆవిష్కరణలు, దీర్ఘకాలిక సామర్థ్యం, అంతర్జాతీయ పోటీని తట్టుకొనే విషయాల్లో ప్రైవేటు రంగ సంస్థలు ధైర్యంగా పెట్టుబడులు పెట్టడంపైనే వికసిత్ భారత్ తర్వాతి దశ ఆధారపడి ఉందని చెప్పారు. వికసిత్ భారత్ ఆవిష్కరణలో మహిళలు కీలకపాత్ర పోషించనున్నారని పేర్కొన్నారు. 'వచ్చే పదేళ్లలో నిర్మాణాత్మక సంస్కరణలు, శక్తిమంతమైన ఆవిష్కరణలు, పరిపాలనలో మరింత సరళత అనే మూడు లక్ష్యాల సాధనకు ప్రాధాన్యం ఇస్తాం. స్థిరమైన సంస్కరణలు, ప్రైవేటు రంగంలో ధైర్యంగా పెట్టుబడులు పెట్టడం, మౌలిక వసతుల కల్పనను కొనసాగించటం, డిజిటల్ పరివర్తనలపైనే దేశ వృద్ధి ఆధారపడి ఉంది. ప్రాథమిక స్థాయి నుంచి సంస్కరణలు చేపట్టడం వల్లనే నేడు ప్రపంచానికి భారత్ డిజిటల్ లీడర్‌గా ఎదిగింది. డాటా సెంటర్లు యువతకు భారీగా ఉద్యోగాలు కల్పించగలవు. అందుకే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కంపెనీలను మనదేశంలో డాటా సెంటర్లు ఏర్పాటుచేసేందుకు ఆహ్వానిస్తున్నాం. తర్వాతి తరం టెక్నాలజీ విప్లవానికి నాయకత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉంది' అని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు.

మా ప్రతి బడ్జెట్ ప్రత్యేకమే..

రాష్ట్ర, జాతీయ స్థాయిలో కలిపి తాను గత 25 సంవత్సరాలుగా ప్రభుత్వాధినేతగా ఉన్నానని మోదీ గుర్తు చేశారు. ఈ 25 ఏళ్లలో తాము రూపొందించిన ప్రతి బడ్జెట్ దేశాభివృద్ధిలో దేనికదే ప్రత్యేకమైనదని తెలిపారు. ఒక్కటి కూడా సాదాసీదా బడ్జెట్ కాదని పేర్కొన్నారు. ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ కూడా స్వల్ప కాలిక లక్ష్యాలతో రూపొందించినది కాదని, దేశ దీర్ఘకాలిక వృద్ధి లక్ష్యాలను సాధించేందుకు రూపొందించినదని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రపంచ వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మన రక్షణ రంగాన్ని ఆధునీకరించాల్సిన అవసరం ఉందని ప్రధాని తెలిపారు. అందులో భాగంగానే 2026-27 బడ్జెట్‌లో రక్షణ రంగానికి నిధులు పెంచినట్లు చెప్పారు. కాగా, ప్రధాని ఇంటర్వ్యూపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. చాలా జాగ్రత్తగా రూపొందించిన స్క్రిప్టు ప్రకారం ఇంటర్వ్యూ సాగిందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. ప్రధాని పబ్లిసిటీ స్టంటులో ఇదో భాగమని ఎద్దేవా చేశారు.



భారత పోలియో వ్యాక్సిన్‌కు డబ్ల్యూహెచ్‌వో ఆమోదం

- బయోలాజికల్-ఈ సంస్థ ఎన్‌వోపీవో-2కు ప్రీక్వాలిఫికేషన్

జెనీవా, ఫిబ్రవరి 15: కొత్త రకం పోలియో వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌లోని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ బయోలాజికల్-ఈ లిమిటెడ్ సంస్థ అభివృద్ధి చేసిన కొత్త ఓరల్ పోలియో వ్యాక్సిన్ (ఎన్‌వోపీవీ-2)కు ప్రీక్వాలిఫికేషన్(పీక్యూ) ఆమోదం తెలిపింది. ఈ వ్యాక్సిన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించడంతో డబ్ల్యూహెచ్‌వో దీనికి అనుమతి ఇచ్చింది. టైప్-2 పోలియో వైరస్ రకం వ్యాప్తిని అరికట్టడానికి, మెరుగైన జన్యు స్థిరత్వాన్ని అందించడానికి ఎన్‌వోపీవీ-2ను తయారు చేశారు. డబ్ల్యూహెచ్‌వో ఆమోదం లభించడంతో.. బయోలాజికల్-ఈ సంస్థ ఏడాదికి 600 మిలియన్ డోసుల వ్యాక్సిన్లు ఉత్పత్తి చేయగలదని అంచనా వేస్తున్నారు. ఇండోనేషియాకు చెందిన పీటీ బయో ఫార్మా నుంచి సాంకేతికతను పొందిన బయోలాజికల్-ఈ సంస్థ సొంతంగా ఈ టీకాలు ఉత్పత్తి చేస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా యూనిసెఫ్ సహా ఐరాస ఆధ్వర్యంలో పనిచేసే సంస్థలు ఈ టీకాలను కొంటాయి.

ఎన్‌వోపీవో-2 అత్యంత సురక్షితం..

'నోవెల్ ఓరల్ పోలియో వ్యాక్సిన్' (ఎన్‌వోపీవో-2) అనేది జన్యుపరమైన మార్పులు చేసిన కొత్తరకం పోలియో వ్యాక్సిన్. సాధారణ పోలియో టీకాలతో పోలిస్తే ఇది అత్యంత సురక్షితమైనది. కొత్తరకం పోలియో వైరస్ వ్యాప్తిని అరికట్టడంలో ఇది జన్యుపరంగా అధిక స్థిరత్వం కలిగి ఉంటుంది. 1980ల తర్వాత ప్రపంచవ్యాప్తంగా సాగిస్తున్న పోరాటంతో పోలియో 99 శాతానికిపైగా తగ్గింది. అయితే ఆఫ్రికా, ఆగ్నేయాసియాలోని కొన్ని ప్రాంతాల్లో ఇటీవల పోలియో వైరస్ కేసులు బయటపడ్డాయి.

రైతులకు మోదీ వంచన

వాణిజ్య ఒప్పందంతో దేశాన్ని అమ్మేశారు: రాహుల్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం విషయంలో ప్రధాని మోదీపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. ఆయన మన రైతులను వంచించారని, దేశాన్ని అమ్మేశారని ఆరోపించారు. ఇది అన్నదాతల భవిష్యత్‌కు సంబంధించిన అంశమన్నారు. భారత వ్యవసాయ పరిశ్రమపై పరాయిదేశం పెత్తనం దీర్ఘ కాలం కొనసాగేందుకు అనుమతిస్తున్నారా అని ఆదివారం 'ఎక్స్'లో నిలదీశారు. ప్రధానిపై ఈ సందర్భంగా ఐదు ప్రశ్నలు సంధించారు. ఇది ఇవాళ్టి వ్యవహారం కాదని.. భవిష్యత్‌కు కూడా సంబంధించిందని స్పష్టంచేశారు. పత్తి రైతులు, ఎగుమతిదారుల ప్రయోజనాల పరిరక్షణలో మోదీ ప్రభుత్వం విఫలమైందని ఆయన శనివారం కూడా ధ్వజమెత్తారు. బంగ్లాదేశ్‌తో వాణిజ్య ఒప్పందంతో అమెరికా ఆ దేశ జౌళి ఉత్పత్తులపై సుంకం మినహాయించిందని.. దీనివల్ల భారత జౌళి పరిశ్రమ సర్వనాశనమవుతుందని విమర్శించారు. ఇదిలా ఉండగా, యూపీఏ హయాంలో మంత్రి కపిల్ సిబల్.. 2010లో ఎప్‌స్టిన్ నిధులతో నడుస్తున్న సంస్థ నుంచి అవార్డు తీసుకున్నారని బీజేపీ తెలిపింది. దీనిపై రాహుల్‌గాంధీ పార్లమెంటులో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది.

రాహుల్ అడిగిన 5 ప్రశ్నలు

1. అమెరికా జన్యుమార్పిడి (జీఎం) పంట అయిన మొక్కజొన్న పొడిని దిగుమతి చేసుకోవడంలో అర్థమేమిటి? భారతీయ పశుసంపదతో ఈ జన్యు పొడిని తినిపిస్తారా? దీనివల్ల మన పాల ఉత్పత్తులు ఇక అమెరికాపై ఆధారపడాల్సిందేనా?
2. జీఎం సోయా నూనెను దిగుమతి చేసుకుంటే.. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర , రాజస్థాన్ సహా దేశవ్యాప్తంగా సోయా రైతులపై ప్రతికూల ప్రభావం పడదా?
3. అదనపు ఉత్పత్తుల దిగుమతి అంటే అందులో ఏమున్నాయి? పప్పులు.. ఇతర పంటలను అమెరికా నుంచి దిగుమతి చేసుకోవాలన్న ఒత్తిడికి ఇది సూచిక కాదా?
4. వాణిజ్యేతర అడ్డంకులు తొలగించాలంటే అర్థమేంటి? జన్యుమార్పిడి పంటలపై తన దృఢవైఖరిని భారత్ సడలించుకోవాలని.. పంటల సేకరణ, మద్దతు ధరలు, బోనస్‌లను కుదించాలని అమెరికా భవిష్యత్‌లో ఒత్తిడి తెస్తుందా?
5. ఒక్కసారి అమెరికా వ్యవసాయ దిగుమతులకు మన మార్కెట్ ద్వారాలు తెరిచామంటే ఏటికేడాదీ మరింత విస్తృతం చేయాల్సి ఉంటుంది. దీనిని అడ్డుకుంటారా.. లేక క్రమంగా మరిన్ని పంటలను దిగుమతి చేసుకుందామంటారా?

ప్యాకేజ్డ్ ఆహారంపై 'హెచ్చరిక' ఉండాల్సిందే!


ఆరోగ్యం ప్రాథమిక హక్కు.. రాజీపడే ప్రసక్తే లేదు

ఎఫ్ఎస్ఎస్ఏఐకు సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యంతో ఆటలాడొద్దని సుప్రీంకోర్టు ఎఫ్ఎస్ఎస్ఏను హెచ్చరించింది. ఆరోగ్యం ప్రజల ప్రాథమిక హక్కు అని స్పష్టం చేసింది. ప్రజారోగ్యం విషయంలో రాజీపడే ప్రసక్తేలేదని తేల్చిచెప్పింది. ఇకపై ప్యాకేజ్డ్ ఆహారంపై 'హెచ్చరిక' ముద్ర తప్పనిసరిగా ఉండాల్సిందేనని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ)ను ఆదేశించింది. ప్యాకెట్లలోని ఆహారంలో అధిక చక్కెర, ఉప్పు, కొవ్వుకు సంబంధించి వినియోగదారుడికి అర్థమయ్యేలా ప్యాకెట్ ముందు భాగంలోనే స్పష్టమైన హెచ్చరికల లేబుళ్లు తప్పనిసరి చేయాలని పేర్కొంది. ప్యాకేజ్డ్ ఫుడ్‌కు సంబంధించి '3ఎస్ అండ్ అవర్ హెల్త్ సొసైటీ' దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారించిన జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం ఈమేరకు ఆదేశాలు ఇచ్చింది. ప్యాక్ చేసిన ఆహార పదార్థాల్లో చక్కెర, ఉప్పు, కొవ్వు పదార్థాలు ఎంతమేర ఉన్నాయో తెలిపే 'ముందు వైపు హెచ్చరిక లేబుళ్ల' విషయంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ దాఖలు చేసిన అఫిడవిట్‌పై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్యాకెట్లపై స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పేర్కొంది. పిటిషనర్ తరపు న్యాయవాదివాదిస్తూ.. ప్యాకెట్లపై చక్కెర, సోడియం, కొవ్వుల మోతాదు గురించి బోల్డ్ అక్షరాలతో హెచ్చరికలు ఉంటేనే ప్రజలు అప్రమత్తం అవుతారని కోర్టుకు తెలిపారు. ఈ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం.. కేవలం చర్చలు, సమావేశాలతో కాలక్షేపం చేయొద్దని ఎఫ్ఎస్ఎస్ఏఐకి సూచించింది. ఈ అంశానికి సంబంధించి 4వారాల్లో సమగ్ర నివేదికతో రావాలని ఆదేశించింది.

స్పీకర్ తొలగింపుపై 9న చర్చ

అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో అదే రోజు ఓటింగ్.. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు వెల్లడి



తవాంగ్, ఫిబ్రవరి15: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై మలివిడత బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యే మార్చి 9న చర్చ జరుగుతుందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు వెల్లడించారు. అదే రోజు సభలో ఓటింగ్ కూడా జరుగుతుందన్నారు. ఆదివారం ఆయన అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్‌లో ఓ వార్తాసంస్థతో మాట్లాడారు. రెండో విడత సమావేశాలు మొదలయ్యే తొలి రోజునే అవిశ్వాస తీర్మానంపై చర్చ చేపట్టాలనేది సభా నిబంధనగా రిజిజు పేర్కొన్నారు. వచ్చే నెల 9 నుంచి ఏప్రిల్ 2 వరకు జరిగే మలివిడత సమావేశాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయని.. ముఖ్యమైన బిల్లులతో పాటు ఓ కీలక బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టబోతున్నామని తెలిపారు.ఆ బిల్లేమిటో ఇప్పుడే బహిర్గతం చేయబోమన్నారు. తొలి విడతలో మాదిరిగానే ఈసారి కూడా సభా కార్యకలాపాలను విపక్షాలు అడ్డుకుంటే.. అది వాటికే నష్టం చేస్తుందని హెచ్చరించారు. లోక్‌సభలో ఐదు శాఖలు, రాజ్యసభలో మరో ఐదు శాఖల బడ్జెట్‌కు సంబంధించిన డిమాండ్లపై చర్చ జరుగుతుందన్నారు. సభలు నడవడానికి విపక్షాలు సహకరించకపోతే గిలెటిన్ చేసుకుపోతామని హెచ్చరించారు. పశ్చిమబెంగాల్, తమిళనాడు, అసోం, కేరళ రాష్ట్రాల అసెంబ్లీలకు, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీకి ఏప్రిల్లో ఎన్నికలు జరగనున్నాయని గుర్తుచేశారు. కీలకమైన బిల్లు సహా ముఖ్యమైన బిల్లులు తెచ్చి వాటన్నిటినీ ఆమోదింపజేసుకుంటామని తెలిపారు. జమిలి ఎన్నికల బిల్లేనా అడుగగా.. ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదని.. పార్లమెంటరీ కమిటీ తన నివేదికకు ఇంకా తుది రూపం ఇవ్వలేదని చెప్పారు. చర్చలో పాల్గొనకుంటే విపక్షాలకే నష్టమని పునరుద్ఘాటించారు. వాటి మధ్య ఐక్యత లేదన్నారు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానంపై టీఎంసీ సంతకం చేయలేదని గుర్తుచేశారు.

తారిఖ్ రహ్మాన్ ప్రమాణ స్వీకారానికి ఓం బిర్లా

బంగ్లాదేశ్ ప్రధానిగా ఫిబ్రవరి 17న ప్రమాణస్వీకారం చేయనున్న తారిఖ్ రహ్మాన్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరుకానున్నారు. ఢాకాలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీని బంగ్లాదేశ్ ఆహ్వానించింది. అయితే స్పీకర్ ఓం బిర్లా భారత ప్రభుత్వం తరపున ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని విదేశీ వ్యవహారాల శాఖ ఆదివారం తెలిపింది.

ఎంపీ రేణుకా చౌదరికి ప్రివిలేజ్ నోటీసు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరికి సభా హక్కుల ఉల్లంఘన నోటీసు జారీ అయింది. ఒక వీధి కుక్కను తన కారులో పార్లమెంటు ప్రాంగణంలోకి తీసుకురావడంతోపాటు ఎంపీలపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై ఈ నోటీసు జారీ చేశారు. గత శీతాకాల పార్లమెంటు సమావేశాల సందర్భంగా రేణుకా చౌదరి తాను రక్షించిన ఒక వీధి కుక్కను కారులో పార్లమెంటుకు తీసుకెళ్లారు. దీనిపై అక్కడున్న కొందరు సభ్యులు అభ్యంతరం తెలిపారు. దీంతో "లోపల కూర్చున్న వారే కరుస్తారు.. కుక్కలు కరవవు" అని ఆమె అన్నారంటూ బీజేపీ ఎంపీలు బ్రిజ్‌లాల్, ఇందుబాల గోస్వామి ప్రివిలేజ్ నోటీసు ఇచ్చారు. ఎంపీలపై ధిక్కారపూరిత, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేశారని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ అంశం ప్రివిలేజ్ కమిటీ ముందుకు వెళ్లగా.. గతవారం జరిగిన సమావేశాల్లో కమిటీ దీనిపై చర్చించి ఆరోపణలపై ఈ నెల 23లోగా రాతపూర్వక సమాధానమివ్వాలంటూ రేణుకా చౌదరికి నోటీసు ఇచ్చింది. రేణుకాచౌదరి కార్యాలయవర్గాలు స్పందిస్తూ.. పార్లమెంటరీ నిబంధనలు, సంప్రదాయాల ప్రకారం సమాధానమిస్తామని తెలిపాయి.

వైట్ కాలర్ ఉగ్ర గ్రూపు!

- 'అన్సార్ ఇంటెరిమ్' పేరుతో ఏర్పాటు చేసిన 'ఉగ్ర' డాక్టర్లు
- ఢిల్లీ పేలుడు ఘటన దర్యాప్తులో సంచలన విషయాలు

న్యూఢిల్లీ/శ్రీనగర్, ఫిబ్రవరి 15: ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో గతేడాది జరిగిన కారు పేలుడు ఘటనపై దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఉగ్రవాదం వైపు ఆకర్షితులైన డాక్టర్లు అందరూ 'అన్సార్ ఇంటెరిమ్' అనే కొత్త ఉగ్రవాద గ్రూపును ఏర్పాటు చేసుకున్నట్లు వెల్లడైంది. వాస్తవానికి 'వైట్ కాలర్' టెర్రర్ మాడ్యూల్‌లో అరెస్టయిన డాక్టర్లందరూ 2016 నుంచి ర్యాడికలైజ్ అయినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. 'అన్సార్ ఇంటెరిమ్' గ్రూపు ద్వారా జమ్ముకశ్మీర్‌తో పాటు దేశవ్యాప్తంగా పలు ఇతర ప్రాంతాల్లో విధ్వంస కార్యకలాపాలకు పాల్పడాలనేది వారి లక్ష్యమని విచారణలో ఆ డాక్టర్లు చెప్పినట్లు తెలిసింది. క్రియాశీల ఉగ్రవాదులతో తమకున్న సంబంధాలన్నీ తెగిపోయినందున కొత్త గ్రూపు ఏర్పాటు చేయాల్సి అవసరం ఏర్పడిందని వారు వెల్లడించారు. నిందిత డాక్టర్లు ముజమిల్ గనీ, ఉమన్ ఉన్ నబీ, ఆదిల్, అతని సోదరుడు ముజఫర్‌తో పాటు మౌల్వీ ఇర్ఫాన్, కారీ అమీర్, తుఫైల్ ఘాజీలు 2022లో శ్రీనగర్‌లోని ఓ ఈద్గాలో సమావేశమయ్యారని ఓ అధికారి తెలిపారు. ఈ సమావేశంలో 'అన్సార్ ఇంటెరిమ్' గ్రూపును ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్నారు. దీనికి ఆదిల్‌ను చీఫ్‌గా నియమించుకున్నారు. మౌల్వీ ఇర్ఫాన్‌ను డిప్యూటీ చీఫ్‌గా, గనీ ట్రెజరర్‌గా అనుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

2023 నుంచి ఫెర్టిలైజర్ల కొనుగోలు

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ గ్రూపు 2023లో పేలుళ్లకు అవసరమైన ఫెర్టిలైజర్లను హరియాణాలోని సోహ్నా, నుహ్‌లలో కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఉమర్ సూచనల మేరకు, ఫరీదాబాద్‌లోని ఓ కెమికల్ దుకాణం నుంచి ఎన్‌పీకే (పొటాషియం నైట్రేట్)ను కొనుగోలు చేశారని అధికారులు చెప్పారు. ఇక, ఆదిల్ కొత్త ఉగ్ర గ్రూపులో సభ్యుల కోసం వేట కొనసాగించాడు. ఈ క్రమంలో దక్షిణ కశ్మీర్‌కు చెందిన డానిష్ అనే వ్యక్తిని ఫరీదాబాద్‌లోని అల్‌ఫలాహ్ యూనివర్సిటీలోని ఒక అద్దె రూమ్‌కు తీసుకొచ్చాడు. అక్కడ ఉమర్, గనీ టీఏటీపీ పేలుడు పదార్థాలను తయారు చేయడం వారిద్దరూ చూశారు. ఆ తర్వాత ఆత్మాహుతి దాడికి ఒప్పించడానికి డానిష్‌ను ఉమర్ ప్రయత్నం చేశాడు. అతను ఒప్పుకోకపోవడంతో పుల్వామాకు చెందిన 28 ఏళ్ల డాక్టర్ ఉమర్ ఎర్రకోట వద్ద కారులో భారీ పేలుడు పదార్థాలతో ఆత్మాహుతి దాడి చేశాడు.

3 రోజుల్లో 6వేల మంది ఊచకోత

- సూడాన్‌లో ఆర్ఎస్ఎఫ్ బలగాల మారణహోమం!
- ఐక్యరాజ్యసమితి నివేదికతో వెలుగులోకి

కైరో, ఫిబ్రవరి 15: ఆఫ్రికా దేశం సూడాన్‌లో పారామిలటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ (ఆర్ఎస్ఎఫ్) బలగాలు దారుణానికి పాల్పడ్డాయి. గతేడాది అక్టోబరు చివర్లో డార్ఫర్ ప్రాంతంలో ఈ బృందాలు జరిపిన క్రూరమైన హింసాకాండలో మూడు రోజుల్లోనే 6వేల మందికి పైగా మరణించారు. ఈ మేరకు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. సూడాన్ పశ్చిమ ప్రాంతంలోని ఎల్-ఫాషర్ నగరాన్ని స్వాధీనం చేసుకోవడంలో భాగంగా ఆర్ఎస్ఎఫ్ తీవ్రమైన యుద్ధ నేరాలకు పాల్పడిందని తెలిపింది. ఆర్ఎస్ఎఫ్, దాని అనుబంధ అరబ్ మిలిటెంట్లు 18 నెలల ముట్టడి అనంతరం గత అక్టోబరు 26న డార్ఫర్‌లో సూడన్ సైన్యానికి మిగిలిన ఏకైక బలమైన కోట ఎల్-ఫాషర్‌ను ఆక్రమించాయి. ఈ క్రమంలో ఎల్-ఫాషర్‌తో పాటు, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో విధ్వంసం సృష్టించాయి. అక్టోబరు 25, 27వ తేదీల మధ్య ఈ నగరంలో ఉంటున్న దాదాపు 4,400 మందిని హతమార్చగా, పారిపోవడానికి ప్రయత్నించిన మరో 1,600 మందిని బలగాలు ఊచకోత కోశాయి. ఇందులో సామూహిక హత్యలు, మరణశిక్షలు, లైంగిక హింస, అపహరణలు, నిర్బంధాలు తదితర దారుణాలకు పాల్పడినట్లు 29 పేజీల నివేదిక పేర్కొంది. వీటిలో చాలావరకూ దాడులు జాతి ఆధారంగానే జరిగాయని తెలిపింది. ఎల్-ఫాషర్‌లో సుమారు వారం రోజుల పాటు జరిగిన మారణకాండలో మృతుల సంఖ్య ఇంకా చాలా ఎక్కువగానే ఉండొచ్చని నివేదిక పేర్కొంది. అయితే ఈ నివేదికపై ఆర్ఎస్ఎఫ్ వర్గాలు స్పందించలేదు.


రాజమహేంద్రవరం కోటిలింగాల ఘాట్‌లో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తజనం


ఏలూరు జిల్లా పోలవరం మండలం పట్టిసీమ వద్ద భక్తుల రద్దీ


కోటప్పకొండలో విద్యుత్తు అలంకరణలో ఆలయం, కాంతులీనుతున్న భారీ విద్యుత్తు ప్రభలు

సర్వం.. శివోహం!

శంకరుడి నామస్మరణతో మార్మోగిన శైవాలయాలు

- రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- శ్రీశైలంలో కమనీయంగా స్వామి, అమ్మవార్ల కల్యాణం
- భక్తులతో కిక్కిరిసిన దక్షిణ కైలాసం 'శ్రీకాళహస్తి'
- కోటప్పకొండలో కొలువుదీరిన 23 విద్యుత్ ప్రభలు
- అనంతలో ఏకకాలంలో 15,800 బాణలింగాలకు అభిషేకం
- గోదావరి ఘాట్లలో 1.31 లక్షల మందికి పైగా పుణ్యస్నానాలు


కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, చిత్రంలో హోంమంత్రి అనిత, ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, కలెక్టర్ కృతికా శుక్లా

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా శంకరుడి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. 'ఓం నమఃశివాయ..' అంటూ భక్తులు చేసిన శివనామస్మరణతో మార్మోగాయి. రాష్ట్రంలోని ప్రముఖ శైవ క్షేత్రాలైన శ్రీశైలం, శ్రీకాళహస్తి, కోటప్పకొండతో పాటు అన్ని ఆలయాల్లో విశేషంగా పూజా కార్యక్రమాలు, నేత్రపర్వంగా అభిషేకాలు జరిగాయి. నంద్యాల జిల్లా శ్రీశైల మహాక్షేత్రంలో ఆదివారం రాత్రి పరమేశ్వరుడికి పాగాలంకరణ సేవను వైభవంగా నిర్వహించారు. దక్షిణ కైలాసంగా పేరుగాంచిన తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తిలో స్వయంభువుగా వెలసిన వాయులింగేశ్వర స్వామి నిత్యాభిషేక మూర్తిగా దర్శనమిచ్చారు. ఉదయం, రాత్రి సమయాల్లో శ్రీకాళహస్తీశ్వరుడు, ఆయన దేవేరి జ్ఞానప్రసూనాంబదేవి పురవిహారం చేశారు. పల్నాడు జిల్లాలో కోటప్పకొండ తిరునాళ్ల నేత్ర పర్వంగా జరిగింది. లక్షలాది మంది భక్తులు శ్రీ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ప్రభుత్వం తరపున స్వామికి విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పట్టువస్త్రాలు, వెండి ప్రభ సమర్పించారు. కార్యక్రమంలో హోంమంత్రి అనిత, ప్రభుత్వం చీఫ్ విప్ ఆంజనేయులు పాల్గొన్నారు. కోటయ్య తిరునాళ్లలో 23 భారీ విద్యుత్ ప్రభలు కొలువు తీరాయి. హైకోర్టు జడ్జిలు జస్టిస్ కృష్ణమోహన్, జస్టిస్ సురేష్‌రెడ్డి, జస్టిస్ పీవీ జ్యోతిర్మయి, జస్టిస్ వీ సుజాతతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతపురంలో ఏపీఐఐసీ డైరెక్టర్ చల్లా లక్ష్మీ ప్రసాద్ ఆధ్వర్యంలో మహాశివోత్సవం వైభవంగా నిర్వహించారు. దాదాపు 15,800 బాణలింగాలకు భక్తులు ఏకకాలంలో అభిషేకాలు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కోటిలింగాల రేవు, పుష్కర ఘాట్లలో 1.31 లక్షల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. పిఠాపురం, సామర్లకోట, ద్రాక్షారామ, కోటిపల్లి ఆలయాలు కిటకిటలాడాయి. ఏలూరు జిల్లా పోలవరం మండలం పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి దర్శనానికి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. మునునూరు మండలం బలివే రామలింగేశ్వర స్వామికి మహారుద్రాభిషేకం నిర్వహించారు. పుణ్యస్నానాలు చేసే భక్తులతో తమ్మిలేరు జనసంద్రంగా మారింది. మంత్రి కొలుసు పార్థసారథి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లాలోని పంచారామ క్షేత్రాలైన పాలకొల్లు క్షీరారామం, గునుపూడి సోమారామం భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. ఆచంటలో ఉమా రామలింగేశ్వరస్వామి రథోత్సవం వైభంగా సాగింది. విజయవాడలోని యనమలకుదురు శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 40కి పైగా ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


విజయవాడ యనమలకుదురులో ప్రభల ఊరేగింపు

శ్రీశైల మల్లన్నకు పాగాలంకరణ


నంది వాహనంపై విహరించిన ఆది దంపతులు


శ్రీశైలంలో అశేష భక్తజనం మధ్యన ప్రభోత్సవం

శ్రీశైల క్షేత్రంలో ఆదివారం రాత్రి మల్లికార్జునుడికి పాగాలంకరణ సేవను వైభవంగా నిర్వహించారు. లింగోద్భవకాల మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరుగుతుండగా ఆలయ ప్రధాన గోపురంపై కలశానికి తలపాగా చుట్టే కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. నవ నందులను కలుపుతూ చేసిన పాగాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అర్ధరాత్రి మల్లికార్జునస్వామి, భ్రమరాంబ అమ్మవార్ల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. అంతకుముందు సాయంత్రం జరిగిన ప్రభోత్సవంలో రెండున్నర లక్షల మంది భక్తులు పాల్గొన్నట్లు అంచనా. ఆ తర్వాత నంది వాహనంపై అధిష్ఠింపజేసి స్వామి, అమ్మవార్ల ఉత్సమూర్తులకు పుష్పార్చన, ఆలయోత్సవం నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ పురవిహారం


అప్పన్న సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి


కప్పస్తంభం వద్ద సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్


సింహాచలం/పెందుర్తి (విశాఖపట్నం), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ ఆదివారం దర్శించుకున్నారు. సింహగిరికి చేరుకున్న న్యాయమూర్తికి ఈవో జె.వెంకటరావు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ పూర్తిచేసిన న్యాయమూర్తికి గోత్రనామాలతో అంతరాలయంలో పూజలు చేసి, శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు ఆశీర్వచనాలిచ్చారు. ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని ప్రసాదాలను, ఆలయ శిల్పసంపదతో రూపొందించిన పుస్తకాన్ని అందజేశారు. అప్పన్న దర్శనానంతరం జస్టిస్ సంజయ్ కరోల్ చినముషిడివాడలోని శారదా పీఠాన్ని సందర్శించారు. పీఠం అధిష్ఠాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారికి విశేష పూజలు చేశారు.

ప్రవాసీయులకు బడ్జెట్‌లో పెద్దపీట.. గల్ఫ్ దేశాలలో హర్షం

(ఆంధ్రప్రదేశ్ గల్ఫ్ ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ వార్షిక బడ్జెట్‌లో ప్రవాసీయుల సంక్షేమానికి పెద్దపీట వేశారని తెలుగుదేశం పార్టీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధాకృష్ణ, సౌదీ అరేబియాలోని తెలుగుదేశం పార్టీ నాయకులు జానీ బాషా, రాజశేఖర్ చెన్నుపాటి హర్షం వ్యక్తం చేశారు. ప్రవాసీయుల సాధకబాధలపై స్పందించిన తెలుగుదేశం ప్రభుత్వం ఏపీ ఎన్నార్టీ సంస్థకు 11 కోట్ల 22.56 లక్షలను కేటాయించిందని, ఇది గత కేటాయింపులకు రెట్టింపని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దుబాయి, ఇతర విదేశీ పర్యటనల సందర్భంగా ప్రవాసీయులకు ఇచ్చిన హామీ మేరకు బడ్జెటు కేటాయింపులు జరిగాయని తెలిపారు. ప్రవాసీయుల సంక్షేమానికి ఉద్దేశించిన ఈ కేటాయింపు పొరుగున ఉన్న తెలంగాణతో సహా దేశంలోని అనేక ఇతర రాష్ట్రాలలో కూడ లేదని రావి రాధాకృష్ణ పేర్కొన్నారు.

వ్యాపారవేత్త, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య మృతి



విజయవాడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ప్రముఖ వ్యాపారవేత్త, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య (96) ఆదివారం కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన దుర్గాపురంలోని స్వగృహంలో ఉదయం 11 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయన తల్లిదండ్రులు ఐలాపురం రామయ్య, కోటమ్మ. సతీమణి ఇందిరాదేవి. వెంకయ్య దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఐదుగురు కుమారులు ఉన్నారు. ప్రస్తుత పల్నాడు జిల్లాలోని రెంటచింతల మండలం తుమ్మకోట గ్రామంలో వెంకయ్య జన్మించారు. 9వ తరగతి వరకు అక్కడే చదువుకుని మధ్యలో ఆపేశారు. అక్కడి నుంచి కాలినడకన విజయవాడ వచ్చేశారు. విజయవాడకు వచ్చాక కూలీగా పనిచేశారు. సున్నపు బట్టీలో పనిచేశారు. పలువ్యాపారాలు చేసి, ఒకస్థాయికి వచ్చాక 1991లో గాంధీనగర్‌లో ఐలాపురం పేరుతో హోటల్‌ను నిర్మించారు. అప్పటి నుంచి ఆతిథ్యరంగంలో స్థిరపడ్డారు.

తుది వరకు కాంగ్రెస్‌లోనే..

వెంకయ్య తొలి నుంచి కాంగ్రెస్‌కు వీరాభిమాని. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొన్నప్పటి నుంచి ఆ పార్టీలోనే చివరి వరకు కొనసాగారు. 2004లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. రెండేళ్ల తర్వాత రిటైరయ్యారు. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రెండోసారి ఎమ్మెల్సీ అవకాశం ఇచ్చారు. మళ్లీ స్థానిక సంస్థల కోటాలో మండలికి ఎన్నికయ్యారు. ఆయన పెద్దకుమారుడు రాజా ఆర్టీఐ కమిషనర్‌గా పనిచేశారు. కాగా, వెంకయ్య మృతికి సీఎం చంద్రబాబు, సీపీఐ నేత కె.నారాయణ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. వెంకయ్య మృతదేహాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఆర్టీఐ మాజీ కమిషనర్లు రమణకుమార్, కట్టా జనార్దన్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ దర్శించినివాళులర్పించారు.

సురక్షిత ప్రయాణం.. డ్రైవర్‌కు ఏదీ?

- స్టీరింగ్‌పై వాలిపోతున్న రథ సారథులు
- ఏపీఎస్ఆర్టీసీ డ్రైవర్లలో పెరుగుతున్న గుండెపోట్లు
- గత మూడేళ్లలో 910 మంది మృతి
- డ్రైవర్ల ప్రాణాలు కాపాడుకోకుంటే ఆర్టీసీకే నష్టం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రయాణికుల ప్రాణాలు డ్రైవర్ చేతిలో ఉంటాయి. మరి డ్రైవర్ ప్రాణాలకే ముప్పు ఏర్పడితే?.. సురక్షిత ప్రయాణానికి భరోసా ఇస్తోన్న ఏపీఎస్ఆర్టీసీలో ఇప్పుడు డ్రైవర్ల ప్రాణాలకు భరోసా లేకుండా పోయింది. బస్సు నడుపుతున్న సమయంలోనే గుండెపోటు రావడంతో డ్రైవర్లు స్టీరింగ్‌పై వాలిపోతున్నారు. ప్రయాణికుల్ని భద్రంగా గమ్యానికి చేర్చాల్సిన రథసారథులే మార్గ మధ్యలో లోకాన్ని వీడి వెళ్లి పోతున్నారు. ప్రయాణికుల వెన్నులో వణుకు, డ్రైవర్ల కుటుంబాల్లో కన్నీరు పెట్టిస్తున్న ఈ సమస్య ఆర్టీసీకి పెను సవాలుగా మారింది. ఏటా 250 నుంచి 350 మంది చొప్పున గత మూడేళ్లలో 910 మంది డ్రైవర్లు గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయారు.

పని ఒత్తిడి.. నిద్రలేమి కారణాలు

డ్రైవర్ల గుండెపోటు మరణాలకు ప్రధానంగా పని ఒత్తిడి, పని వేళలు, నిద్రలేమి, ఆహార అలవాట్లు కారణాలుగా చెబుతున్నారు. ఇందులో మొదటి రెండూ తగ్గాలంటే డ్రైవర్ల నియామకాలను ఆర్టీసీ చేపట్టాలి. నిద్రలేమి, ఆహార అలవాట్లు పూర్తిగా డ్రైవర్ల చేతిలోనే ఉన్నాయి. ఏటా వందల మంది డ్రైవర్లు ఎందుకు గుండెపోటుతో మరణిస్తున్నారంటే.. ఆ నాలుగింటినీ జయించడం అటు ఆర్టీసీ యాజమాన్యానికి, ఇటు డ్రైవర్లకు కష్టసాధ్యంగా మారింది. ఏ సంస్థ అయినా మనుగడ సాగించాలంటే ఆదాయమే అన్నింటికన్నా ముఖ్యం. ప్రతి రోజూ లక్షలాది మంది ప్రయాణికుల్ని గమ్యం చేరుస్తున్న ఆర్టీసీలో ఆక్యుపెన్సీ రేషియో ఆధారంగానే నిర్ణయాలు ఉంటాయి. ఆర్టీసీ డ్రైవర్లకు ప్రైవేటు రవాణాతో పోలిస్తే ఎక్కువ జీతాలు ఉన్నందున పని గంటలు కూడా పెంచాలని, అలా చేయకపోతే సంస్థ మనుగడ కష్టమని ఉన్నతాధికారులు చెబుతున్నారు. 'జీతాలు ఎక్కువ తీసుకొంటూ తక్కువ సమయం పనిచేస్తే సంస్థ మనుగడ కోసం ప్రయాణికులపై చార్జీల భారం వెయ్యాలి. ప్రైవేటు పోటీతోపాటు, ద్విచక్ర వాహనాలు వినియోగించే వారి సంఖ్య పెరిగింది. ఈ పరిస్థితుల్లో ప్రయాణ చార్జీలు పెంచితే ఆక్యుపెన్సీ తగ్గిపోయి ఆర్టీసీ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుంది' అని ఒక ఉన్నతాధికారి వివరించారు. 'ఆర్టీసీ బస్సు నడిపే డ్రైవరు.. ఆదాయం తీసుకొచ్చే కండక్టరు.. బస్సు ఆరోగ్యాన్ని పరిరక్షించే మెకానిక్.. రవాణ సంస్థ మనుగడలో ముందుంటారు. వారే పని ఒత్తిడితో ప్రాణాలు కోల్పోతుంటే సంస్థ బాగుంటుందా? ఆ కార్మికుడి కుటుంబం బాగుంటుందా? పెద్ద పెద్ద బస్టాండ్లలోనైనా రెస్ట్ రూమ్‌లు బాగున్నాయా? పదిపన్నెండు గంటలపాటు డ్యూటీ చేస్తున్న కార్మికుడిపై మరింత పని భారం మోపితే సమస్యకు పరిష్కారం లభించదు. తగినంత పని, తగినంత విశ్రాంతి ఇస్తే డ్రైవర్ ఆరోగ్యంతోపాటు ఆర్టీసీ మనుగడ కూడా బాగుంటుంది. కొత్త బస్సులు కొనుగోలు చేసి రిక్రూట్మెంట్లు చేపడితే ఆక్యుపెన్సీ పెరిగి సంస్థ ఇంకా బాగుంటుంది' అని ఉద్యోగ సంఘాల నేతలు అంటున్నారు.

డ్రైవర్లకు వైద్య పరీక్షలు ఏవీ?

ప్రతి రోజూ లక్షల ప్రయాణికుల్ని గమ్య స్థానాలకు చేర్చే ఆర్టీసీ డ్రైవర్ల ఆరోగ్యం.. ఆ ఉద్యోగి సంక్షేమం మాత్రమే కాదు.. ప్రజల భద్రతకు సంబంధించినది. ప్రైవేటుతో పోలిస్తే ఆర్టీసీ కొంతమేర సురక్షితమేనని ప్రజలు కూడా విశ్వసిస్తున్నారు. డ్రైవర్లు స్టీరింగ్‌పై వాలిపోయి ప్రాణాలు కోల్పోతున్నా ప్రయాణికుల్ని మాత్రం రక్షిస్తూనే ఉన్నారు. ప్రతి సారీ, ప్రతి డ్రైవర్ ఇలా కాపాడటం సాధ్యమేనా? అనే ప్రశ్న తలెత్తుతోంది. రవాణా, కార్మిక భద్రతా నిబంధనల ప్రకారం వాణిజ్య వాహనాలు నడిపే డ్రైవర్లకు నిర్దిష్ట వ్యవధిలో వైద్య పరీక్షలు చేయాలి. కంటి చూపు, వినికిడి, శారీరక, మానసిక సమస్యలతోపాటు గుండె ఆరోగ్యాన్ని పరీక్షించి వైద్యుల నివేదిక ప్రకారం మందులు, ఆహార అలవాట్లకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఏపీఎస్ఆర్టీసీ రికార్డుల ప్రకారం 45 ఏళ్లలోపు వయసున్న డ్రైవర్లకు ప్రతి రెండేళ్లకు, అది దాటిన వారికి ఏడాదికి ఒకసారి వైద్య పరీక్షలు జరుగుతున్నాయి. ఇందులో ఎక్కువగా రాత్రుల్లో వాహనం నడిపేవారు, దూర ప్రాంతాలకు వెళ్లే డ్రైవర్లు ఎక్కువగా అనారోగ్యం బారిన పడుతున్నట్లు వెల్లడవుతోంది.

కాలం చెల్లిన బస్సులు.. వయసు మళ్లిన డ్రైవర్లు

ఆర్టీసీ ప్రధాన నినాదమైన సురక్షిత ప్రయాణానికి.. బస్సు కండీషన్, డ్రైవర్ ఆరోగ్యం కీలకం. సంస్థలో ఇప్పుడు ఈ రెండూ బాగాలేవు. కాలం చెల్లిన బస్సులు సగానికి పైగా ఉంటే వయసు మళ్లిన డ్రైవర్లు అంతకన్నా ఎక్కువగా ఉన్నారు. ఆర్టీసీలో సొంత బస్సులు 8 వేలు ఉండగా.. వాటిలో 5 వేల బస్సులు కాలం చెల్లినవే. డ్రైవర్ల వయసు సరాసరి 50 ఏళ్లు దాటింది. ప్రజారవాణా మార్గదర్శకాల మేరకు సగటు వయసు 37-39 ఏళ్ల మధ్య ఉండాలి. 2011 తర్వాత డ్రైవర్ల రిక్రూట్మెంట్లు లేవు. ఈ ఏడాది 2600మంది పదవీ విరమణలో ఉండగా, 2030 నాటికి 7 వేల మందికిపైగా పదవీ విరమణ చేయనున్నారు. సొంత బస్సులు 8,250 ఉండగా అందులో 15 లక్షల కిలోమీటర్లు దాటినవి 2,900 ఉన్నాయి. కేంద్ర రవాణా శాఖ మార్గదర్శకాల మేరకు 15 లక్షల కిలోమీటర్ల లోపే రవాణా వాహనాలను తిప్పడం ఆపేయాలి. ఆర్టీసీలో 12లక్షల కిలోమీటర్లు దాటితే పక్కన పెట్టేసే పద్ధతి ఒకప్పుడు ఉండేది. ఇప్పుడున్న బస్సుల్లో 5 వేలకు పైగా 12 లక్షల కిలోమీటర్లు దాటి తిరిగినవే. ఓ అసోసియేషన్ ప్రతినిధి మాట్లాడుతూ 'వెహికల్ యుటిలైజేషన్ ప్రకారం గతంలో 350 కిలోమీటర్లు తిరిగితే రెండు డ్యూటీల కింద లెక్క. ఇప్పుడు 500కు పెంచారు. కాణిపాకం నుంచి తిరుపతికి గతంలో నాలుగు ట్రిప్పులు తిరిగేవి.. ఇప్పుడు ఐదు ట్రిప్పులు తిరగమంటున్నారు. అడిగితే అప్పుడు రోడ్లు బాగలేవు.. ఇప్పుడు బాగున్నాయి కదా అంటున్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 7వరకూ తిప్పే డ్రైవరుకు మరో గంట పెంచితే రోజుకు 14 గంటల డ్యూటీ చేసినట్లు.. ఇలా పని భారం పెరిగితే రిటైర్మెంట్ వరకూ అయినా బతుకుతామా?' అని వాపోయారు.

మానసిక ఒత్తిడి ప్రధాన సమస్య: ఎంప్లాయీస్ అసోసియేషన్

ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్‌రావు మాట్లాడుతూ.. దీర్ఘకాలిక పనిగంటలతోపాటు మానసిక ఒత్తిడి కూడా గుండె జబ్బులకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. 'దూర ప్రాంత డ్రైవరుకు తగినంత విశ్రాంతి లభించడం లేదు. అంతర్రాష్ట్ర సర్వీసులు, పల్లె వెలుగుల్లో స్త్రీ శక్తి రద్దీకి అనుగుణంగా బస్సుల కండీషన్ లేదు. కొత్త బస్సులు కొనకుండా, డ్రైవర్ల సంఖ్య పెంచకుండా ఉన్న బస్సులతోనే నడిపించడం. మైలేజీ రాలేదని అడగటం. బస్సుకు చిన్న డ్యామేజీ జరిగినా డ్రైవర్ జీతం నుంచి కట్ చేయడం' కారణాలుగా పేర్కొన్నారు.

ఆహార అలవాట్లే: అధికారులు

ఉన్నతాధికారులు మాత్రం 'ప్రజలకు ఆర్టీసీ 24గంటలు, 365రోజులు సేవలు అందించాల్సిందే. ఇది తెలిసే డ్రైవర్లు ఉద్యోగంలో చేరారు కదా. పని ఒత్తిడి అందరికీ ఉంటుంది. చాలామంది అదనపు డ్యూటీలు చేసి తగిన వేతనం తీసుకొంటున్నారు. ఆరోగ్య సమస్యలకు ప్రధాన కారణం ఆహార అలవాట్లు. దూర ప్రాంత బస్సు డ్రైవర్లు ఎక్కడ పడితే అక్కడ నాణ్యత లేని ఆహారం తింటుంటారు. సమయ పాలన కూడా కుదరకపోవచ్చు. యాజమాన్యం క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయిస్తోంది. డ్రైవర్లు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి' అని చెబుతున్నారు.

వెయ్యి కిలోల గంజాయి స్వాధీనం.. ఐదుగురి అరెస్టు

- ఒడిశా నుంచి అనకాపల్లి జిల్లాకు తరలిస్తూ పట్టుబడ్డ నిందితులు

పాడేరురూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం మత్స్యపురం జంక్షన్ వద్ద 1,000 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్టు చేశారు. డీఎస్పీ ఆర్‌వీఎస్ అభిషేక్ తెలిపిన వివరాలు.. శనివారం రాత్రి జి.మాడుగుల పోలీసులు మత్స్యపురం జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు చేస్తూ ఒడిశా వైపు నుంచి వస్తున్న వ్యాన్‌ను ఆపారు. డ్రైవర్ కిందకు దిగి పరారయ్యాడు. పోలీసులు వ్యాన్‌ను తనిఖీ చేయగా గోనె సంచుల్లో గంజాయి కనిపించింది. వ్యాన్‌లో ఉన్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి, అనకాపల్లి జిల్లా వడ్డాది గ్రామానికి తరలిస్తున్నట్టు నిందితులు చెప్పారు. వీరిలో ముగ్గురిని అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల, పెదబయలు మండలాలకు, ఒకరు అనకాపల్లి జిల్లాకు, మరొకరు ఒడిశాలోని కొత్తూరుకు చెందిన వారిగా గుర్తించారు. నిందితులను సోమవారం కోర్టుకు తరలిస్తామని డీఎస్పీ తెలిపారు.

'భూపతి చంద్ర' కథానికల పోటీ విజేతలు

'భూపతి చంద్ర' మెమోరియల్ ట్రస్ట్, ప్రజ్ఞాపురం నిర్వహించిన కథానికల పోటీ విజేతలకు పురస్కారాల ప్రదానం ఫిబ్రవరి 19 సా.5గంటలకు తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్, ఆబిడ్స్ హైదరాబాద్‌లో జరుగుతుంది. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు వరుసగా సుంకోజి దేవేంద్రాచారి, పొత్తూరి సీతారామరాజు, పుప్పాల కృష్ణమూర్తి; ప్రోత్సాహక బహుమతులకు ఎం. సుగుణ రావు, చొక్కర తాతారావు, మొయిద శ్రీనివాసరావు, ఉయ్యూరు అనసూయ, మధుసూదన రావు ఎంపికయ్యారు.

ఎమ్.ఎల్. కాంతారావు

తెలంగాణ సాహితి లిటరరీ ఫెస్ట్

తెలంగాణ సాహితి లిటరరీ ఫెస్ట్ – 2026 ఫిబ్రవరి 21, 22 తేదీల్లో ఏవి కళాశాల, హైదరాబాద్‌లో జరుగుతుంది. కవిత్వం, కథ, నవల, పాట, విమర్శ, మహిళా, యువ సాహిత్యాలపై చర్చలు ఉంటాయి. అతిథులుగా– నందిని సిధారెడ్డి, గోరటి వెంకన్న, శివలింగప్ప (కన్నడ), ఆరీఫ్ రాజా, ఏనుగు నరసింహారెడ్డి, నామోజు బాలాచారి తదితరులు పాల్గొంటారు.

అనంతోజు మోహన్ కృష్ణ

'ఎరిక' రెండవ సమావేశం

'ఎరిక: కళింగ సాహిత్య పాఠశాల' రెండవ సమావేశం ఫిబ్రవరి 21 ఉదయం పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతుంది. 'కళింగ సాహిత్యం – గమ్యం గమనం' అంశంపై గంటేడ గౌరునాయుడు విద్యార్థులతో మాట్లాడుతారు. టి. శ్రీవరం, డి. రామయ్య, మల్లిపురం జగదీశ్ పాల్గొంటారు.

ఎరిక

'అన్వేషణ' నవలా పరిచయం

స్నేహ కళా సాహితి నిర్వహణలో శిరంశెట్టి కాంతారావు 'అన్వేషణ' నవల పరిచయం ఫిబ్రవరి 22 ఉదయం 10 గంటలకు వేదాంత కళాశాల పార్వతిపురంలో జరుగుతుంది. పొట్నూరు చిన్నం నాయుడు పరిచయం చేస్తారు. గంటేడ గౌరునాయుడు, పక్కి రవీంద్రనాథ్, చందనపల్లి గోపాల్ తదితరులు పాల్గొంటారు.

మల్లిపురం జగదీశ్

కొలకలూరి పురస్కారాల విజేతలు

కొలకలూరి భాగీరథీ కథానికా పురస్కారం రూ. 20 వేల బహుమతికి పలమనేరు బాలాజీ 'ఏకలవ్య కాలనీ', రూ.10 వేల బహుమతికి స్వర్ణ కిలారి 'నల్ల బంగారం'; కొలకలూరి విశ్రాంతమ్మ నవలా పురస్కారం రూ. 20వేల బహుమతికి బి.నాగశేషు 'ఏకు దారం'; కొలకలూరి రామయ్య విమర్శన పురస్కారం రూ.20వేల బహుమతికి కెంగార మోహన్ 'చెమట చెక్కిన వాక్యం', రూ.10వేల బహుమతికి ఎం.వి. రామిరెడ్డి 'విస్తార' పుస్తకాలు ఎంపికయ్యాయి. పురస్కార ప్రదానం ఫిబ్రవరి 26 సా.6గంట లకు తెలుగు విశ్వ విద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది.

కొలకలూరి మధుజ్యోతి

అసలు ఊహించామా ఇంతమంది పాఠకులను!

2022 వరకూ తెలుగు సాహిత్య స్థితిగతులు బయట ప్రపంచం దృష్టిలో పెద్ద చడీచప్పుడు లేకుండా ఉండేవి. ఉన్న కొద్దిమంది రచయితలో వారిలో వారు సాహిత్యాన్ని గురించి, రచనలను గురించి చర్చించుకుంటూ ఉండేవారు. ఒకరు రాసింది ఇంకొకరు చదవరనీ, సాహిత్యం పట్ల యువతలో ఆసక్తి సన్నగిల్లిపోతోందనీ రకరకాలుగా మాట్లాడుకుంటూ ఉండేవారు. ఈ పరిస్థితిని మార్చడానికి తోచిన పద్ధతిలో కొంతమంది సాహిత్యవేత్తలు, ప్రభుత్వేతర సంస్థలు ప్రయత్నాలు చేస్తూండేవి. నవలల పోటీలు నిర్వహించడం, ఉత్తమ కథలను ఎంపిక చేసి సంచికలు తీసుకురావడం వగైరా ప్రయత్నాలు అందులో భాగంగా ఉండేవి. కానీ, ఇవేమీ ఆ కాస్త సాహిత్యలోకాన్నీ దాటుకుని పుస్తకాలు ముట్టుకోని జనాలపై ప్రభావం చూపించేవి కాదు. ఎవరైనా పుస్తకాలు చదవడానికి ఆసక్తి చూపించినా ఇళ్ళలో పెద్దవాళ్ళ నుంచి కాలేజీ లెక్చరర్ల వరకూ ప్రతీవారూ ఇంగ్లీష్ పుస్తకాలు చదవమని ప్రోత్సహించేవారు. ఇంగ్లీష్ పుస్తకాలు చదివితే కనీసం ఇంగ్లీష్ అయినా నేర్చుకోవచ్చు అని ఉచిత సలహాలు వచ్చేవి. ఇక క్రమేపీ డిజిటల్ కంటెంట్, అందులోనూ రీల్స్, షార్ట్స్ వంటివి ప్రాచుర్యం చెందుతూ ఉండడంతో అసలంటూ పుస్తకాలకే చోటు తగ్గిపోతున్న ప్రపంచంలో తెలుగు పుస్తకాలకు కాలం చెల్లిపోయినట్టే అందరూ భావించారు. మొత్తంగా, ఒక పుస్తకం 2000 నుంచి 4000 వేల కాపీలు విడుదలైన కొద్ది సంవత్సరాల్లో అమ్మగలిగితే అప్పట్లో గొప్ప విజయం సాధించినట్టే. బహుశా, కొద్ది మినహాయింపులు తప్ప పలు భారతీయ భాషల సాహిత్యవేత్తలు, పాఠకులు ఈ పరిస్థితిని రిలేట్ చేసుకోగలరు అనుకుంటాను.



ఇండస్ట్రియలైజ్డ్ ఎంట్రన్స్ ఎగ్జామ్ కోచింగ్ మోడల్ వల్ల భాషకు, సాహిత్యానికి దూరమైన తరాలు తిరిగి వాటివైపు ఆకర్షితులవుతున్నాయా? షార్ట్ ఫామ్ కంటెంట్‌కి అడిక్ట్ అయ్యారనీ, భారతీయ భాషల పట్ల ఆసక్తి చూపట్లేదనీ అంతా భావించే యువత తిరిగి లాంగ్‌ఫామ్ కంటెంట్ వైపు వస్తున్నారనేందుకు, అందులోనూ భారతీయ భాషల పుస్తకాలపై ఆసక్తి చూపుతున్నారనేందుకు ఈ ట్రెండ్ తొలి సంకేతమా?


అయితే, 2024–25 సంవత్సరాల్లో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 2023 వరకూ తెలుగులో అత్యధికంగా అమ్ముడుపోయిన పుస్తకాల కేటగిరీలో కొన్ని వేల కాపీలు అమ్ముడైన పుస్తకాలూ, ఆంగ్ల బెస్ట్ సెల్లర్ల తాలూకు అనువాదాలూ, కొన్ని దశాబ్దాల క్రితం నాటి క్లాసిక్స్ వంటివి ఉండడం పరిపాటి కాగా ఈ స్థితి 2024 నాటికి మారిపోయింది. ఐర్లాండ్‌లో స్థిరపడ్డ ఎన్నారై రవి మంత్రి రాసిన ఒక కొత్త ప్రేమకథాత్మక నవల – 'అమ్మడైరీలో కొన్ని పేజీలు' 2024 సంవత్సరంలోనే కొన్ని నెలల వ్యవధిలో వేగం పుంజుకుని లక్ష కాపీలు అమ్ముడై సంచలనం సృష్టించింది. ఈ నవల ఇదే వేగాన్ని 2025లోనూ కొనసాగిస్తూ లక్షా డెబ్బై అయిదువేల కాపీలు అమ్ముడైంది. పైగా పుస్తకాలు పట్టుకోరన్న అభిప్రాయం ఉన్న యువతలోకి ఈ నవల చొచ్చుకుపోవడం చాలామంది సాహిత్యపరులకు ఆశ్చర్యకరంగా తోచింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ నవల చదువుతున్నట్టు వీడియోలు చేయటం, చదివి రివ్యూలు పోస్ట్ చేయడం ఒక ట్రెండ్‌గా మారింది. ఇన్ని పుస్తకాలు నిజంగా అమ్ముడు కావట్లేదని, ఇదంతా కేవలం మార్కెటింగ్ గిమ్మిక్ కావచ్చని ఈ పరిణామాన్ని చూసి సందేహపరులు అనుమానించారు. అయితే, జాతీయ స్థాయిలో అమెజాన్ ట్రెండ్స్‌లో యువల్ నోవా హరారీ, సుధామూర్తి, అరుంధతీ రాయ్ వంటివారి రచనలను, 'సైకాలజీ ఆఫ్ మనీ', 'అటామిక్ హేబిట్స్' లాంటి పుస్తకాలను దాటుకుని నెంబర్ 1 సెల్లర్‌గా నెలల పాటు నిలబడుతూ ఉండడమూ, చివరకు 2014లో అమెజాన్ ఇండియా ప్రకటించిన టాప్ 10 పుస్తకాల్లో రెండోస్థానంలో నిలవడమూ ఈ సందేహాలను పటాపంచలు చేశాయి. హైదరాబాద్ బుక్ ఫెయిర్, విజయవాడ బుక్ ఫెయిర్ వంటిచోట్ల కూడా ఈ పుస్తకాన్ని జనం కొనడమూ, రచయిత భారతదేశానికి తిరిగివచ్చినప్పుడు హైదరాబాద్‌లో జరిగిన వివిధ 'మీట్ ద ఆథర్' కార్యక్రమాలకు భారీ స్పందన రావడమూ వంటివి కూడా ఈ కొత్త పరిణామాన్ని కళ్ళకు కట్టాయి.

రవి మంత్రి 2024లోనే ఆన్‌లైన్‌లో కాంటెంట్ క్రియేటర్‌గా, ఇన్‌ఫ్లుయెన్సర్‌గా విజయవంతం అవుతూ ఉండడంతో ఇదంతా కేవలం ప్రచారార్భాటం వల్ల జరిగిన ఒక వన్ ఆఫ్ పరిణామం అని తెలుగు సాహిత్యాన్ని దశాబ్దాలుగా గమనిస్తున్న చాలామంది కొట్టిపారేశారు. అయితే, యువ సాహిత్యకారులు కడలి సత్యనారాయణ రాసిన 'చిక్ లిట్', మహమ్మద్ గౌస్ రాసిన '826 కిమీ', ప్రసాద్ రామతోట రాసిన '90స్ లవ్‌స్టోరీ', శ్రీనివాస్ కాశెట్టి రాసిన 'అయోధ్య చేరిన కృష్ణ'... ఇవన్నీ కొన్ని నెలల వ్యవధిలోనే పదుల వేల కాపీలు దాటాయి. 'అమ్మడైరీలో కొన్ని పేజీలు' పుస్తకం లక్షన్నర కాపీలు అమ్ముడై సంచలనం సృష్టించడానికి ముందే వి. మల్లికార్జున్ 'ఇరానీ కేఫ్', సీతారామరాజు 'రామగ్రామ నుంచి రావణలంకకు' వంటి పుస్తకాలు కొద్ది నెలల్లోనే పలు రీప్రింట్లతో కొత్త పాఠకులను సంపాదించాయి. దీన్ని బట్టి కూడా ఇదేమీ హఠాత్తుగా రాత్రికి రాత్రి వచ్చిన పరిణామం కాదని అర్థమవుతుంది. మరోవైపు, వివిధ పబ్లికేషన్లు, ఆడియో బుక్స్ యాప్‌లు వంటివి కూడా అభివృద్ధి చెందుతున్నాయి (అజు పబ్లికేషన్స్, అన్వీక్షికి పబ్లిషర్స్ ఛాయ బుక్స్, ఎలమి పబ్లికేషన్స్ వంటి పబ్లిషింగ్ సంస్థలు, దాసుభాషితం వంటి ఆడియో బుక్స్ యాప్‌లు ఇందుకు ఉదాహరణ.). ఇన్‌స్టాగ్రామ్‌లో పుస్తకాల గురించి చర్చించి, వాటిని ప్రమోట్ చేసే బుక్‌ఫ్లుయెన్సర్లు ఈ పరిణామంలో ఒక కీలకమైన తోడ్పాటును అందిస్తున్నారు (తెలుగు కలెక్టివ్, ఆరుద్ర ఈశ్వర్, విముక్త సుధ వంటివారు ఇందుకు ఉదాహరణ). మొత్తంగా, ప్రభుత్వ ప్రోత్సాహం, పెద్ద సంస్థల మద్దతు, సినిమా ప్రముఖుల ప్రోత్సాహం... ఇవేమీ లేకుండా ఒక ఎకోసిస్టమ్ అభివృద్ధి చెందుతున్నట్టు కనిపిస్తోంది.

ఎందుకని ఈ పుస్తకాలు అమ్ముడవుతున్నాయి? ఎవరు కొంటున్నారు? ఎందుకు కొంటున్నారు? ఎలాంటి పుస్తకాలు అమ్ముడవుతున్నాయి? వంటి విషయాలపై అనక్‌డోటల్ రిఫరెన్సులు మినహాయిస్తే పరిశోధనలు కానీ, స్టడీలు కానీ పెద్దగా జరిగినట్టు కనిపించడం లేదు. ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో చేసిన ప్రచారం వల్ల పుస్తకాలు అమ్మకోగలుగుతున్నారని విమర్శనాత్మకంగా రాస్తున్నవారు కూడా పాఠకులు ఎందుకు కొంటున్నారో, ఈ పుస్తకాల్లో ఏం ఆకర్షిస్తోందో లోతుగా పరిశీలించిన దాఖలాలు లేవు. తెలుగు కలెక్టివ్ అన్న ఇన్‌స్టాగ్రామ్ పేజీని స్థాపించి దాన్ని ఒక సాహిత్య, సాంస్కృతిక సముదాయంగా అభివృద్ధి చేస్తున్నవారిలో ఒకడైన ఆదిత్య అన్నావఝుల ఈ విషయంపై మాట్లాడుతూ, "యంగ్‌స్టర్స్ వాళ్ళని వాళ్ళు చూసుకునేలాంటి రిలేటబుల్ కంటెంట్ ఉండడం, సులువుగా అర్థమయ్యే భాషలో రాయడం బాగా లాభిస్తోంది. సాహిత్యంలో సామాన్యంగా ఉండే వివిధ వాదాలకు ఈ రచనలు సామాన్యంగా దూరంగా ఉంటున్నాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రెండ్ కావడం, అమెజాన్ ప్లాట్‌ఫాంలో సజెషన్లు వంటివీ, పుస్తక ప్రచురణ విషయంలో ఇంతకుముందున్న బేరియర్స్ తగ్గిపోవడం ఈ మార్పు విషయంలో దోహదం చేసింది" అన్నాడు. 1990ల్లో ప్రారంభమైన ఇండస్ట్రియలైజ్డ్ ఎంట్రన్స్ ఎగ్జామ్ కోచింగ్ మోడల్ వల్ల భాషకు, సాహిత్యానికి దూరమైపోయిన తరాలు తిరిగి వాటివైపు ఆకర్షితులవుతున్నాయా? షార్ట్ ఫామ్ కంటెంట్‌కి అడిక్ట్ అయ్యారనీ, భారతీయ భాషల పట్ల ఆసక్తి చూపట్లేదనీ అంతా భావించే యువత తిరిగి లాంగ్‌ఫామ్ కంటెంట్ వైపు వస్తున్నారనేందుకు, అందులోనూ భారతీయ భాషల పుస్తకాలపై ఆసక్తి చూపుతున్నారనేందుకు ఈ ట్రెండ్ తొలి సంకేతమా? ఈ కోణాల్లో మరింత లోతుగా పరిశీలించి తెలుసుకోవాల్సి ఉంది. అయితే, అంతవరకూ ఈ పరిణామాన్ని ఆసక్తితో చూసి సంతోషించవచ్చు.

■ పవన్ సంతోష్ సూరంపూడి
✆ 96406 56411

కవి పండిత బాలకుడు


వేలూరి వేంకటేశ్వరరావు (1938–2026)

తెలుగులో రాసేవాళ్ళతో, చదివేవాళ్ళతో సంభాషణ కోసం ఉవ్విళ్ళూరేవారు వేలూరి వెంకటేశ్వరరావు గారు. అలా కవులు కూచుని హస్కు కొట్టుకోడాన్ని ఆయన Tête–à–tête అనేవారు. 1992లో ఒక వేసంగి. అట్లాంటాలోని పెమ్మరాజు వేణుగోపాలరావుగారు ఇంట్లో ఒక్కళ్ళే ఉన్నారు. నన్ను "ఏఁవండీ రండి... వేలూర్ని కేకేస్తాను! రండి!!" అని పిలిచేరు. వాళ్ళిద్దరూ అలా కేకేస్తే నేను లొట్టలేసుకుంటూ చాల దూరం డ్రైవ్ చేసుకుని వెళ్ళేను. కెరొలీనా, జార్జియా పీచ్ పళ్ళ దుకాణాలు, Gasoline 1$ అనే హోర్డింగ్‌లు దాటుకుంటూ. వేణుగోపాలరావు గారింట్లో పెరడు, నడవాలు బొమ్మరిళ్ళలా కళాత్మకంగా తీర్చిదిద్దుకున్నారు. ఆయన అప్పట్లో కవులందరివీ ఒక్కో కవిత తీసుకుని సంకలనంగా వేసేరు– మచ్చు తునకలు అని కాబోలు. ఆ పుస్తకం బల్ల మీద పెట్టుకుని వేలూరి గారు భోజనాల బల్ల మీద Tête–à–têteకి సిద్ధంగా కూర్చున్నారు. ఆయన సైన్సదీ చాల చదువుకున్నారు, కాని ఆయనకి నిజంగా ఇష్టమైన శాస్త్రం సామాన్య శాస్త్రం కాదు, సాహిత్య శాస్త్రం. అరవైలనాటి ఆంధ్ర యూనివర్శిటీ, అబ్బూరి, తిలక్, శ్రీశ్రీ ఇవన్నీ ఆపకుండా మాట్లాడుతూనే ఉన్నారు. ఆ రోజు భోంచేస్తూ "అన్నం తినేటప్పుడు ఏ సమయంలో 'ఇంక చాలు!' అనుకుని లేవాలో అది... అది చాల కష్టం!" అని చెప్పేరు. ఆయనకి నిజంగా ఇష్టమైన భోజనం, 'ఇంక చాలు!' అని ఎలా ఎప్పుడనుకోవాలో తెలీకుండా భోంచేసే విందు సాహిత్యం. అంటే కాయితాల మీద పేజీల్లో, ఒకర్నొకరు కేకేసుకునీ, Tête–à–têteలలోనూ ఆబగా జుర్రుకునేది. అప్పటికింకా ఇంటర్నెట్, వెబ్ అని ఏవీ లేవు.

ఇంట్లో వేణుగోపాలరావుగారు ఒక్కరే ఉన్నారు. చెస్ లాంటి ఆటలు ఆడేవాళ్ళు, పేకాడేవాళ్ళు, చిన్నపిల్లలూ ఇంటికెవరొచ్చినా "రా! ఒకెత్తు వేద్దాం?!" అని సతాయిస్తారు కదా. వేలూరి వ్యవహారం అంతా అలాగే ఉండేది "రండి! కవిత్వం గురించీ, రైటర్స్ గురించీ మాట్లాడుకుందాం!" అని కవ్విస్తున్నట్టు, కాలు దువ్వుతున్నట్టూ. కవి తిలక్ గురించి చాలా చెప్పేరు. తిలక్ అంటే పారవశ్యంలా ఉండేది నాకు. అవన్నీ అడిగడిగి, నోరెళ్ళబెట్టుకుని విన్నాను. ఆయన ఎవర్నీ ఊరకే ఉండనిచ్చేవారు కాదు. సంభాషణ ఏ మాత్రం ఆగినా "ఊఁ ఇంకేంటండీ చెప్పండి..?" అని చర్చని ఎగసనదోసేవారు. అది వివాదం అయితే ఆయనకి మరింత ప్రీతి. పేరుమోసినవాళ్ళు, రకరకాల బులుపులు, ప్రలోభాలున్న మనుషుల్ని గురించి నిక్కచ్చిగా ఎత్తిపొడుస్తూ నవ్వించేవారు. అలాగే ఆయన గౌరవించే మనుషులు, వాళ్ళ వ్యాసంగాల గురించి విశేషంగా పొగుడుతూ చెప్పేవారు. సంభాషణ అంటే వాదం, ప్రతివాదమున్నూ. అటునుంచి ఆయన ఒక బాణం వేస్తే, ఇట్నుంచి మనం ఒక ప్రతిబాణం వెయ్యాలి. చర్చ ఇలా "రగడ రగడ రగడం! కానీరా జగడ జగడ జగడం!!" లాగ రంజుగా రాజుకోవాలి. కాఫీలవీ రప్పిస్తూ, పదిమందిమీ నవ్వు మొహాలు పెట్టుకుని వింటూ, అంటూ తింటూ వినోదిస్తూ, సాహితీ ప్రపంచపు మనుషులు, పుస్తకాల నిజాల నిగ్గుతేల్చటం ఇది ఆయనకి ప్రియమైన విందు భోజనం. సైంటిస్ట్, మార్క్సిస్ట్, ఎన్నారై సాహితీ దిగ్గజం ఇలాంటి గుర్తింపులు ఎన్నున్నా ఆయన మౌలికంగా ఇలా అమర్త్య సేన్ గారు చెప్పినలాంటి ఫక్తు రసవాది, ఇంకా ప్రతివాది భయంకరుడు – Argumentative Indian. ఆ తరవాత 1998లోనేమో, టెక్సస్ లోనో ఎక్కడో తెలుగు సభల్లో ఆయనతో, నారాయణరావు గారితో కలిసి నడుస్తూ భోజనాల కోసం వెతుక్కున్నామని గుర్తొస్తోంది.

ఆయనలో సాహిత్య కాంక్ష ఇంత ప్రబలంగా ఎందుకు వేళ్ళూనుకుందో అర్థం చేసుకోవాలంటే ఆయనకు చిన్నతాతగారైన వేలూరి శివరామ శాస్త్రి గారి చరిత్రని, ఆయన కుటుంబ నేపథ్యాన్నీ చదువుకుంటే బోధపడుతుందేమో. శివరామ శాస్త్రి గారు గొప్ప కవి, మహా పండితుడు. కవులకీ కవులకీ వాగ్యుద్ధాలు జరిగే సత్తెకాలపు రోజుల్లో ఆయన తమ గురువులు తిరుపతి వేంకట కవుల తరపున ఎగస్పార్టీ (కొప్పరపు) కవుల మీద 'బస్తీ మే సవాల్!' లాంటి కవిత్వ బాణాలు ప్రయోగించి రంగ ప్రవేశం చేసేరనీ, విస్తృతంగా శతావధానాలు చేసేరనీ చరిత్ర. వస్తుతః సాధువు, పరమ కారుణ్యమూర్తి అయిన శివరామశాస్త్రి గారినే రెచ్చగొట్టగలిగిన ఇలాంటి రసకందాయమైన సాహిత్య వాతావరణం, కుటుంబ నేపథ్యాల ప్రభావం ఒకవైపు, ఈ పాత వాగ్వైభవాల వాసనల్ని, పద్ధతుల్నీ చాదస్తమని గ్రహించుకుని, తమ సాంస్కృతిక వారసత్వం సమస్తాన్నీ 'బ్రాహ్మినిజం' అని తిరస్కరించి, అవమానిస్తూ వచ్చిన కొత్త కాలపు శాస్త్రీయ దృక్పథం, సామ్యవాదం, ఆధునిక విద్యల ప్రభావం ఇంకొకవైపు వేంకటేశ్వర రావు గారిని చెరొకవైపూ లాగుతూ ప్రభావితం చేసి ఉంటాయి. ఈ పెనుగులాటలో మార్క్సే గెలిచాడు. వ్యక్తిత్వం అంటే మనం పెరిగి పెద్దయ్యేక కావల్సినవి నాలుగూ ఎంచుకొని బాహ్యంగా ప్రకటించుకోగలిగినది మాత్రమే కాదు. బాల్యం నుండి మనకంటూ ఏ వ్యక్తిత్వమూ ఇంకా ఏర్పడని రోజుల్లో మన అనుభవాలు, విన్నవి చూసినవీ అనుభవించినవీ ఇవన్నీ మన వ్యక్తిత్వాల్ని, ప్రవర్తననూ విశేషంగా, తప్పనిసరిగా ప్రభావితం చేస్తాయి.

> **చెస్ లాంటి ఆటలు ఆడేవాళ్ళు, పేకాడేవాళ్ళు, చిన్నపిల్లలూ ఇంటికెవరొచ్చినా "రా! ఒకెత్తు వేద్దాం?!" అని సతాయిస్తారు కదా. వేలూరి వ్యవహారం అంతా అలాగే ఉండేది "రండి! కవిత్వం గురించీ, రైటర్స్ గురించీ మాట్లాడుకుందాం!" అని కవ్విస్తున్నట్టు, కాలు దువ్వుతున్నట్టూ. ఎవర్నీ ఊరకే ఉండనిచ్చేవారు కాదు. సంభాషణ ఏ మాత్రం ఆగినా "ఊఁ ఇంకేంటండీ చెప్పండి..?" అని చర్చని ఎగసనదోసేవారు. అది వివాదం అయితే ఆయనకి మరింత ప్రీతి.**

కృష్ణ కర్ణామృతం లోని శ్లోకం ఒకటి. యశోద చిన్ని కృష్ణుణ్ణి జోకొడుతూ రామకథ చెప్తుంది: "రామో నామ బభూవ, హుం, తదబలా సీతేతి, హుం" అని మొదలౌతుంది. ఆ కథ వింటూ ఊ కొడుతూ నిద్రపోతున్న వాడల్లా కృష్ణుడు– సీతాపహరణం, రావణుడి ప్రసక్తి వచ్చే సరికి ఉలిక్కిపడి దిగ్గున లేచి 'లక్ష్మణా! నా విల్లెక్కడ? ఏదీ, ఏదీ తే?!' అని లేస్తాడు. లీలాశుకుడు నాలుగే పాదాల్లో ఇంత కథనూ చిత్రించిన పద్ధతి చాల మనోహరంగా ఉంటుంది. ఈ శ్లోకమంటే వేలూరి చెవి కోసుకునేవారు, ఇష్టంగా వర్ణించేవారు.

2010లో అనుకుంటాను. అట్లాంటాలో వాళ్ళింటికెళ్ళేను. ఏమీ మాట్లాడలేననీ పాట పాడతానని అనంటే సరే పాడండి అన్నారు. ప్రయాగ రంగదాసు కృతి రామ రామయనరాదా అనుంది, అది పాడేను. నవ్వుకుని ఉంటారు, 'ఇలా దేవుడి పాటలా పాడుకుంటున్నాడు!' అని. నాతో ఏమీ అనలేదు. తను పెంచుకుంటున్న మిరప మొక్కల్ని చూపించేరు. ఆయన, శాంతి గారు నేను వెళ్తుంటే మళ్ళీ రావాలి నాల్రోజులుండాలి అని పదే పదే చెప్పేరు. 2012లోన వాళ్ళిద్దరూ హైదరాబాద్ వచ్చేరు. వాళ్ళిల్లు ఒక కొసన, మేము ఇంకో కొసన. నేనే వెళ్ళి తీసుకొచ్చేను. నా గాండీవం అప్పటికే విరిగిపోయి చాన్నాళ్ళయ్యింది. ఆయన వాక్ప్రవాహానికి నేను ఊఁ కొడుతున్నాను, హుం, హుం అని. మధ్య మధ్యలో మా పనమ్మాయి ఎలా వండుతోందోనని ఓ చూపు చూసుకుంటూ. తను ఆ కూర ఎలా చెయ్యాలో తెలీక నన్నడుగుతుంటే నేను ఎలా చెయ్యాలో చూపించొచ్చి కూర్చుని మళ్ళీ ఊఁ కొడుతుంటే ఆయన కళ్ళు మెరుస్తూ, ఒళ్ళంతా కదుల్తూ చాల నవ్వేరు. శాంతిగారికి తలనొప్పి ఆరోజంతా. నేను మాత్తర్లు తెచ్చిచ్చేను. ఆ తరవాత ఊరు చూట్టానికెళ్ళేము. యూనివర్శిటీ అంతా తిప్పుతూ ఇక్కడ మీరు పాఠాలు చెప్పొచ్చు అనంటే ఆయన అన్యమనస్కంగా 'ఆఁ చూద్దాం లెండి!' అన్నారు.

ఆయనకి ఫిజిక్స్ మీద లేదు. కవిత్వం, కథల మీదనే ఉన్నాది. నేనేం అడగకుండానే ఆయనే తనలో తనే మాట్లాడుకుంటున్నట్టు "నా శక్తి కొద్దీ రాసినా, ఎంతగా ప్రయత్నం చేసినా, ఇంకా చాలదూ అది కాదూ అంటే... if all of that isn't enough, then... then what else am I supposed to do?" అని అన్నారు. నేనేమీ అనకుండానే ఆయన ఎందుకలా చెప్పుకున్నారా అనుకున్నాను. అది లోలోతుల్లోని ధనుర్ధారి తనమీద తనే ఎక్కుపెట్టుకున్న బాణం. మార్క్సిజం, పరమాణు భౌతిక శాస్త్రం, సాహితీ సమాజం, ప్రవాస జీవితపు దుఃఖం, ఎన్నారై పెద్దరికం, మనందరికీ తప్పనిసరైన సాంఘిక మర్యాదా ఇన్ని బరువు దొంతర్ల కింద నలుగుతున్న కవి పండిత బాలకుని అభినివేశపు ఆక్రందన, జన్మాంతర సౌహృద. ఏ లోపలి నూతుల్లోంచో ఏకాంతంలో ప్రతిధ్వనిస్తున్నట్లు. ప్రతిగా ఏ కేకా వెయ్యలేక నిస్సహాయంగా ఉండిపోయేను. "సరే బై అండీ! వెళ్ళొస్తాం నమస్తే అండీ!!" అనే శలవు తీసుకున్నాను.

ఆయన చాల చమత్కారంగా మాట్లాడేవారు. మాటకారితనంతో మెత్తగా చురకలు పెట్టేవారు. సాహిత్యం గురించి, రాసి చదివే మనుషులు, పుస్తకాల్ని గురించిన ఆసక్తి, ఆపేక్ష ఆయనకు చివరివరకూ ఏమాత్రం వన్నెతగ్గకుండా ప్రకాశిస్తూనే వచ్చేయి. నాకు ఆ ఆసక్తి, ఆపేక్ష క్రమంగా క్షీణిస్తూ వచ్చి, చివరికి పదాలు, వాక్యాలు చెప్పే ఏ కథా, ఏ అనుభూతీ, ఎలాంటి సత్యమూ అక్కర్లేదు, ఒద్దుగాక ఒద్దని కొడిగట్టిపోయింది. ఇది ఆయన్ని నొప్పించింది అనుకుంటాను. చాల రకాలుగా 'కేకేస్తూ', కబుర్లు పెడుతూ, కవ్విస్తూ వచ్చేరు. పడుకున్నాడో పోయేడో తెలీని కవిని తట్టి లేపి, ఉత్సాహపరచే ప్రయత్నం చాల చేసేరు. కాని నేను ప్రతిగా ఏమీ అనలేకుండా గమ్మునుండిపోయేను. ఇది ఆయన్నేకాదు, నేను స్నేహితుణ్ణని అనుకున్న మంచి మనుషులెందర్నో నిరాశ పరుస్తూనే వచ్చింది. నేను ఇంక నిండా మునిగినవాడికి చలేఁవిటన్నట్టు ఊరుకున్నాను. 2019 ప్రాంతాల్లోన తన కవితల పుస్తకం 'అవ్యయ' కాపీ పంపించేరు. నేనేమీ అనలేకపోతే మళ్ళీ ఇంకొకటి పంపించేరు. ఏదైనా అనవయ్యా?! అని కవ్వించటం కాదు, బతిమాలుతున్నట్టే. కేలిఫోర్నియా వచ్చి చుక్కా శ్రీనివాస్ దగ్గర నా నెంబర్ తీసుకుని ఫోన్ చేసేరు. "ఊఁ..ఏంటండీ?" అని. గొంతులో ఇది వరకటి అల్లరి లేదు. రిటైరైన తర్వాత పెన్షనర్ని అని, చాలు, హాయిగా... అనీ ఇలాగ. రమ్మనమన్నారు. నేను వెళ్ళి దొంగ నమస్కారాలు పెట్టినా ఆయనకీ, ఎవరికీ ఏ ప్రయోజనమూ లేదని గమ్మునే ఉండిపోయేను. ఆయనకి చాన్నాళ్ళుగా ఆశ్చర్యం, అపనమ్మకంలా ఉండేది అనుకుంటాను. 'ఏదో ఒకటీ రాసి, చేసీ చూపించవయ్యా! ఈ పలవరింతలేంటి?' అని. What a terribel waste! అన్నట్టూ.

టచ్‌లో ఉండమని మా అమ్మే నన్నడగటం మానుకుంది. టచ్ మీ నాట్ కూడా ఒక మొక్కే కదా! ఊరికే మూసుకునుండటం అమర్యాద కాదు అని, అది ఒక్కళ్ళం మనతో మనమే ఆడుకునే Tête–à–tête లాంటిదనీ ఆయనకి మాటల్లో ఎలా చెప్పటం? మౌనం భగవాన్ పదస్పర్శ. నిరంతరాయంగా నెత్తి మీదనే పెట్టుకుని పడుంటే అది ప్రేమకు, గౌరవానికీ, సృజనకూ పరాకాష్ఠ. భాష వలన కలిగే దుఃఖాన్ని కడిగే శాంతి అది అని వేలూరికి ఇప్పుడింక ఎలాగ?

■ కనకప్రసాద్ సరిపల్లి



దృష్టికోణం

రాలి పడిన నిద్రలేని రాత్రి
ఏ ఒక్కటీ వృథా కాదు
మొలకెత్తిన అనుభవంగానో
మొగ్గ తొడిగిన జీవితంగానో
ఎప్పుడో ఒకప్పుడు ఎక్కడో ఒక దగ్గర
నవ్వుతూ మనవైపే నిలబడుతుంది

ఆకాశం నుంచి దొర్లిపడిన
వాన చినుకు నేల చేరాక
నిరుపయోగం అనుకోవడానికి
ఎంత మాత్రం వీలు లేదు
మట్టి రేణువు మనసును తడిచేస్తుంది
పువ్వు పెదాలపై నవ్వును పూయిస్తుంది
మొక్క ముఖం మీద
ఒక మెరుపు మెరిపిస్తుంది

వీగిపోయిన ఏ ప్రయత్నమూ
ఓటమి కానే కాదు
గెలుపు పంట కోసం విత్తిన
మొట్టమొదటి గింజే కదా అది
ఇక్కడి నుంచి జారిపోయిందీ అంటే
చల్లగాలి ఇంకెక్కడో వేడి సెగల్ని
ఓదారుస్తుందనేగా!

దృష్టి కోణమే దృశ్యం!
మనసు నమ్మిందే సత్యం!
మస్తిష్కం మహామాయది
ఎంత పనైనా చేస్తుంది!

■ బంగార్రాజు కంఠ
✆ 85003 50464

ధ్వని శూన్య లహరి



వెలుగు అనేది ఒక తాత్కాలిక ముసుగు...
తొలగిపోయాక బయటపడే నిజస్వరూపం ఈ చీకటి!
శూన్యం అని పిలిచే ఈ నలుపులో,
బిలియన్ల కొద్దీ కాంతి సంవత్సరాల సమయం స్తంభించిపోతుంది...
అక్కడ దూరం తన అర్థాన్ని కోల్పోతుంది.
మౌనం అంటే కేవలం నిశ్శబ్దం కాదు
శబ్దాలన్నీ తమ మూలాల్లోకి చేరుకున్న మహాసమాధి!
మాట్లాడే ప్రతి మాట ఒక ఖర్చు... మౌనం ఒక పెట్టుబడి.
బాహ్య ప్రపంచపు తలుపులు మూసుకున్నప్పుడు,
అంతరాత్మ కిటికీలు తెరుచుకుంటాయి.
అక్కడ వినిపించే సంగీతం... ఏ వాయిద్యానికీ అందదు.
చీకటి సంగీతానికి హద్దులు లేవు.
తల్లి గర్భంలోని మొదటి స్పందన నుండి,
శ్మశానంలోని చివరి నిశ్శబ్దం వరకు వ్యాపించిన ఏకైక రాగం!
గెలాక్సీలు తిరుగుతున్నప్పుడు పుట్టే ఆ 'ఘర్షణ' సంగీతం,
శ్వాస తీసుకుంటున్నప్పుడు వచ్చే ఈ 'చిరు' సంగీతం...
మౌనపు ఒడిలో పుట్టి, అక్కడే లీనమవుతాయి.
లోతుగా ఆలోచిస్తే... నువ్వు ఒక దేహం కాదు, ఒక శబ్ద కణం!
నీ ఆలోచనలు అదృశ్యమైన వయొలిన్ వాయిద్యాలు.
చీకటి వేదిక మీద, మౌనం తెర వెనుక,
నువ్వు పాడుతున్న జీవిత గానం... ఎవరికీ వినిపించక్కర్లేదు,
విశ్వం అనంతమైన చెవులతో నిన్ను ఆలకిస్తూనే ఉంటుంది.
చివరికి మిగిలేది ఇదే...
కంటికి కనబడని ఒక మహా కావ్యం,
చెవికి వినబడని ఒక అమర రాగం.
నువ్వు మౌనంగా మారిన రోజున,
నీకు నువ్వు ఒక విశ్వ సంగీతంగా పరిచయమవుతావు!
మౌనం ఇక్కడ ఒక నిశ్శబ్దపు గోడ కాదు,
శబ్దాల అణువుల మధ్య ఉన్న అంతరాళం!
వాక్కు తన శక్తిని కోల్పోయి, భాష తన అర్థాన్ని వెతుక్కుంటూ
దిగంబరంగా నిలబడినప్పుడు...
రూపుదిద్దుకుంటుంది ఒక 'అరూప' గానం.
అది వినిపించేది కాదు, కేవలం చేతనను తాకే ప్రకంపన!
ఆ సంగీతానికి శ్రుతి లేదు, లయ లేదు...
అది అగాధంలోని మౌనపు నిట్టూర్పుల ప్రతిధ్వని.
విశ్వం తన నల్లని గర్భంలో దాచుకున్న నక్షత్రాల మరణ ఘోష...
నువ్వు ఈ చీకటి సముద్రంలో మునిగితే...
అహేతుక తర్కాలన్నీ కరిగి,
ఆత్మ ఒక శబ్దరహిత వాద్యమై మారుతుంది.
అక్కడ నువ్వు వినేది నిన్ను కాదు,
నీ ద్వారా విశ్వం పాడుతున్న ఆదిమ విలయ రాగాన్ని!
నిశ్శబ్దమే అక్కడ పరమోచ్ఛ ధ్వని,
శూన్యమే అక్కడ సంపూర్ణ సృష్టి!
ఈ క్లిష్ట ప్రవాహంలో నువ్వు కదిలే కొద్దీ...
మౌనం నిన్ను భక్షిస్తుంది, సంగీతం నిన్ను పునర్నిర్మిస్తుంది,
చీకటి నిన్ను అనంతంగా మారుస్తుంది!

■ తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి
✆ 80085 77834

బువ్వలాట



భూమీ ఆకాశమూ
నలుదిక్కులూ

ఆరుగురు పిల్లలు
ఆటకి కూర్చుంటారు
లక్కపిడతలు వేసుకుని
రెండు పక్షాలుగా

చంద్రుడ్ని పదిహేను ముక్కలు చేసి
చీకటికి తినిపిస్తారు
ఒక పక్షం

చీకటిని పదిహేను పళ్లాల్లో సర్ది
చంద్రుడికి తినిపిస్తారు
మరొక పక్షం

చంద్రుడెక్కడికీ పోడు
చీకటెక్కడికీ పోదు
పిల్లల సంతోషం కోసం
దోబూచులాటలాడతారు

ఉత్తుత్తి వంటల వడ్డింపుల
బువ్వలాట అది

ఏ రెండూ ఒకలా ఉండని
విభిన్న రాత్రుల తాయిలాలు
మనకి

■ వెంకటేష్ పైడికొండల
✆ 81215 33112





విద్యుత్ ప్రభలు, దీపాలతో కాంతులీనుతున్న త్రికూటాద్రి



చేబ్రోలు : క్వారీ వద్ద భారీ విద్యుత్ ప్రభలు



పెదకాకాని శివాలయంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



విద్యుత్ వెలుగుల్లో కోటప్పకొండ ఆలయ ప్రాంగణం



ప్రభల వద్ద నృత్య ప్రదర్శన

భక్తి పారవశ్యం

(గుంటూరు - న్యూస్‌నెట్‌వర్క్)

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో భక్తులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే భక్తులు విద్యుత్ ప్రభలతో భారీగా తరలివచ్చి చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాల కోటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గొడవర్రు, గుండవరం, చేబ్రోలు, వడ్లమూడి, శేకూరు, శలపాడు, సుద్దపల్లి గ్రామాల నుంచి వచ్చిన ప్రభలతో క్వారీ పరిసర ప్రాంతాలు దగదగలాడాయి. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ బాలకోటేశ్వరస్వామిని దర్శించి పూజలు చేశారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేక సహిత లింగోద్భవకాల అభిషేకాలు, రాత్రి ఒంటిగంటకు స్వామివార్ల ఎదురు కోల ఉత్సవం జరిగింది. పెదకాకాని శ్రీమల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో అమ్మ వారు స్వర్ణకవచాలంకృత భ్రమరాంబదేవిగా భక్తులను అనుగ్రహించారు. స్వామిని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు నరేంద్ర, జగదీశ్వరి, సినీ దర్శకుడు బోయపాటి శ్రీను, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవీంద్ర బాబు దర్శించుకున్నారు. తెల్లవారుజామున గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి కల్యాణం జరిగింది. కొల్లిపర మండలం మున్నంగిలోని శ్రీ భీమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుంటూరులోని అరండల్‌పేట, పట్టాభిపురం, కొత్తపేట శివాలయాలు, శ్యామలానగర్, మల్లారెడ్డినగర్, మారుతినగర్ ఇతర ప్రాంతాలోని అలయాల్లో శివ, పార్వతుల కల్యాణాలు జరిగాయి. సీతానగరం కృష్ణానది తీరంలో తెల్లవారుజాము నుంచే భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో పిండ ప్రదానాలు చేశారు.



అమరావతి : అమరేశ్వరునికి ఆలయంలో ఎమ్మెల్యే ప్రవీణ్

శంభో శంకర

హర హర మహాదేవ.. శంభోశంకర.. హరోం హర.. శివాయ రుద్రాయ.. అంటూ భక్తులు పరవశించగా, ఆ నామస్మరణలతో శైవక్షేత్రాలు మారుమోగాయి. ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. కోటప్పకొండ తిరునాళ్లతో పాటు అమరావతి, వైద, సత్రశాల, పెదకాకాని, క్వారీ, గోవాడ తదితర ప్రాంతాల్లో తిరునాళ్ల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఇక తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో స్వామివార్ల దర్శనాలకు అనుమతి ఇవ్వడంతో భక్తులు బారులు తీరారు. ప్రత్యేక అభిషేకాలు, రుద్రాభిషేకాల అనంతరం స్వామివార్లను అర్చకులు విశేషంగా అలంకరించగా.. భక్తులు దర్శించుకున్నారు. చేదుకో కోటయ్య.. చేదుకోవయ్యా.. అంటూ భక్తుల నినాదాలతో కోటయ్యక్షేత్రం త్రికూటాద్రి మారుమోగింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి తిరునాళ్లకు లక్షలాదిగా భక్తులు తరలిరావడంతో కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధి కిటకిటలాడింది. ప్రభల విద్యుత్ వెలుగులతో, విద్యుత్ అలంకరణలతో ఆలయం, కొండ ప్రాంతం దేదీప్యమానంగా వెలుగొందింది.

- శైవక్షేత్రాల్లో శివనామస్మరణలు
- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు
- కన్నులపండువగా ఉత్సవాలు, తిరునాళ్ల
- పోటెత్తిన భక్తులతో కోటప్పకొండ కిటకిట
- నేత్రపర్వంగా త్రికోటేశ్వరస్వామి అభిషేకాలు
- స్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి గొట్టిపాటి

కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వర స్వామి సన్నిధిలో ఆదివారం తిరునాళ్ల కన్నుల పండువగా జరిగింది. భక్తులు కోటయ్య స్వామిని దర్శించుకుని విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్ధరాత్రి వరకు కొండకు భక్తులు తరలి వస్తూనే ఉన్నారు. అర్ధరాత్రి లింగోద్భవ అభిషేకం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున అర్చకులు బిందెతీర్థం, పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామికి విశేష అలంకారం చేశారు. ఒంటిగంట నుంచి స్వామి దర్శనానికి భక్తులను అనుమతించారు. కొండ దిగువన బొచ్చుకోటయ్యస్వామి వద్ద భక్తులు తలనీలాలు సమర్పించారు. ఆలయం ఎగువన కొండ పైన ఉన్న పాతకోటేశ్వర స్వామి, పాపవినాశేశ్వరస్వామి, దిగువన విఘ్నేశ్వరస్వామి, సోపాన మార్గంలోని ఆనందవల్లి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. ధ్యాన శివుడు, విఘ్నేశ్వరుడు, నంది, నాగేంద్ర స్వామి పుట్ట వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. రెండు అభిషేక మండపాల్లో వేలాది మంది భక్తులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. కోటయ్య స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు సత్యసాయి సేవా సమితితో పాటు వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు, స్కౌట్స్ విద్యార్థులు సేవలు అందజేశారు. క్యూల్లోని భక్తులకు నీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. కొండ దిగువన పౌర సంబంధాలశాఖ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించింది. కొండ దిగువన వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్ ఏర్పాటు చేయగా వాటిని కలెక్టర్ కృతికా శుక్లా ప్రారంభించారు.

సౌభాగ్యం, శాంతి ప్రసాదించాలి : మంత్రి గొట్టిపాటి

తిరునాళ్ల సందర్భంగా త్రికోటేశ్వరస్వామికి ప్రభుత్వం తరపున జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పట్టువస్త్రాలు, వెండి ప్రభ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ లాంఛనాలతో మంత్రి గొట్టిపాటికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అతిథిగృహం నుంచి మంత్రి తలపై పట్టువస్త్రాలతో ఆనందవల్లి అమ్మవారి దర్శనం అనంతరం ఊరేగింపుగా త్రికోటేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. రాష్ట్ర ప్రజలకు ఆయురారోగ్యాలు, సౌభాగ్యం, శాంతి, సమృద్ధి ప్రసాదించాలని స్వామిని కోరుకున్నట్లు (మిగతా 6లో)





త్రికోటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న మంత్రులు అనిత, గొట్టిపాటి, ఎమ్మెల్యే అరవిందబాబు

రిజర్వేషన్ బోగీలు ఉపసంహరణ

- రేపల్లె ఎక్స్‌ప్రెస్‌లో 4 బోగీలు సెకండ్‌క్లాస్‌గా మార్పు

గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నిత్యం పగటి వేళ సికింద్రాబాద్ - రేపల్లె మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రయాణికుల ఆదరణ లేనందున నాలుగు స్లీపర్ క్లాస్ బోగీల్లో రిజర్వేషన్ సదుపాయాన్ని రైల్వేశాఖ ఉపసంహరించుకున్నది. ఈ రైలుకు మొత్తం 9 స్లీపర్‌క్లాస్ బోగీలు ఉండగా వందల సంఖ్యలో బెర్తులు బుకింగ్ కాకుండా మిగిలిపోతున్నాయి. కరెంట్ బుకింగ్ సదుపాయాన్ని కల్పించినా ఉపయోగం లేకపోవడంతో ఎస్-6, 7, 8, 9 బోగీలను జనరల్ సెకండ్ క్లాస్‌గా మార్పు చేసింది. దీని వలన ఇక నుంచి ఎస్-1 నుంచి 5 వరకే స్లీపర్ క్లాస్ బోగీలు ఉంటాయి.

జన్మభూమి సమయపట్టికలో మార్పులు

నిత్యం గుంటూరు మీదగా రాకపోకలు సాగించే లింగంపల్లి - విశాఖపట్టణం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైళ్ల సమయపట్టికలో స్వల్ప మార్పులు జరిగినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. నిర్ణీత సమయపట్టిక కోసం ఎన్‌టీఈఎస్ యాప్/వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించింది.

నేడు రాజధానిలో బిల్‌గేట్స్ పర్యటన

- ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న ఏడీసీఎల్
- గన్నవరం నుంచి సచివాలయానికి.. సీఎంతో భేటీ

తాడేపల్లి టౌన్, మంగళగిరి, గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఒకప్పటి మైక్రోసాఫ్ట్ దిగ్గజం, గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్‌గేట్స్ సోమవారం రాజధాని అమరావతికి రానున్నారు. ఇటీవల ఉద్దండరాయునిపాలెంలో క్వాంటంవ్యాలీ శంకుస్థాపన జరిగిన నేపథ్యంలో బిల్‌గేట్స్ పర్యటన అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. నాడు బిల్‌గేట్స్ హైదరాబాద్ పర్యటన అనంతరం జరిగిన టెక్ అభివృద్ధి, సైబరాబాద్ నిర్మాణం వంటి పరిణామాల దృష్ట్యా తాజాగా గేట్స్ పర్యటనపై రాజధానివాసులతో పాటు రాష్ట్ర యువతలో ఆసక్తి నెలకొంది. దక్షిణ కొరియా రాజధాని సియోల్ నుంచి ప్రత్యేక విమానంలో సోమవారం ఉదయం గన్నవరం విమానాశ్రయానికి చేరుకునే ఆయన అక్కడి నుంచి రోడ్డు మార్గంలో వెలగపూడిలోని సచివాలయానికి చేరుకుంటారు. ఈ సందర్భంగా ఆయనకు ఘనంగా స్వాగతం పలికేందుకు అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఏడీసీఎల్) ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కరకట్ట రోడ్డు, సీడ్ యాక్సిస్ రోడ్డు, సచివాలయానికి వెళ్లే రోడ్లను రంగులతో ఫ్యాన్ పామ్స్, గోగన్ విలియా, క్లోజియా రోజియా, అరేక పామ్స్ వంటి ఆకర్షణీయమైన మొక్కలతో అలంకరించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులతో బిల్‌గేట్స్ భేటీ అవుతారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సంజీవని ప్రాజెక్టు గురించి తెలుసుకోనున్నారు. సీఎం చంద్రబాబు నివాసానికి సమీపంలోని అరటితోటలో గేట్స్‌తో చర్చలకు వేదికని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉండవల్లి గుహల సమీపంలో ఉండవల్లి వ్యవసాయ క్షేత్రంలో టెక్నాలజీతో చేపట్టే సాగు విధానాన్ని పరిశీలిస్తారు. రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారని తాడేపల్లి తహసీల్దారు డి.సీతారామయ్య తెలిపారు. వ్యవసాయ క్షేత్రం వద్ద ఏర్పాట్లను ఆదివారం కలెక్టర్ తమీమ్ అన్సారియా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.




ఉండవల్లిలో బిల్‌గేట్స్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

సహజంగా.. దందా

- సమాచార హక్కు చట్టం పేరుతో వసూళ్లు
- ప్రభుత్వ కార్యాలయాల వద్ద నకిలీ బ్యాచ్ తిష్ఠ
- శాఖల వారీగా దరఖాస్తులు.. లోపాలున్నాయని వేధింపు
- ఆగడాలు భరించలేక ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు అధికారులు సిద్ధం


గుంటూరు(విద్య), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అక్రమాలను, అవినీతిని అరికడుతూ ప్రజాప్రయోజనాలకు ఉపయోగించాల్సిన సమాచార హక్కు చట్టాన్ని కొంతమంది జేబులు నింపుకునేందుకు వాడుకుంటున్నారు. సహ చట్టం పేరుతో సమాచారం కోసం, రికార్డుల పరిశీలనకు శాఖల వారీగా దరఖాస్తు చేసి అందిన కాడికి దండుకోవడమే లక్ష్యంగా కొందరు పెట్టుకుంటున్నారు. అందుబాటులోని లేని రికార్డులు పరిశీలన పేరుతో అధికారులను, సిబ్బందిని బెదిరిస్తూ, ఇబ్బందులకు గురి చేస్తూ భారీ స్థాయిలో దండుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో ప్రధానంగా 80 పైగా ప్రభుత్వ శాఖలు ఉండగా వీటిల్లో సంక్షేమం, రెవెన్యూ, విద్య, రిజిస్ట్రేషన్, రవాణా, పౌర సరఫరాల, గృహనిర్మాణ శాఖల్లో పనితీరు, పథకాల అమలు, రికార్డుల నిర్వహణ, నిధుల వినియోగం తదితర అంశాలపై సమాచార హక్కు చట్టం పేరుతో ఈ బ్యాచ్‌లో దరఖాస్తు చేస్తారు. ఆయా అధికారులు ఇచ్చిన సమాచారంతో రికార్డుల పరిశీలన పేరుతో మరొక దరఖాస్తు చేస్తారు. వారు సూచించిన రికార్డులు అందుబాటులో ఉంచాలంటే అధికారులకు సాధ్యం కాదు. ఒకవేళ కొన్ని శాఖలు అవకాశం ఇచ్చినా అందులో లోపాలు ఉన్నాయని, కలెక్టర్, ఆ శాఖ ఉన్నతాధికారులకు, ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామంటూ బెదిరిస్తారు. తమను సంతృప్తి పరిస్తే ఫిర్యాదులు చేయమని దందా చేస్తారు. రెవెన్యూ, విద్య, జిల్లా పరిషత్, గృహనిర్మాణ, సంక్షేమశాఖలను రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు, రిజిస్ట్రేషన్ శాఖను రూ.5 వేలు, వైద్య ఆరోగ్యశాఖను పీహెచ్‌సీల వారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల వసూళ్ల దందాపై కలెక్టరేట్‌లో అధికారులు అంతర్గతంగా చర్చించుకున్నారు. సదరు దరఖాస్తుదారులు చేస్తున్న ఆగడాలను, కాల్ రికార్డులను ప్రధాన విభాగాలకు చెందిన కొంతమంది అధికారులు నమోదు చేశారు. కార్యాలయాల వద్ద తిష్ఠ వేసే ఈ బ్యాచ్ ఆగడాలకు విసిగిపోయిన అధికారులు ఎస్పీకి ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.



కోటప్పకొండలో.. ట్రాఫిక్‌జాం

కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కోటయ్య భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నాం.. కొండపైన, కొండమార్గాల్లో వాహనాలు ఆగిపోకుండా ప్రణాళికలు రూపొందించాం.. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు దర్శనాలు సాఫీగా సాగేలా ఏర్పాట్లు చేశాం.. అని అధికారులు ప్రకటించిన మాటలు ఉత్తిత్తిగానే మారాయి. ప్రణాళికలు.. ఏర్పాట్లు.. చర్యలు.. మచ్చుకు కూడా ఫలితాలు ఇవ్వలేదు. ఆదివారం రాత్రి సోపానమార్గం భక్తులతో కిటకిటలాడింది. ఓ బాలిక స్పృహతప్పి పడిపోవడంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. దీంతో సోపానమార్గం నుంచి భక్తులు కొండపైకి వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. ఘాట్ రోడ్డు మార్గంలో ఐదు కిలోమీటర్లు భక్తులు నడిచి వెళ్లాల్సి వచ్చింది. కోటప్పకొండ తిరునాళ్ల చరిత్రలో సోపాన మార్గం మూసివేయడం ఇదే ప్రథమం. ఘాట్‌రోడ్డులో నిలిచిపోయిన ఓ వాహనాన్ని తొలగించే విషయంలో పోలీసు, ఆర్టీసీ అధికారుల మధ్య సమన్వయం లోపించింది. దీంతో కిలోమీటర్ల మేర బస్సులు నిలిచిపోయాయి. రాత్రి 10:30 గంటల వరకు యలమందల, కొత్తపాలెం రహదారుల్లో ట్రాఫిక్ క్లియర్ కాలేదు.

ముగిసిన ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ పరీక్షలు


పరీక్షలు రాస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్ పరీక్షలు ఆదివారం ముగిశాయి. మొత్తం 858 మంది సీనియర్ డివిజన్, సీనియర్ వింగ్ క్యాడెట్లు పాల్గొన్నారు. డ్రిల్, వెపన్ ట్రైనింగ్, కమ్యూనికేషన్ టెస్ట్, ఫీల్డ్ క్రాఫ్ట్ అండ్ బ్యాటిల్ క్రాఫ్ట్, మ్యాప్ రీడింగ్ వంటి విభాగాల్లో కేడెట్ల నైపుణ్యాలను పరీక్షించారు. రాత పరీక్షతో 'సి' సర్టిఫికెట్ పరీక్షలు విజయవంతంగా ముగిశాయి.

సులభంగా ఇంటర్ హాల్‌టికెట్లు

● డౌన్‌లోడ్ ప్రింట్‌లపై ప్రిన్సిపాల్ సంతకం, స్టాంప్ అవసరం లేదు


పరీక్ష రాసి బయటకొస్తున్న ఇంటర్ విద్యార్థులు(పాత చిత్రం)

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23 నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సులభంగా హాల్‌టికెట్లు పొందేందుకు ఇంటర్ బోర్డు ఏర్పాటు చేసింది. ఫీజు బకాయి ఇతర సమస్యల పేరుతో కళాశాల యాజమాన్యాలు హాల్‌టికెట్లు ఆపకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంది. జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 68,898 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. 87 కేంద్రాల్లో మార్చి 24 వరకు పరీక్షలు జరగనున్నాయి.

హాల్ టికెట్లు పొందే విధానం ఇలా

ఇంటర్ విద్యార్థులు హాల్‌టికెట్లను మూడు పద్ధతుల్లో పొందేందుకు అవకాశం కల్పించారు. ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మొదటి సంవత్సరం విద్యార్థులు పదో తరగతి హాల్‌టికెట్ నంబరు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం హాల్‌టికెట్ నంబరు లేదా ఆధార్, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేసి హాల్ టికెట్లు పొందొచ్చని ఇంటర్ బోర్డు ఆర్‌ఐఓ జి.సునీత వెల్లడించారు. మనమిత్ర వాట్సాప్ నంబరు 95523 00009కు హాయ్ అని మెస్సేజ్ పంపగానే వివరాలు ప్రత్యక్షమవుతాయి. ఇందులో విద్యార్థి హాల్‌టికెట్ నంబరు, పుట్టిన తేదీ తదితర వివరాలు నమోదు చేసి డౌన్లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. అలాగే జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ తమ కాలేజీ లాగిన్ ఐడీ ద్వారా విద్యార్థుల హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసి అందజేయవచ్చు.

విద్యార్థులకు సూచనలు ఇవే

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఒకరోజు ముందుగా పరీక్ష కేంద్రాన్ని పరిశీలించుకోవాలి.
● గంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.
● ఫీజు బకాయి పేరుతో కళాశాల యాజమాన్యం హాల్‌టికెట్లు నిలిపివేస్తే..అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.
● ముఖ్యంగా వాట్సాప్ లేదా ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్లపై ప్రిన్సిపాల్ సంతకం, కళాశాల స్టాంపు అవసరం లేదని ఇంటర్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 123, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

శైవ క్షేత్రాల్లో..హైకోర్టు న్యాయమూర్తుల పూజలు

మహా శివరాత్రి పర్వ దినం ఆదివారం శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా హైకోర్టు న్యాయమూర్తులు కుటుంబ సభ్యులతో కలిసి కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి, అమరావతి అమరేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి వేద ఆశీర్వచనం అందజేశారు. - అమరావతి


అమరేశ్వర స్వామి ఆలయంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మేడమల్లి బాలాజీ కుటుంబ సమేతంగా పూజలు

త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో

ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలో త్రికోటేశ్వర స్వామిని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కేవీ సురేష్‌రెడ్డి, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ జేవీ సుజాత, జస్టిస్ మండవ కిరణ్మయి, గుంటూరు జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయికల్యాణ్ చక్రవర్తి, జస్టిస్ కృష్ణమోహన్, ప్రధాన జూనియర్ సివిల్ న్యాయాధికారి రెడ్డిపోగు ఆశీర్వాదంపాల్ దర్శించుకున్నారు. అర్చకులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. - నరసరావుపేట లీగల్


ప్రత్యేక పూజల్లో జస్టిస్ సురేష్ రెడ్డి దంపతులు

బాపట్ల జిల్లా కొల్లూరు మండలం చిలుమూరు ఉభయ రామేశ్వరస్వామి ఆలయాన్ని హైకోర్టు జడ్జి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి దంపతులు దర్శించుకుని. రుద్రహోమం, ప్రత్యేక అభిషేకాలు జరిపారు. ధర్మకర్త హరి దుర్గానాగేశ్వరరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. -కొల్లూరు



షూటింగ్ బాల్ విజేతలు నెల్లూరు, చిత్తూరు

సత్తెనపల్లి రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుడిపూడి జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి 9వ ఏపీ షూటింగ్ బాల్ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో నెల్లూరు జిల్లా జట్టు విజేతగా నిలవగా.. బాలికల విభాగంలో చిత్తూరు జిల్లా జట్టు విజయం సాధించింది. విజేతలకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి పి. నరసింహారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ గద్దె అప్పారావు, మాజీ ఛైర్‌పర్సన్ కొనకంచి పుల్లారావు, లాయర్ పిన్నమనేని పాములయ్య, ఆంజనేయులు, సాంబశివరావు, వెంకటేశ్వర్లు, పీడీలు పాల్గొన్నారు.


విజయ సాధించిన చిత్తూరు బాలికల జట్టు

పుణ్య స్నానానికి దిగి కానరాని లోకాలకు

అచ్చంపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా పుణ్య స్నానానికి కృష్ణా నదిలో దిగిన బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం జడపల్లి మోటు తండా వద్ద పుష్కర ఘాట్‌లో చోటుచేసుకుంది. కంచుబోడు తండాకు చెందిన మూడావత్ విష్ణు నాయక్(15) నందుల రేవు సమీపంలోని పుష్కర ఘాట్‌లో స్నానానికి దిగి మునిగి పోయాడు. సమీపంలోని వారు విష్ణు నాయక్ మృత దేహాన్ని వెలికి తీశారు. బాలుడు సత్తెనపల్లిలోని లిటిల్ ఏంజెల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. పండుగకు ఇంటికొచ్చి మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృతుడి తండ్రి చిన్న శ్రీనునాయక్, తల్లి శోక సంద్రంలో మునిగిపోయారు.


విష్ణు నాయక్ (పాత చిత్రం)

సాగర్ కాల్వలో యువకుడి గల్లంతు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ తిరునాళ్లలో విషాదం చోటుచేసుకుంది. ప్రకాశం జిల్లా కందుకూరు మండలం సింగమనేనిపల్లికి చెందిన కట్టా రోహిత్(21) అనే యువకుడు ఆదివారం సాగర్ కాల్వలో కొట్టుకుపోయాడు. తాపిమేస్త్రిగా పనిచేస్తూ.. తిరునాళ్ల కోసం స్నేహితులతో కలిసి హైదరాబాదు నుంచి వచ్చిన అతను తెల్లవారుజామున పెట్లూరివారిపాలెం వద్ద సాగర్ కాల్వలో స్నానానికి దిగాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో అదుపుతప్పి గల్లంతయ్యాడు. ఇది గమనించిన స్నేహితులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టి, అధికారులకు సమాచారం అందించారు. సాయంత్రం వరకు రోహిత్ ఆచూకీ లభించలేదు. తిరునాళ్లకు అధిక సంఖ్యలో వస్తున్న భక్తులు కాల్వలు, చెరువుల వద్ద స్నానాలు చేయడానికి దిగుతుండటంతో అధికారులు జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు.

పురోగతి వైపు నడిపించే బాధ్యత బుద్ధి జీవులదే

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని, ప్రజలను పురోగతి వైపు నడిపించే మేథావి వర్గాన్ని చరిత్ర ఎప్పుడూ గుర్తుంచుకుంటుందని, ఆ బాధ్యతను బుద్ధి జీవులే పోషించాలని వీక్షణం సంపాదకుడు, సామాజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషకుడు ఎన్.వేణుగోపాల్ అన్నారు. నాస్తిక సమాజం ఆధ్వ ర్యంలో మంగళగిరి మండలం నిడమర్రులోని చార్వాక ఆశ్రమంలో 34వ నాస్తిక మేళా రెండో రోజైన ఆదివారం కొనసాగింది. ఉదయం జరిగిన సమావేశానికి బెనహర్ అధ్యక్షత వహించారు. సంక్షోభంలో బుద్ధి జీవుల పాత్ర అనే అంశంపై వేణుగోపాల్ మాట్లాడుతూ సంక్షోభం గురించి మార్క్స్ వారసులు, మార్క్సేత రుల నిర్వచనాలను వివరించారు. సంక్షోభ రూపం, సారం వేర్వేరని, రెండింటినీ అర్థం చేసుకోవాలంటే కార్ల్ మార్క్స్, లెనిన్, గ్రాంసీ ఇచ్చిన వివరణ, వ్యక్తి నుంచి పౌర సమాజం వరకు సంక్షోభాల పరంపరను తెలుసుకోవాలని సూ చించారు. రెండో సమావేశానికి జన విజ్ఞాన వేదిక నాయకులు కే.లక్ష్మీనారాయణ స్వాగతం పలుకగా, డాక్టర్ టీ.రాజా రావు అధ్యక్షత వహించారు. డాక్టర్ బీవీ రాఘవులు భారత సమాజంలో ఫాసి జం అనే అంశంపై ప్రసంగించారు. నాస్తిక సమాజం నేతలు కే.కోటేశ్వరరావు, బి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



నాస్తిక మేళాలో ప్రసంగిస్తున్న వేణుగోపాల్

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

బాపట్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌షాక్‌కు గురై ఎలక్ట్రీషియన్ మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. సూర్యలంక రోడ్డులోని ఇమ్మడిశెట్టివారిపాలెంలో వాటర్ ప్లాంట్‌లో మోటరు రిపేరు చేస్తున్న భీమావారిపాలేనికి చెందిన కారుమూరి సతీష్ (36) ప్రమాద శాత్తూ విదుత్ షాక్‌కు గురయ్యాడు. మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టణ మహిళా ఎస్సై షేక్.నస్రీన్ విచారిస్తున్నారు.

బడ్జెట్‌లో బీసీలకు సముచిత కేటాయింపులు

● కేసన శంకరరావు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో బీసీలకు సముచిత స్థానం కల్పించిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం నవరత్నాల పేరిట ఏడాదికి రూ.52 వేల కోట్లు ఖర్చు చేస్తే .. కూటమి ప్రభుత్వం ఒక్క బీసీల సంక్షేమానికే రూ.51,021 కోట్లు కేటాయించడం సంతోష కరమన్నారు. వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా 56 కుల కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందే తప్ప ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించ లేదని విమర్శించారు.

శంభో శంకర

(5వ పేజీ తరువాయి)

మంత్రి గొట్టిపాటి తెలిపారు. ఆయన వెంట హోం మంత్రి వంగలపూడి అనిత, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఉన్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, బీ రామాంజనేయులు, గల్లా మాధవి, ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి, కలెక్టర్ కృతికాశుక్లా, జేసీ సంజనాసింహ, ఎస్పీ కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మురుగుడు హనుమంతరావు తదితరులు ఉన్నారు.

వీఐపీల రాకతో భక్తుల ఇక్కట్లు..

స్వామివారి దర్శనానికి వీఐపీలు తరలివచ్చారు. కొందరు ప్రజాప్రతినిదుల వెంట వారి అనుచరులు అధికంగా ఆలయంలోకి ప్రవేశించారు. రూ.200 టిక్కెట్, అభిషేకం దర్శనం లైన్‌లో వీఐపీలను అనుమతించడంతో సాధారణ భక్తులు గంటలకొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. దీంతో భక్తులు ఇక్కట్లు పడ్డారు. ప్రసాదం నాణ్యతపై భక్తులు పెదవి విరిచారు. కొండకు వచ్చే మార్గంలోని పెట్లూరివాపాలెం వద్ద ట్రాఫిక్ స్తంభించింది. దీంతో భక్తులు ట్రాఫిక్ ఇక్కట్లను ఎదుర్కొన్నారు.

కనువిందు చేసిన విద్యుత్ ప్రభలు

వివిధ గ్రామాల నుంచి కోటయ్య క్షేత్రానికి తరలివచ్చిన 23 భారీ విద్యుత్ ప్రభలు కొండలో కొలువుదీరాయి. ప్రభల విద్యుత్ కాంతులు యాత్రికులకు కనువిందు చేశాయి. ప్రభలపై సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఉదయం 11 గంటల కల్లా భారీ విద్యుత్ ప్రభలు కొండకు చేరుకున్నాయి. చిలకలూరిపేట రహదారిలో విద్యుత్ ప్రభల రాక శోభాయమానంగా సాగింది. నరసరావుపేట రహదారిలో సాధారణ ప్రభల రాకతో కోలాహలం నెలకొంది. నరసరావుపేట మండలం కాకాని, ఉప్పలపాడు, గురవాయపాలెం, చిలతలపాలెం నుంచి ఒక్కొక్కటి, చిలకలూరిపేట నియోజకవర్గం పురుషోత్తపట్నం నుంచి ఆరు, యడవల్లి, కోమటినేనివారిపాలెం, అవిశాయపాలెం, కమ్మవారిపాలెం, గణపవరం, గంగపాలెం, అప్పాపురం, మద్దిరాల, కావూరు నుంచి ఒక్కొక్కటి, గంగన్నపాలెం నుంచి రెండు భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలివచ్చాయి. కావూరు ప్రభ 80వ వార్షికోత్సవం, అవిశాయపాలెం ప్రభ 69వ వార్షికోత్సవాన్ని ఆయా గ్రామాలకు చెందిన వారు ఘనంగా జరుపుకున్నారు. రెండు వైపుల విద్యుత్ దీపాలతో బొప్పూడి ప్రభ భక్తులను ఆకట్టుకుంది. తెల్లవార్లు ఆయా ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలు జరగ్గా భక్తులు తిలకించారు.


కోటప్పకొండపై.. త్రికోటేశ్వరస్వామి ఆలయ రాజగోపురం నుంచి వీక్షణలో ప్రభల వెలుగులు


కోటయ్య దర్శనం కోసం.. మరో మార్గం లేక..


కోటప్పకొండ దిగువన కూడలి.. నిజంగానే ఇసుకేస్తే.. నేలరాలదు


తిరునాళ్లలో ప్రభుత్వ శాఖల స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న పల్నాడు కలెక్టర్ కృతికా శుక్లా


తలనీలాలు ఇస్తాం.. కోటయ్య సేవలో తరిస్తాం


ఓ వైపు భక్తి..మరో వైపు రక్తి.. తిరునాళ్లంటే ఆ మాత్రం ఉండాల్సిందే..


నందీశ్వర అందుకో భక్త నైవేద్యం..

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్యకు సంతాపం

గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో సంతపాలు తెలియజేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రెంటచింతల మండలం తుమృకోటలో పుట్టి విజయవాడకు వలస వెళ్లి అక్కడ అంచెలంచెలుగా వ్యాపార, రాజకీయవేత్తగా ఆయన ఎదిగారని కీర్తించారు. తన 97 ఏళ్ల జీవితంలో శాలివాహనుల సంక్షేమానికి విశేషంగా కృషి చేశారన్నారు. ఆయన మరణం తమకు తీరని లోటని శాలివాహన సంఘాల నాయకులు రాజవరపు ఏడుకొండలు, కానూళ్ల ప్రవీణ్‌కుమార్, ఇందుర్తి శివన్నారాయణ, రాజవరపు శ్రీనివాసరావు, మురహరిరావు, భిక్షపతి, వీవీఎస్ గిరీష్, నారాయణ, మండేపూడి పురుషోత్తం, కాజా శ్రీనివాసరావు, గురుమూర్తి, పొరెళ్ల బసవేశ్వర్, పొరళ్ల అంకమ్మరావు తదితరులు సంతాపం తెలిపారు.

రేపు బాబా ధ్యాన మందిర వార్షికోత్సం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట గణేశ్వరరావు వీధిలో కొలువైన షిరిడి సాయిబాబా ధ్యాన మందిర వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు వేపూరి లక్ష్మీనరసింహారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సావాల్లో భాగంగా బాబాకు హారతి, పంచామృతాభిషేకాలు జరుగుతాయన్నారు. భక్తి గీతాలు ఆలాపన, భక్తులకు అన్నసంతర్పణ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా ఆశీస్సులు పొందాలని కోరారు.

అలరించిన భక్తి సంగీత విభావరి

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొండ వెంకటప్పయ్య కాలనీలోని సాయి బాబా మందిరంలో మహా శివరాత్రి సందర్భంగా స్వరరాగ సుధా ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకులు కేవీ సాయిబాబా శర్మ బృందం పలు భక్తి గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. కీ బోర్డుపై రామకృష్ణశర్మ, తబలాపై షణ్ముఖశర్మ వాయిద్య సహకారం అందించారు. అనంతరం కళాకారులను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యానగర్ రెండో లైను నుంచి 4వ లైను వరకు, రింగ్ రోడ్డు, రాధాకృష్ణ టవర్స్, ఐటీసీ హోటల్ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రశాంతతకు యోగా, ధ్యానం అవసరం

గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత జీవనానికి, ఆనందమయంగా ఉండటానికి యోగా, ధ్యానం ఎంతో అవసరమని యోగాచార్యులు ప్రొఫెసర్‌లు కె.కొండయ్య, జి.సాంబశివరావు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం యోగా, ధ్యానం, ప్రాణాయామాలతో ఆరోగ్యం అనే అంశంపై జరిగిన ఆరోగ్యసభలో ఆయన మాట్లాడారు. యోగాభ్యాసాన్ని జీవితంలో ఒక భాగం చేసుకోవాలన్నారు. మనసు, శరీరం, ఆత్మను నియంత్రించటంలో యోగా, ధ్యానం ప్రాణాయామాలు సహాయకారిగా ఉంటాయన్నారు. యోగాతో రక్తపోటు అదుపులో ఉంటుందని, శ్వాసప్రక్రియ శక్తిని కూడా మెరుగు పరుస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సదాశివం తదితరులున్నారు.

నేడు ఎస్పీ కార్యాలయంలో పీజీఆర్ఎస్ రద్దు

ప్రతి సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగే పీజీఆర్ఎస్ (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని ఈ వారం రద్దు చేస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది మహాశివరాత్రి బందోబస్తు విధుల్లో ఉన్న నేపథ్యంలో సోమవారం జరగాల్సిన పీజీఆర్ఎస్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని ఎస్పీ కోరారు.

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు




మహాశివరాత్రి అలంకరణలో పెదకాకాని భ్రమరాంబ అమ్మవారు, మల్లేశ్వర స్వామి వారు ←

● కిటకిటలాడిన ఆలయాలు

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని ఆదివారం నగరంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులతో శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. వారి కోసం ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నగరంలోని అరండల్‌పేట, పట్టాభిపురం, కొత్తపేట శివాలయాలు, శ్యామలానగర్, మల్లారెడ్డినగర్, మారుతినగర్ ఇతర ప్రాంతాలోని అలయాల్లో స్వామి వారికి అభిషేకార్చనలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. శివ, పార్వతుల కల్యాణాలు జరిగాయి. అయా ఆలయాల్లో వేకువజాము వరకు జరిగే ఉపవాస దీక్షలలో భక్తులు పాల్గొన్నారు. బృందావన్ గార్డెన్స్, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం ధార్మిక ప్రాంగణంలోని యాగశాలలో బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి, రుద్ర, చండీ హోమాలు, మహాపూర్ణాహుతి నిర్వహించారు.



పాతగుంటూరు శివాలయంలో బారులు తీరిన భక్తులు



పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానాన్ని దర్శించిన కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్




రవీంద్ర నగర్ లోని శివాలయంలో శివుడికి అభిషేకం చేస్తున్న అర్చకులు, స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు.



కొత్తపేట శివాలయంలో శివుడికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు



సినీ దర్శకుడు బోయపాటి శ్రీనుకు పెదకాకాని మల్లేశ్వరస్వామి జ్ఞాపిక అందజేస్తున్న చైర్మన్ పూర్ణచంద్రరావు, ఈవో లీలాకుమార్

బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్పీ

గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శైవ క్షేత్రాలవద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం సూచిక బోర్డులు ఏర్పాటు చేశామని, ఆలయ ప్రాంగణాలలో భారీ కేడింగ్ ఏర్పాటు చేసి క్యూలైన్లు సక్రమంగా నిర్వహించినట్లు చెప్పారు. మైక్ కాన్వాసింగ్ ద్వారా భక్తులకు అవసరమైన సూచనలు అందించామన్నారు. ప్రతి ముఖ్య ఆలయం వద్ద పోలీస్ కంట్రోల్ కేంద్రాలు ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తూ అత్యవసర పరిస్థితుల్లో భక్తులకు తక్షణ సహాయం అందించేందుకు సిబ్బంది సహకరించారన్నారు. ఆలయాలు, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగించామన్నారు. డ్రోన్ కెమెరాల సహాయంతో గస్తీ నిర్వహించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా రూట్ బందోబస్తును సిబ్బందిని సమర్థవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. ప్రత్యేక నిఘా, ఇంటెలిజెన్స్ బృందాలను నియమించి, ముందస్తు సమాచారసేకరణ చేపట్టి శాంతిభద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకున్నామన్నారు.

మిర్చి వ్యాపారి తనయుడు దారి దోపిడీ నాటకం

● ఛేదించిన నల్లపాడు పోలీసులు

గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చేసిన అప్పులు తీర్చే మార్గం లేక కన్న తండ్రిని బురిడీ కొట్టించేందుకు మిర్చి వ్యాపారి తనయుడు దారి దోపిడీ నాటకం ఆడి పోలీసులకు దొరికిపోయాడు. పల్నాడు జిల్లా సాతులూరు గ్రామానికి చెందిన కాసుల రామారావు మిర్చి వ్యాపారం చేస్తుంటాడు. గ్రామాల్లో రైతుల వద్ద మిర్చి కొనుగోలు చేసి గుంటూరులో కమీషన్ ఏజెంట్లకు విక్రయిస్తుంటాడు. మిర్చి వ్యాపారులు ఇచ్చిన డబ్బును రామారావు లేదా ఆయన కుమారుడు వెంకటేశ్వర్లు కాని తీసుకొస్తుంటారు. ఈ క్రమంలో శనివారం వెంకటేశ్వర్లును డబ్బు తీసుకొచ్చేందుకు తండ్రి పంపాడు. వెంకటేశ్వర్లు మిర్చి వ్యాపారి నుంచి రూ.11 లక్షలు తీసుకొని ఇంటికి బయలుదేరాడు. ఆ తర్వాత రెండు గంటలకు తండ్రికి ఫోన్ చేసి తాను నగదు తీసుకొని వస్తుంటే ముఖానికి మాస్క్ ధరించిన గుర్తుతెలియని వ్యక్తి కంటిలో స్ప్రే చేసి తన వద్ద ఉన్న నగదు బ్యాగును గుంజుకొని పారిపోయాడని చెప్పాడు దీనిపై నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళుతున్నానని తండ్రికి చెప్పాడు. వెంకటేశ్వర్లు నుంచి పోలీసులు వివరాలు సేకరించారు. వెంకటేశ్వర్లు చెబుతున్న విషయాలకు వాస్తవ పరిస్థితులకు పొంతన కుదరకపోవడంతో పోలీసులు అతనిపై అనుమానంతో లోతుగా విచారించారు. సాంకేతిక ఆధారాలను ఉపయోగించి వెంకటేశ్వర్లును పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో అసలు విషయం బయటపడింది. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక తండ్రిని బురిడీ కొట్టించాలని వెంకటేశ్వర్లు చిలకలూరిపేటకు చెందిన తన ఇద్దరు స్నేహితులతో కలిసి ఈ పథకం రూపొందించినట్లు గుర్తించారు. దీంతో పోలీసులు చిలకలూరిపేట వెళ్లి వెంకటేశ్వర్లు స్నేహితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నగదును రికవరీ చేసినట్లు తెలిసింది. నల్లపాడు పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

తెలుగు మహిళా నాయకురాలిని మోసం చేసిన ఈఈ

నూజివీడు పంచాయతీరాజ్ ఈఈ బాపిరెడ్డి తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి విడతల వారీగా రూ.కోటిన్నర డబ్బు తీసుకొని మోసం చేశాడని దేవాపురానికి చెందిన తెలుగు మహిళా నాయకురాలు వీరగంధం హేమలత పోలీసులను ఆశ్రయించారు. కృష్ణాజిల్లా నూజివీడులో పంచాయతీరాజ్ ఈఈగా పనిచేస్తున్న బాపిరెడ్డి కొద్ది సంవత్సరాలుగా తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేసి మోసం చేశాడని హేమలత పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేగాక విడతల వారీగా తన వద్ద రూ.కోటిన్నర డబ్బు తీసుకున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. హేమలత ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు ఈఈ బాపిరెడ్డిపై కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

సామాజిక మాధ్యమాలు చైతన్య దీపాలు కావాలి

● అమరావతి సాహితీ మిత్రులు అధ్యక్షుడు రావి రంగారావు



కవితా విజేతలను సత్కరిస్తున్న డాక్టర్ రంగారావు తదితరులు

గుంటూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలు చైతన్య దీపాలు కావాలని అమరావతి సాహితీ మిత్రులు అధ్యక్షుడు డాక్టర్ రావి రంగారావు అన్నారు. బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన అమరావతి సాహితీ మిత్రులు సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. సామాజిక మాధ్యమాలలో విష సంస్కృతి వస్తోందని ఆడిపోసుకోవడం కంటే చక్కని సందేశాత్మక అంశాలు పోస్ట్ చేసి దేశ చైతన్య దీపాలుగా మార్చాలని ఆయన కవులకు, కళాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ కవిత విజేత సంబరాజు రమణిని, ఉత్తమ కథానిక విజేత పగడాల వెంకటరెడ్డిని, ఉత్తమ రీల్స్ విజేత కృష్ణ భార్గవిని 'అమరావతి సాహితీ మిత్రులు' సంస్థ పక్షాన డాక్టర్ రావి రంగారావు, న్యాయ నిర్ణేత బండికల్లు జమదగ్ని, ము ప్పాళ్ళ ప్రసాదరావు శాలువాలతో ఘ నంగా సత్కరించారు. ఈ సమావేశంలో పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవితా పఠనంలో రమణి, సంబరాజు రవికుమార్, పుట్టంరాజు నరసింహమూర్తి, మెట్టు శ్రీనివాసరెడ్డి, పీవీ రెడ్డి, పీకే భార్గవి, పూసపాటి వేంకటకృష్ణ సూర్య కుమార్, గోలి హనుమశాస్త్రీ, జి.విజయలక్ష్మి, ఏ.శంకర్, మండే సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. సంబరాజు రమణి నిర్వహించిన రీల్స్ ప్రదర్శనలో కృష్ణ భార్గవి, భాగ్యలక్ష్మి, రాజ్యలక్ష్మి, కుసుమ, ఆర్ ఆర్ రావు, రవికుమార్ పాల్గొన్నారు. కథానికల పఠన కార్యక్రమంలో పగడాల వెంకటరెడ్డి, జీఎస్ మాధవరావు, మన్నం వెంకటగురువు, లక్ష్మి, రావు హాజరయ్యారు.

పాఠశాలల్లో మౌలిక వసతులకు రూ.10లక్షల విరాళం

● కలెక్టర్‌కు అందజేసిన వడ్లమూడి గోపాలకృష్ణయ్య, లక్ష్మమ్మ ఫౌండేషన్



కలెక్టర్‌కు రూ.10 లక్షల విరాళాన్ని అందజేస్తోన్న వడ్లమూడి గోపాలకృష్ణయ్య అండ్ వెంకట లక్ష్మమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాబు రాజేంద్రప్రసాదు

గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణానికి చెందిన వడ్లమూడి గోపాలకృష్ణయ్య, వడ్లమూడి వెంకట లక్ష్మమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వడ్లమూడి బాబు రాజేంద్రప్రసాదు పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.10 లక్షల విరాళాన్ని అందించారు. ఆదివారం రూ.10 లక్షల చెక్కును గుంటూరు జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియాకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఫౌండేషన్ చేపట్టిన సేవ కార్యక్రమాలను అభినందిస్తూ సమాజాభివృద్ధికి ఇది ఆదర్శప్రాయమైన ముందడుగని పేర్కొన్నారు. సమాజంలోని ఇతర దాతలు కూడా ఇలాంటి కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. జీరో పావర్టీ (పీ4) కార్యక్రమ లక్ష్యాలకు అనుగుణంగా విద్యా రంగాన్ని బలోపేతం చేయడం, విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించడం ఈ విరాళం ప్రధాన ఉద్దేశమని దాత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మీకుమారి, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ జెట్టి సౌలరాజు, యంగ్ ప్రొఫెషనల్ ప్రతిపాటి సురేష్ పాల్గొన్నారు.

కంకరగుంట ఫ్లై ఓవర్ పై రోడ్డు ప్రమాదం

● వంట మాస్టర్ దుర్మరణం



హర్షవర్ధన్ మృతదేహం

గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంకరగుంటఫ్లై ఓవర్‌పై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ షవర్మా మాస్టర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య తెలిపిన వివరాలు ప్రకారం, బాపట్ల జిల్లా వేమూరు మండలం బూతుమల్లి గ్రామానికి చెందిన శృంగారపాటి హర్షవర్ధన్ (21) పది సంవత్సరాలుగా గుంటూరులో ఉంటున్నాడు. కుందుల రోడ్డులో గది అద్దెకు తీసుకొని ఆరు సంవత్సరాలుగా బృందావన్ గార్డెన్స్‌లో షవర్మ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఇంటికి వెళ్లేందుకు గది నుంచి బయలుదేరి వెళ్లాడు. శివరాత్రి కారణంగా తిరునాళ్లకు రోడ్డు రద్దీగా ఉంటుందని అందువల్ల సోమవారం వెళ్దామని భావించి సగం దూరం వెళ్లి గదికి తిరిగి వస్తూ కంకరగుంట బ్రిడ్జి పైన ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీ కొట్టి అదుపుతప్పి కిందపడ్డాడు. తల ఫుట్‌పాత్‌కు తగలడంతో హర్షవర్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

శివుడిని దర్శించుకున్న ఏపీటీఎస్ చైర్మన్ మోహనకృష్ణ



శివాలయంలో మన్నవ మోమనకృష్ణ

గుంటూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) చైర్మన్ మన్నవ మోహన కృష్ణ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గుంటూరు మారుతీనగర్‌లోని శివాలయంలో మహాశివుడిని ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రాభివృద్ధికి దిశానిర్దేశం చేస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని చెప్పారు.

ఇంటి దగ్గర కూర్చొని బడ్జెట్‌పై ప్రేలాపనలు

● గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో పట్టుమని పది నిమిషాలు కూడా ఉండకుండా ఇంటి దగ్గర కూర్చొని బడ్జెట్‌పై వైసీపీ నాయకులు ప్రేలాపనలు చేస్తున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గత ప్రభుత్వ అసమర్థ పాలనలో చితికిన రాష్ట్రానికి ప్రస్తుత బడ్జెట్ ఆశా దీపమని అన్నారు. రాష్ట్రాభివృద్ధిలో సంక్షేమాన్ని నిచ్చెనగా మార్చుకొని ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చేలా సీఎం చంద్రబాబు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ రూపొందించారని తెలిపారు. అమరావతి, పోలవరం రెండు కళ్లుగా నిధులు కేటాయించినట్లు చెప్పారు. సామాన్యుల నుంచి వ్యాపారుల వరకు, యువకుల నుంచి మహిళలు, రైతుల వరకు అన్ని వర్గాలకూ మేలు చేసేలా బడ్జెట్ ఉందన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో 'స్కిన్ ఫర్ఫెక్ట్ హాస్పిటల్'

● ప్రారంభించిన కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
● అందుబాటులో ఆధునిక లేజర్ చికిత్సలు: డాక్టర్ మన్నె సింధూర

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మెట్రో నగరాలకు దీటుగా గుంటూరులో అధునాతన వైద్య సౌకర్యాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో 'స్కిన్ ఫర్ఫెక్ట్' చర్మవ్యాధుల ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. కొత్తపేట ఓల్డ్‌క్లబ్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్కిన్ ఫర్ఫెక్ట్ హాస్పిటల్‌ను ఆదివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక వైద్య పరిజ్ఞానంతో స్కిన్ ఫర్ఫెక్ట్ హాస్పిటల్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ, అంతర్జాతీయ ప్రమాణాలతో చర్మ వ్యాధుల ఆసుపత్రిని గుంటూరులో అందుబాటులో తేవడం హర్షణీయమన్నారు. ఆసుపత్రి చీఫ్ డెర్మటాలజిస్ట్ డాక్టర్ మన్నె సింధూర మాట్లాడుతూ, లేజర్ టెక్నాలజీ, డెర్మటో సర్జరీ, ఇమ్యునోథెరపీ, కాస్మోటిక్, రీకన్‌స్ట్రక్టివ్ థెరపీ వంటి చికిత్సలు తమ హాస్పిటల్‌లో ఉన్నట్లు వివరించారు. హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, అల్మా సోప్రానో లేజర్, హైఫూ, ఎగ్జిమర్ లేజర్, ఎర్బియం లేజర్, థులియం లేజర్, క్యూ స్విచ్డ్ యాగ్ లేజర్ వంటి హైఎండ్ లేజర్ చికిత్సలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, నక్కా ఆనందబాబు, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఏపీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ రవికుమార్ పీ వేమూరు, స్వచ్ఛాంధ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఏపీ ఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, డాక్టర్ ఉప్పుటూరి అంజిత్, డాక్టర్ ఉప్పుటూరి హేమంత్, డాక్టర్ లక్ష్మీప్రియ, స్టేట్ టెక్నాలజీ కార్పొరేషన్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, డిప్యూటీ మేయర్ సజీల పాల్గొన్నారు.



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

అలరించిన కూచిపూడి ప్రదర్శనలు



కూచిపూడిని ప్రదర్శిస్తున్న చిన్నారులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నృత్య కళాభారతి 27వ వార్షికోత్సవాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. కీ బోర్డుపై తిన్నలూరి శ్రీహరిబాబు, మృదంగంపై టి. ప్రభాకరరావు, వయోలిన్‌పై ధూళిపాళ్ల శ్రీనివాస్ శర్మ, డ్రమ్స్ పై పి బాలాజీ వాయిద్య సహకారం అందించారు. అనంతరం జరిగిన సభలో పయనీర్ గ్రూప్స్ చైర్మన్ చుక్కపల్లి రమేష్, డాక్టర్ రాయపాటి మమత తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై ఏఎన్‌యూ, కూచిపూడి అధ్యాపకులు మట్టుపల్లి విశ్వాన్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్ని నాట్యాచార్య ఎన్.బాలు పర్యవేక్షించారు.

వివాహిత అదృశ్యం



బోరుగడ్డ దీప్తి(ఫైల్)

గుంటూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సంజయ్ గాంధీనగర్ అమరావతి రోడ్‌కు చెందిన బోరుగడ్డ దీప్తి అనే వివాహిత అదృశ్యమైంది. దీప్తికి అక్టోబర్ 2025లో బాపట్ల జిల్లా నగరం మండలం వెనిగళ్ళ గ్రామానికి చెందిన దాసరి కల్యాణ్‌తో వివాహం జరిగింది. అతను ముంబైలో ఉద్యోగం చేస్తున్నాడు. 10 రోజుల క్రితం అతను ముంబై వెళుతూ దీప్తిని ఇంటి వద్ద దింపి వెళ్ళాడు. ఈ క్రమంలో దీప్తి 14న ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్ళిపోయిందని, ఇంతవరకూ తిరిగి రాలేదని, ఆమె కోసం వెతికినప్పటికీ ఆచూకీ దొరకలేదని ఆమె తండ్రి బోరుగడ్డ డేవిడ్ అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్టీఆర్ స్టేడియం ఎన్నికకు భారీగా నామినేషన్లు

గుంటూరుకార్పొరేషన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికకు భారీ స్థాయిలో నామినేషన్లు అందాయి. ఆదివారం ఒక రోజు 17 నామినేషన్లు దాఖలు అయ్యాయని ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ ఎన్నికల అధికారి సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఎన్నికకు సెక్రటరీకి 4, వైస్ ప్రెసిడెంట్ 1, ట్రెజరర్‌కు 2, జాయింట్ సెక్రటరీకి 4, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌కు 6 (పురుషులు 5, మహిళలు1) నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. నామినేషన్లకు 16వ తేదీ సోమవారం చివరి రోజని, ఆసక్తి కలిగిన సభ్యులు నామినేషన్లు దాఖలు చేయవచ్చన్నారు. ఎన్టీఆర్ స్టేడియం సెక్రటరీగా పోటీ చేసేందుకు టీడీపీ సీనియర్ నాయకుడు వజ్జా రామకృష్ణ నామినేషన్ దాఖలు చేశారు.



సెక్రటరీగా నామినేషన్ అందజేస్తున్న వజ్జా రామకృష్ణ తదితరులు

దిక్సూచి

ఐఐఎస్సీలో పీజీ-పీహెచ్‌డీ



సైన్సెస్‌లో రారాజుగా అలరారుతున్న సమున్నత విద్యా సంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ). బెంగళూరులోని ఈ సంస్థ ప్రస్తుతం పీజీ - పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు నోటిఫికేషన్ విడుదల చేసింది.

సైన్స్‌లో పీహెచ్‌డీ: ఆస్ట్రామీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్, బయోకెమిస్ట్రీ, ఎకలాజికల్ సైన్సెస్, హై ఎనర్జీ ఫిజిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ అప్లయిడ్ ఫిజిక్స్, ఇనార్గానిక్ అండ్ ఫిజికల్ కెమిస్ట్రీ, మెటీరియల్స్ రీసెర్చ్, మ్యాథమెటిక్స్, మైక్రోబయాలజీ అండ్ సెల్ బయాలజీ, మాలిక్యులర్ బయోఫిజిక్స్, డెవలప్‌మెంటల్ బయాలజీ అండ్ జెనెటిక్స్, న్యూరోసైన్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజిక్స్, సాలిడ్ స్టేట్ అండ్ స్ట్రక్చరల్ కెమిస్ట్రీ.

పీహెచ్‌డీ ఇన్ ఇంజనీరింగ్/ ఎంటెక్(రీసెర్చ్): ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, అట్మాస్ఫిరిక్ అండ్ ఓషియానిక్ సైన్సెస్, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యుటేషనల్ అండ్ డేటా సైన్సెస్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఆటోమేషన్, ఎర్త్ సైన్సెస్, ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ స్టడీస్, మెటీరియల్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, నానోసైన్స్ అండ్ ఇంజనీరింగ్, డిజైన్ మాన్యుఫాక్చరింగ్, సస్టయినబుల్ టెక్నాలజీ

ఇంటర్‌డిసిప్లినరీ పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్/ ఎంటెక్(రీసెర్చ్): బయోఇంజనీరింగ్, బ్రెయిన్, కంప్యుటేషన్ అండ్ డేటా సైన్స్, క్లయిమేట్ చేంజ్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్, ఎనర్జీ, మ్యాథమెటికల్ సైన్సెస్, వాటర్ రీసెర్చ్

పీహెచ్‌డీ ప్రోగ్రామ్ ఇన్ మెడికల్ సైన్సెస్: పబ్లిక్ హెల్త్

దరఖాస్తుకు ఆఖరు తేదీ : మార్చి 23 (స్పాన్సర్డ్ అలాగే ఎక్స్‌టర్నల్ రిజిస్ట్రేషన్ ప్రోగ్రామ్స్‌కు మార్చి 31

వెబ్‌సైట్: www.iisc.ac.in/admissions

యూఓహెచ్‌లో డిస్టెన్స్ కోర్సులు

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్)కు చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ ఎడ్యుకేషన్ పీజీ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సులు: లైబ్రరీ ఆటోమేషన్ అండ్ నెట్‌వర్కింగ్, సైబర్‌లాస్ అండ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్, క్రిమినల్ జస్టిస్ అండ్ ఫోరెన్సిక్ సైన్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, పంచాయతీరాజ్ గవర్నెన్స్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్, ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్, కమ్యూనిటీ ఐ హెల్త్, హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్.

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత. ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్, కమ్యూనిటీ ఐ హెల్త్ కోర్సులకు మాత్రం హెల్త్ సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

దరఖాస్తు: ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తి చేయాలి. సంబంధిత కాపీని, ఫీజుతో పాటు యూనివర్సిటీకి సంబంధించి నాంపల్లిలో ఉన్న కార్యాలయానికి పంపుకోవాలి.

దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 28

వెబ్‌సైట్: https://uohydodladm.samarth.edu.in/index.php



దేశవ్యాప్తంగా ఉన్న వివిధ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, డెంటిస్ట్రీ, ఆయుష్ కోర్సుల్లో సీట్ల భర్తీకి ఉద్దేశించిన ప్రవేశ పరీక్ష నీట్‌కు నోటిఫికేషన్ విడుదలైంది. నీట్‌కు పూర్తి రూపం-నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్ టెస్ట్. అర్హులైన అభ్యర్థులు మార్చి 8 లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. సీట్లు పరిమితం కాగా ఇరవై లక్షలకు మించి అభ్యర్థులు ఈ టెస్ట్‌కు పోటీపడతారు. ఫలితంగా పోటీ తీవ్రంగా ఉంటుంది. ఈ క్రమంలో ఇటు ఇంటర్ పరీక్షలను బ్యాలెన్స్ చేసుకుంటూ నీట్‌కు జాగ్రత్తగా సన్నద్ధమైతే అఖిల భారత స్థాయిలో మంచి ర్యాంకు పొందే అవకాశం ఉంటుంది. ఈ ప్రిపరేషన్‌లో భాగంగా...

నీట్ ప్రిపరేషన్



మార్చి రెండో వారం పూర్తయ్యేలోపు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్ పరీక్షలు పూర్తవుతాయి. నీట్ మే 3న జరుగుతుంది. అంటే ఇంటర్ పరీక్షలు పూర్తయ్యాక దాదాపు 50 రోజుల వ్యవధి ఉంటుంది.

- సెకండియర్ చదువుతున్న విద్యార్థులు ఇప్పటికే ల్యాబ్ పరీక్షలు పూర్తి చేసుకుని ఇంటర్ రెండో ఏడాది పరీక్షలకు ప్రిపరేషన్ ఆరంభించి ఉంటారు. రెండో ఏడాదికి చెందిన బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీకి సంబంధించి ఐపీఈ ప్రశ్నలకు సమాధానాలు ఒకవైపు నేర్చుకుంటూనే, దానికి సమాంతరంగా ఆ సబ్జెక్టుల్లోని కాన్సెప్టులపై షార్ట్ నోట్స్ రాసుకోవాలి.
- బాటనీ, జువాలజీలో ముఖ్యమైన స్టేట్‌మెంట్స్ అలాగే ఫిజిక్స్, కెమిస్ట్రీలోని ముఖ్యమైన ఫార్ములాలు, రియాక్షన్స్‌కి ప్రత్యేకించి నోట్స్‌ను రూపొందించుకోవాలి.
- కేవలం గైడ్స్ లేదంటే స్టడీ మెటీరియల్ మీద ఆధారపడకూడదు. ఎన్‌సీఈఆర్‌టీ, ఐపీఈ పుస్తకాలను లోతుగా చదవాలి. ఫలితంగా వివిధ కాన్సెప్టులపై పట్టు సాధ్యమవుతుంది.
- ఆబ్జెక్టివ్ ప్రశ్నలపై పట్టుపోకుండా ఉండేందుకు ఇంటర్ పరీక్షలకు కోసం ఏ టాపిక్ లేదంటే చాప్టర్ చదివారో, దానిలో అయిదు నుంచి పది ఆబ్జెక్టివ్ ప్రాబ్లెమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- గతేడాది నీట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీలో ప్రశ్నలు కఠినంగా వచ్చాయి. అందువల్ల ఆ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. బయాలజీ స్కోరింగ్ సబ్జెక్టు. అయినప్పటికీ నీట్‌లో ఆలిండియా ర్యాంకు పొందాలంటే ఫిజిక్స్, కెమిస్ట్రీలోనూ బాగా స్కోర్ చేయాలి.
- ఫిజిక్స్‌లో ప్రత్యేకించి మెకానిక్స్, ఎలక్ట్రిసిటీ, మేగ్నటిజమ్, మోడ్రన్ ఫిజిక్స్ మీద దృష్టి పెట్టాలి. ఫార్ములా సబ్‌స్టిట్యూషన్, యూనిట్ కన్వర్షన్, స్టెప్‌వైజ్ సాల్వింగ్ ప్రాక్టీస్ చేయాలి.
- కెమిస్ట్రీలో ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి జీఓసీ, ఐసోమెరిజమ్, రియాక్షన్ మెకానిజమ్, పీఓసీ; ఇనార్గానిక్ కెమిస్ట్రీలో పీరియాడిక్ ప్రాపర్టీస్, కెమికల్ బాండింగ్, కోఆర్డినేషన్ కాంపౌండ్స్; ఫిజికల్ కెమిస్ట్రీలో ఆటమిక్ స్ట్రక్చర్, మోల్ కాన్సెప్ట్, ఈక్విలిబ్రియమ్, సొల్యూషన్స్ వంటి చాప్టర్లపై ఎక్కువ దృష్టి సారించాలి. రియాక్షన్స్ అలాగే ముఖ్యమైన ఫార్ములాలకు సంబంధించి విడిగా నోట్స్ రాసుకోవాలి.
- ఇంటర్ పరీక్షలు పూర్తయ్యాక, గడచిన అయిదేళ్ళ వెయిటేజ్ ఆధారంగా ఏ చాప్టర్లు, టాపిక్స్ ముఖ్యమో గుర్తించాలి. వాటిని ఎక్కువ ప్రాక్టీస్ చేయాలి.
- ఇంటర్ పరీక్షల తరవాత సాధ్యమైనన్ని మాక్ టెస్ట్‌లకు హాజరుకావాలి. ప్రత్యేకించి ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో ఉన్న ప్రాక్టీస్ పేపర్స్‌ను అటెంప్ట్ చేయాలి. గెస్ వర్క్‌ని అస్సలు చేయవద్దు. మాక్ టెస్టులు ఒకదాని తరవాత మరొకటి రాసేటప్పుడు మిస్టేక్స్‌ను తగ్గించుకుంటూ వెళితే మంచిది. తప్పులకు సంబంధించి ఎక్కడ లోపం జరిగిందో తెలుసుకుని సవరించుకోవాలి. వాటిని ప్రాథమిక స్థాయి నుంచి మరొకసారి నేర్చుకుంటే ఆ పొరపాట్లు మళ్ళీ చోటుచేసుకోవని గుర్తించాలి. అలా పద్ధతిగా ప్రాక్టీస్ చేస్తే విజయం నల్లేరుపై బండి నడక అవుతుందనటంలో అతిశయోక్తి ఎంత మాత్రం లేదు.



డాక్టర్ పవన్ కుమార్ కాసు
ఎక్సలెన్సియా, హైదరాబాద్

జాబ్ కార్నర్

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా

సాయ్ 48 పర్ఫార్మెన్ అనలిస్ట్ పోస్టులకు కూడా దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: ఆంత్రోపోమెట్రీ-01, బయోమెకానిక్స్-01, న్యూట్రిషన్-04, ఫిజియోథెరపీ-24, సైకాలజీ-04, ఫిజియాలజీ-04, స్ట్రెంథ్ అండ్ కండిషనింగ్-10

అర్హత: సంబంధిత టాపిక్‌లో బ్యాచిలర్, మాస్టర్స్ డిగ్రీకి తోడు ఒక ఏడాది అనుభవం

ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్

దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 9

వెబ్‌సైట్: www.sportsauthorityofindia.nic.in.

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్

న్యూఢిల్లీలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టీపీసీ)లో 515 ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

విభాగాలు: ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమంటేషన్, కంప్యూటర్ సైన్స్/ఐటీ

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగంలో బీఈ/ బీటెక్/ బీఎస్సీ(ఇంజనీరింగ్) ఉత్తీర్ణత

ఎంపిక: గేట్ - 2025 స్కోర్ ద్వారా

దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 25

వెబ్‌సైట్: www.careers.ntpc.co.in

బ్యాంక్ ఆఫ్ బరోడా

బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన ఎంఎస్ఎంఈ బ్యాంకింగ్ విభాగంలో ఒప్పంద ప్రాతిపదికన, రెగ్యులర్ అధికారి పోస్టులు 419 ఉన్నాయి.

పోస్టులు: ఒప్పంద ప్రాతిపదికన - అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ - రిలేషన్ షిప్ 14, డెప్యూటీ మేనేజర్ రిలేషన్‌షిప్ 62, అసిస్టెంట్ మేనేజర్ 177 మొత్తం 253
రెగ్యులర్ - సీనియర్ మేనేజర్ రిలేషన్‌షిప్ 113, సీనియర్ మేనేజర్ క్రెడిట్ అనాలిస్ట్ 19, మేనేజర్ క్రెడిట్ అనాలిస్ట్ 34 మొత్తం 166

అర్హత: పోస్టును బట్టి సీఏ/ సీఎఫ్ఏ/ సీఎంఏ/ డిగ్రీ/ ఎంబీఏ/ మార్కెటింగ్ లేదా ఫైనాన్స్‌లో పీజీడీబీఎంకు తోడు రెండు నుంచి అయిదేళ్ళ అనుభవం ఉండాలి.

ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్, సైకోమెట్రిక్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 26

వెబ్‌సైట్: www.bankofbaroda. bank.in/Career.html

అప్రెంటిస్‌షిప్

పంజాబ్ నేషనల్ బ్యాంక్

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో 5138 గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ఖాళీలు ఉన్నాయి. తెలంగాణలో 69, ఏపీలో 56 కూడా ఇందులోనే కలిసి ఉన్నాయి.

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక: ఆన్‌లైన్ రాత పరీక్ష, లోకల్ లాంగ్వేజ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా.

దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 24

వెబ్‌సైట్: www.pnb.bank.in/



ఇండియన్ నేవీ

ఇండియన్ నేవీ షార్ట్ సర్వీస్ కమిషన్‌కు నోటిఫికేషన్ విడుదల చేసింది. వచ్చే ఏడాది జనవరిలో ఎజిమెలా(కేరళ)లో ఈ కోర్సు ప్రారంభం కానుంది. అవివాహితులైన స్త్రీ, పురుషుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం 260 ఖాళీలు ఉన్నాయి.

పోస్టుల వివరాలు: ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్(జీఎస్(ఎక్స్)/ హైడ్రో కేడర్) 76, పైలట్ 25, నేవల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్(అబ్జర్వర్) 20, ఎయిర్ కంట్రోలర్ 18, లాజిస్టిక్స్ 10, ఎడ్యుకేషన్ 15, ఇంజనీరింగ్(జనరల్ సర్వీస్) 42, సబ్‌మెరైన్ టెక్ ఇంజనీరింగ్ 8, ఎలక్ట్రికల్ బ్రాంచ్ జనరల్ సర్వీస్(జీఎస్) 38, సబ్‌మెరైన్ టెక్ ఎలక్ట్రికల్ 8.

అర్హత: బీఎస్సీ/బీకామ్, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎమ్మెస్సీ, సంబంధిత డిసిప్లిన్‌లో పీజీ డిప్లొమా ఉత్తీర్ణులు అర్హులు

ఎంపిక: డిగ్రీలో సాధించిన మార్కులు, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, డాక్యుమెంట్స్ పరిశీలన, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా

దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 24

వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in

ఎయిర్‌ఫోర్స్

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా అగ్నివీర్ వాయు నాన్ కంబాటెంట్ నియామకానికి నోటిఫికేషన్ విడుదలైంది. దేశవ్యాప్తంగా ఉన్న వాయుసేన కేంద్రాలో హాస్పిటాలిటీ, హౌస్‌కీపింగ్ విభాగాల్లో ఈ ఖాళీలు ఉన్నాయి.

అర్హత: టెన్త్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణతకు తోడు ఎత్తు కనీసం 152 సెం.మీ ఉండాలి. అవివాహిత పురుషులు మాత్రమే అర్హులు.

ఎంపిక: దరఖాస్తుల పరిశీలన, రాతపరీక్ష, శారీరక సామర్థ్య అలాగే మెడికల్ టెస్ట్‌ల ఆధారంగా

దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తును నింపి, దానికి సంబంధిత ధ్రువ పత్రాలను కూడా జత చేసి, ఆసక్తిని బట్టి దేశంలోని ఏదైనా వాయుసేన కేంద్రానికి పంపుకోవాలి.

దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 23

వెబ్‌సైట్: https://agnipathvayu.cdac.in

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

మురిపించే ముద్దు



రవితేజ కథానాయకుడిగా శివ నిర్వాణ తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఇరుముడి'. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. మహా శివరాత్రి సందర్భంగా ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న ప్రియా భవానీ శంకర్ 'కావేరి' లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. తాజాగా విడుదలైన పోస్టర్‌లో రవితేజ మాస్‌లుక్‌లో ప్రియా బుగ్గపై ప్రేమగా ముద్దుపెడుతున్న దృశ్యం ఆకట్టుకుంటోంది. 'ఈ సినిమాలో యాక్షన్‌తో పాటు సెంటిమెంట్ అంశాలు ప్రధాన బలం. రవితేజ గత చిత్రాలకు భిన్నంగా ఇందులో ఒక ఎమోషనల్ షేడ్ ఉన్న పాత్రలో మెప్పించబోతున్నారు. బేబీ నక్షత్ర రవితేజ కుమార్తెగా కీలకపాత్ర పోషిస్తోంది' అని మేకర్స్ తెలిపారు.

సోలో ట్రిప్.. ప్రకృతితో మమేకం!



'**నా**కు ట్రావెలింగ్ అంటే చాలా ఇష్టం. టైమ్ ఎప్పుడు దొరికితే అప్పుడు ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో కలసి విహారయాత్ర వెళ్తుంటాను. వేరే ఊరికి వెళ్లి అక్కడి కల్చర్‌కు తగ్గట్లుగా బతకడం అనే కాన్సెప్ట్ నచ్చి 'సోలో ట్రిప్'కు ఒప్పుకొన్నా. మేం దీనికోసం గోవా వెళ్లాం. అక్కడే అందరినీ ఇంటర్వ్యూ చేశాం. ఎంతో ఎంజాయ్ చేస్తూ వర్క్ చేశాం. ఫస్ట్ సీజన్‌లో ఆరు ఎపిసోడ్స్ ఉన్నాయి. అన్నీ సక్సెస్ కావాలని కోరుకుంటున్నా' అని అన్నారు హీరో శ్రీకాంత్. జగపతిబాబు, శ్రీకాంత్, అలీ వంటి ఆర్టిస్టులను ప్రకృతితో మమేకం చేస్తూ విజయ్ దాట్ల రూపొందించిన ట్రావెల్ అడ్వెంచరస్ టాక్ షో 'సోలో ట్రిప్' ఆరు ఎపిసోడ్స్‌తో సిద్ధం అయింది. దీని ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో విజయ్ దాట్ల మాట్లాడుతూ 'జగపతి బాబుకి ఇష్టమైన మారేడిమిల్లిలో మూడు రోజులు షూటింగ్ చేశాం. ఆ తర్వాత శ్రీకాంత్, అలీ, శివానీ, శివాత్మిక, ఆకాశ్ పూరి, వర్ష బొల్లమ్మతో మిగిలిన ఎపిసోడ్స్ చేశాం' అని అన్నారు.

హిమాలయాల రహస్యం

ధర్మ రక్షణే లక్ష్యం



అహ్మద్ షా అబ్దాలి భారతదేశంపై జరిపిన చారిత్రక దాడుల స్ఫూర్తితో భారతీయ ఆధ్యాత్మిక మూలాలను మేళవిస్తూ దర్శకుడు అభిషేక్ నామా తెరకెక్కిస్తున్న చిత్రం 'నాగబంధం'. మహా శివరాత్రి సందర్భంగా హీరో మహేశ్‌బాబు చేతుల మీదుగా ఆదివారం ఈ చిత్రం టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. టీజర్ ఆద్యంతం దృశ్యకావ్యంలా సాగింది. విరాట్ కర్ణను శక్తిమంతమైన యోధుడిగా పరిచయం చేస్తూ, హిమాలయాల్లో దాగి ఉన్న నాగబంధం దేవాలయం చుట్టూ అల్లుకున్న సస్పెన్స్, అద్భుతమైన వీఎఫ్ఎక్స్ పనితనం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. హిమాలయాల మంచు శిఖరాల్లో దాగి ఉన్న ఒక అంతుచిక్కని రహస్యం. కాలానికే అందని ఒక పురాతన శక్తే ఈ నాగబంధం. 'టీజర్ అద్భుతంగా ఉంది, సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని మహేశ్‌బాబు పేర్కొన్నారు. నభానటేశ్, ఐశ్వర్యమీనన్, జగపతిబాబు వంటి భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ చిత్రం వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. కిశోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి నిర్మిస్తున్నారు.

కపుల్ ఫ్రెండ్లీతో నా కల నెరవేరింది



సంతోష్ శోభన్

'**యు**వతను, కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో మా 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రం నూటికి నూరు శాతం విజయం సాధించింది. థియేటర్ల వద్ద హౌస్‌ఫుల్ బోర్డులు చూడాలనే నా కల ఈ సినిమాతో నెరవేరింది' అని సంతోష్ శోభన్ అన్నారు. ఆయన హీరోగా అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో యూవీ కాన్సెప్ట్స్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సినిమా పంపిణీదారుడు ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'ఇదే కాంబినేషన్‌లో వచ్చే ఏడాది ప్రేమికుల రోజున మరో చక్కని చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తాం' అని చెప్పారు. కేవలం టాక్‌తోనే గాకుండా, వసూళ్ల పరంగానూ 'కపుల్ ఫ్రెండ్లీ' సత్తా చాటుతోందని దర్శకుడు అన్నారు. మేము కోరుకున్న కథ, కావాలనుకున్న విజయం ఈ సినిమాతో దక్కాయి అని కథానాయిక మానస వారణాసి ఆనందం వ్యక్తం చేశారు.

వైవిధ్యంగా 'అలా జరిగిన కథ'



విజయ్, శీతల్ భట్ ప్రధాన పాత్రధారులుగా ప్రభు సూర్య తెరకెక్కిస్తున్న చిత్రం 'అలా జరిగిన కథ'. రేణుక శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. తాజాగా విలేకరులతో ప్రభు సూర్య మాట్లాడుతూ 'అలా జరిగిన కథ'లో భాగమైన వారందరికీ మంచి పేరు తెచ్చే చిత్రమిది. వైవిధ్యంతో పాటూ వినోదం కలగలసిన ఈ సినిమా అందరినీ అలరిస్తుంది' అని అన్నారు. 'మంచి కథ, కథనంతో వస్తున్న చిత్రమిది. ప్రతీ సన్నివేశం అలరిస్తుంది' అని రేణుక శ్రీనివాస్ చెప్పారు.

చాలా సంతోషంగా ఉంది



అర్జున్ సర్జా

"**సీ**తా పయనం' చిత్రానికి ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. నా కూతురు అద్భుతంగా నటించిందని ప్రశంసిస్తున్నారు. చెడులోనూ మంచి ఉంటుందని ఇందులోని పాత్రలు తెలియజేస్తున్నాయి' అని అన్నారు హీరో అర్జున్ సర్జా. ఆయన స్వీయ నిర్మాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఇటీవలె విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో అర్జున్ మాట్లాడుతూ 'నేను గొప్ప సినిమా తీశాను అని అనడం లేదు కానీ, మేము చెప్పాలనుకున్నది ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యింది. మేం ఎంతో నిజాయితీతో తీశాం. చూడని వాళ్లు వెంటనే చూడాలి' అని కోరారు. నిరంజన్ మాట్లాడుతూ 'ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమకు చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. నిరంజన్ మాట్లాడుతూ 'అన్ని ప్రాంతాల నుంచి సినిమాకు మంచి ఓపెనింగ్స్ వస్తున్నాయి' అని చెప్పారు. సాయి మాధవ్ బుర్రా తదితరులు పాల్గొన్నారు.

వేసవి బరిలో...



ఒకప్పుడు వేసవి సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని వరుస చిత్రాలు పోటీపడేవి. తమ అభిమాన హీరోలు నటించిన సినిమాలు చూడడం కోసం సినీ ప్రియులు మండుటెండను సైతం లెక్కచేయకుండా థియేటర్ల దగ్గర క్యూ కట్టేవారు. అయితే అగ్రహీరోలు పాన్ ఇండియా సినిమాలపై దృష్టిపెట్టడం, చిన్న.. మీడియం బడ్జెట్ చిత్రాలు విడుదలైనా అవి అంతగా అలరించకపోవడం.. ఇతర కారణాల వల్ల ఈ మధ్య వేసవి చిత్రాల హడావుడి తగ్గింది. కానీ ఈసారి వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రేక్షకులను అలరించడానికి వరుస చిత్రాలు సిద్ధమవుతున్నాయి.

మార్చి 6న లావణ్య త్రిపాఠి నటించిన 'సతీ లీలావతి' విడుదల కానుంది. శివాజీ, లయ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన 'సాంప్రదాయని సుప్పిని సుద్దపూసని' మార్చి 6న ప్రేక్షకులను పలకరించనుంది. 'కోర్టు' జంట హర్ష్ రోషన్, శ్రీదేవీ మరోసారి మార్చి 13న 'బ్యాండ్ మేళం'తో అలరించనున్నారు. 'కేజీఎఫ్' సిరీస్‌తో ఒక్కసారిగా స్టార్‌డమ్ అందుకున్న యశ్ నటించిన చిత్రం 'టాక్సిక్'. గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ చిత్రం మార్చి 19న ఉగాది సందర్భంగా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. అలాగే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బాలీవుడ్ చిత్రం 'ధురంధర్' సీక్వెల్‌గా తెరకెక్కింది 'ధురంధర్ -2'. మార్చి 19న తెలుగులోనూ భారీ స్థాయిలో విడుదల కానుంది. పవన్ కల్యాణ్ తన అభిమానులను 'ఉస్తాద్ భగత్‌సింగ్'తో అలరిండానికి సిద్ధమయ్యారు. హరీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఇప్పటికే చిత్రీకరణను పూర్తిచేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం మార్చి 26న విడుదలవుతోంది. రాశీ ఖన్నా, శ్రీలీల కథానాయికలు.

ఏప్రిల్‌లో వరుస చిత్రాలు

'నారీ నారీ నడుమ మురారీ'తో హిట్ అందుకున్న శర్వానంద్ బైక్ రేసర్‌గా ప్రేక్షకులను పలకరించనున్నారు. ఏప్రిల్ 3న ఈ చిత్రం విడుదలవుతోంది. అభిలాష్ కంకర దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. విక్రమ్ సమర్పిస్తున్నారు. 'మ్యాడ్' ఫేమ్ సంగీత్ శోభన్ నటిస్తున్న 'రాకాస' కూడా ఏప్రిల్ 3న విడుదలవుతోంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌పై నిహారిక కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. 'స్వయంభు'తో ప్రేక్షకులను పలకరించున్నారు నిఖిల్ సిద్ధార్థ. ఏప్రిల్ 10న విడుదలవుతోన్న ఈ పీరియాడిక్ యాక్షన్ చిత్రానికి భరత్‌కృష్ణమాచారి దర్శకుడు. భువన్, శ్రీకర్ నిర్మించారు. వైవిధ్యమైన చిత్రాలతో గుర్తింపు పొందిన అడివి శేష్ 'డెకాయిట్'గా అలరించడానికి సిద్ధమయ్యారు. ఏప్రిల్ 10న చిత్రాన్ని విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. దర్శకుడు సుకుమార్, మైత్రీ మూవీమేకర్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 30న విడుదలవుతోంది. ఇదే వేసవిలో వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ తెరకెక్కిస్తున్న 'ఆదర్శ కుటుంబం', అడివి శేష్ నటిస్తున్న 'గూఢచారి 2', అఖిల్ 'లెనిన్', సాయి దుర్గాతేజ్ 'సంబరాల యేటి గట్టు', వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు', రవిబాబు 'రేజర్', విరాట్ కర్ణ 'నాగబంధం' చిత్రాలు విడుదల కావాల్సి ఉంది. అయితే వాటి విడుదల తేదీలపై త్వరలోనే స్పష్టత రానుంది.

పరమేశ్వరుడికి రాశీ ఖన్నా స్వర నీరాజనం



తెలుగు, తమిళం, హిందీ చిత్రాల్లో తన అందం, అభినయంతో విశేష ఆదరణ పొందిన రాశీ ఖన్నా.. ఇప్పుడు ఆధ్యాత్మిక ప్రపంచంలోకి అడుగుపెట్టారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆమె 'శివ కైలాషోం కే వాసీ' అంటూ ఓ ప్రత్యేక గీతాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో ఆలపించి పరమేశ్వరుడికి తన వంతు స్వర నీరాజనం అర్పించారు. ఈ గీతానికి సంబంధించిన వీడియోను ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. 'ఈ పవిత్రమైన రోజున అచంచలమైన విశ్వాసం, శరణాగతి, కృతజ్ఞతా భావంతో నేను ఆలపించిన 'శివ కైలాషోం కే వాసీ' గీతాన్ని ఆ మహాదేవుడికి నా ప్రార్థనగా సమర్పిస్తున్నాను' అని ఆమె పేర్కొన్నారు. రాశీ గాత్ర మాధుర్యం అభిమానులను, ప్రేక్షకులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది.



ఆకట్టుకుంటున్న 'చాటు..చాటు..'

పవన్ కల్యాణ్ బత్తుల హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'పురుష'. వీరు వులవల దర్శకత్వం వహిస్తున్నారు. బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై బత్తుల కోటేశ్వర రావు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'చాటు చాటు..' అంటూ సాగే గీతాన్ని మేకర్స్ రిలీజ్ చేశారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను చిన్మయి శ్రీపాద ఆలపించారు. శ్రవణ్ భరద్వాజ్ స్వరాలు సమకూర్చారు. మెలోడీ ట్యూన్‌తో సాగిపోతున్న ఈ పాట ఆద్యంతం ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించిన నిర్మాణాంతర పనులు శరవేగంగా సాగుతున్నాయి. త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

వేసవిలో ఇంటిని కూల్‌గా మార్చే చిట్కాలు



బయట ఎండలు మండిపోతున్నప్పుడు ఇంటి లోపలికి రాగానే కళ్లకు, మనసుకు చల్లగా అనిపించేలా అలంకరణలో కొన్ని మార్పులు చేయాలి. దీనివల్ల ఏసీలు, కూలర్ల వాడకం తగ్గడమే కాకుండా ఇంటికి కొత్త లుక్ వస్తుంది.

లేత రంగుల మ్యాజిక్: కిటికీలకు ఉన్న ముదురు రంగు కర్టెన్లు తీసేసి, తెలుపు, ఆఫ్‌వైట్ లేదా స్కైబ్లూ వంటి లేత రంగుల కాటన్ లేదా లెనిన్ కర్టెన్లు వాడండి. ఇవి సూర్యరశ్మిని ప్రతిబింబించి గదిని చల్లగా ఉంచుతాయి.

ఇండోర్ వాటర్ ఫౌంటెన్: హాల్‌లో ఒక చిన్న టేబుల్‌టాప్ వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేసుకోండి. నీటి గలగల శబ్దం మానసిక ప్రశాంతతను ఇవ్వడమే కాకుండా, గాలిలోని వేడిని కొంత వరకు తగ్గిస్తుంది.

మట్టివస్తువులు: ప్లాస్టిక్ లేదా మెటల్ అలంకరణ వస్తువుల కంటే మట్టితో చేసిన బొమ్మలు, పూల కుండీలు వేసవిలో చూడటానికి చల్లగా ఉంటాయి. సెంటర్ టేబుల్‌పై ఒక వెడల్పాటి మట్టి పాత్రలో నీళ్లు పోసి, అందులో కొన్ని తాజా పూలు వేస్తే ఆ రూపు మారిపోతుంది.

ప్రకాశవంతమైన వెలుతురు వద్దు: వేడి పుట్టించే పాతకాలపు బల్బులను మార్చి ఎల్ఈడీ బల్బులు వాడండి. సాయంత్రం వేళల్లో తక్కువ వెలుతురు ఉండేలా చూసుకుంటే గది ఉష్ణోగ్రత తగ్గుతుంది.

వార్డ్‌రోబ్ రీఆర్గనైజేషన్



శీతాకాలపు భారీ దుస్తులు, గొడుగులు, స్వెటర్లను పక్కనపెట్టి, వేసవికి తగినట్టుగా వార్డ్‌రోబ్‌ను సిద్ధం చేసుకోవడం ఒక పెద్ద పని. దీనిని పద్ధతిగా చేస్తే బట్టలు పాడవకుండా ఉంటాయి. రోజువారీగా రెడీ అవడం సులభమవుతుంది.

వింటర్‌వేర్ స్టోరేజ్: స్వెటర్లు, జెర్కిన్లు, భారీ రగ్గులను బాగా ఉతికి, ఆరబెట్టిన తర్వాతే లోపల పెట్టాలి. లేకపోతే చెమట వాసనవల్ల అవి పాడవుతాయి. వాటిని వాక్యూమ్ బ్యాగుల్లో ఉంచితే బీరువాలో స్థలం ఆదా అవుతుంది.

ఫ్యాబ్రిక్ ఎంపిక: సింథటిక్, పాలిస్టర్ బట్టలను లోపలి వైపునకు జరిపి.. ప్యూర్ కాటన్, లెనిన్ తదితర దుస్తులను అందుబాటులో ఉండేలా ముందువైపు సర్దుకోవాలి. ఇవి గాలిని ప్రసరింపజేసి చెమటను పీల్చుకుంటాయి.

పాదరక్షలు: వేసవిలో కాళ్లకు చెమటపట్టడం వల్ల షూస్ వాసన వచ్చే అవకాశం ఉంది. వాటిని ఎండలో కాసేపు ఉంచి లోపల బేకింగ్ సోడా చల్లితే వాసన పోతుంది. సాక్సులను రోజూ మార్చడం మర్చిపోవద్దు.

సన్‌గ్లాసెస్, క్యాప్స్: బయటకు వెళ్లేటప్పుడు అవసరమయ్యే సన్‌గ్లాసెస్, గొడుగులు, స్కార్ఫ్‌లు, సన్‌స్క్రీన్ లోషన్ల కోసం వార్డ్‌రోబ్‌లో ఒక చిన్న బాస్కెట్ కేటాయించండి. దీనివల్ల చివరి నిమిషంలో వెతుక్కోవాల్సిన అవసరం ఉండదు.



పదమూడేళ్లకే జాతీయ చాంపియన్. పదిహేడేళ్లకు ప్రపంచ జూనియర్ చాంపియన్. పద్దెనిమిదేళ్లకు ఒలింపిక్స్ బరి. పోటీ ఏదైనా ఆమె బరిలోకి దిగితే ప్రత్యర్థులు పతకంపై ఆశలు వదులుకోవాల్సిందే. ఇటీవల జరిగిన ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో మూడు స్వర్ణాలు, ఒక కాంస్యంతో మెరిసిన 21 ఏళ్ల 'యంగ్ గన్'... అర్జున పురస్కార గ్రహీత... ఇషా సింగ్ జర్నీ 'నవ్య'కు ప్రత్యేకం.

నాకు నేనే పోటీ

"పదేళ్ల కెరీర్‌లో వెనక్కి తిరిగి చూసుకొంటే ఎంతో గర్వంగా, అంతకుమించి ఆత్మసంతృప్తిగా ఉంది. అందరూ '21 ఏళ్లకే చాలా సాధించావు. ఆహా.. ఓహో' అని పొగుడుతుంటే మనసులో నవ్వుకుంటా. నేనేమీ వండర్ కిడ్, అసాధారణమైన శక్తులు కలిగిన అమ్మాయిని కాను. సాధారణ మహిళనే. పట్టుదల, క్రమశిక్షణ, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉంటే అనుకున్నది సాధించవచ్చు. సరదాగా ప్రారంభించిన షూటింగ్‌ను తొలి పసిడి పతకం సాధించాక కెరీర్‌గా ఎంచుకోవాలని నిశ్చయించుకున్నా. అంతకుముందు వరకు సన్‌గ్లాసెస్ మొదలు రకరకాల బహుమతులిచ్చి మా నాన్న నన్ను షూటింగ్ ప్రాక్టీస్‌కు తీసుకెళ్లేవారు. ఎప్పుడైతే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం దక్కించుకున్నానో... అప్పటి నుంచి నాకు షూటింగ్‌పై మక్కువ కలిగింది. దీన్నే కెరీర్‌గా మలుచుకొంటానని చెప్పినప్పటి నుంచీ నా ప్రతి అడుగులో అమ్మ శ్రీలత, నాన్న సచిన్ తోడుగా ఉన్నారు. ఇంటి దగ్గరలో సరైన షూటింగ్ రేంజ్ లేకపోవడంతో ఇంట్లోనే ప్రాక్టీసు చేసుకొనేలా ఏర్పాటు చేయించారు. ఇంట్లోనే ఉందని అదేపనిగా సాధన చేయలేదు. నాకు ఎప్పుడు కుదిరితే అప్పుడు షూటింగ్ రేంజ్‌లోకి వెళ్లేదాన్ని. ఆసక్తి లేనప్పుడు వేరే పనులు చూసుకొనేదాన్ని.

మానసికంగా బలంగా ఉండాలి...

షూటింగ్ చాలా సాధారణ క్రీడ. అయితే శారీరకంగా కంటే మానసికంగా బలంగా ఉండాలి. ఇందులో కండ బలం కంటే గురి తప్పని ఏకాగ్రత, మానసిక దృఢత్వం ముఖ్యం. నేరుగా ప్రత్యర్థులతో తలపడేది ఉండదు కాబట్టి ఎవరితోనూ ప్రత్యక్షంగా పోటీ ఉండదు. ప్రత్యర్థులు ఉండరు. నా పిస్టల్‌కు ఎదురుగా ఉండే టార్గెట్‌తోనే నాకు పోటీ. నాతో నేనే యుద్ధం చేస్తా. నాకు నేనే పోటీ. అంతేకానీ మనకంటే పెద్ద ప్లేయర్, సీనియర్ బరిలో ఉన్నారనే భావనతో పోటీ పడితే అనవసరమైన ఒత్తిడికి లోనై, చిత్తవుతాం. ఎలాంటి పోటీలోనైనా విజయం కోసం వంద శాతం ప్రయత్నిస్తా. ఒక్కోసారి ఫలితాలు నాకు అనుకూలంగా రాకపోయినా నిరాశపడను. ఏ తప్పిదంవల్ల విజయానికి దూరమయ్యానో వాటిని సరిదిద్దుకొని నూతనోత్తేజంతో బరిలోకి దిగుతా. ఒక్కోసారి ప్రతికూల పరిస్థితులు ఎదురవుతాయి. కొన్ని షూటింగ్ రేంజ్‌ల్లోని వెలుతురు నా కంటికి సరిపడినట్టు ఉండదు. ఆ ప్రతికూల అంశాన్ని త్వరగా ఆకళింపు చేసుకొని, దానికి తగ్గట్టు నా షూటింగ్ శైలిని మార్చుకుంటా. తాజాగా ఢిల్లీలో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్ సందర్భంగా ఇలాంటి సమస్యే ఎదుర్కొన్నా. ఆ తరుణంలో తొలి రౌండ్లలో కొంచెం వెనుకపడ్డా... వెంటనే పుంజుకొని స్వర్ణ పతకాలు సాధించాను.

వైఫల్యాలను చూసి జంకొద్దు...

నేను షూటింగ్ నేర్చుకునేటప్పుడు అభిమానించే క్రీడాకారుడు ఎవరూ లేరు. ఎప్పుడైతే కెరీర్‌గా షూటింగ్‌ను ఎంచుకున్నానో ఆ తర్వాత అందులో గొప్పవారి గురించి తెలుసుకున్నా. దిగ్గజ షూటర్లు గగన్ నారంగ్, అభినవ్ బింద్రా తమ అనుభవాలను, జ్ఞానాన్ని నాతో పంచుకున్న వైనం చూసి వారిని ఆరాధించడం ప్రారంభించా. 'వైఫల్యాలను చూసి భయపడవద్దు. వాటిని అధిగమించేందుకు కష్టపడాల'ని వారు చెప్పినప్పుడు అర్థంకాలేదు. నా పరాజయాల నుంచి గుణపాఠాలు నేర్చుకొని, విజయవంతమైనప్పుడు వారి మాటల్లోని సారం తెలుసుకున్నా. 2022 హాంగ్జౌ ఆసియా క్రీడల్లో నాలుగు పతకాలు గెలిచినప్పుడు... అంతకముందు కంటే తీవ్ర సాధన ఏమీ చేయలేదు. అలాగే ఆ తర్వాత జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో సరైన సాధన లేక పతకాలు కోల్పోలేదు. తాజాగా ఆసియా చాంపియన్‌షిప్‌లోనూ అంతే. ఎప్పుడైనా నా సాధన చేసే విధానం ఒక్కటే. దిగ్గజ షూటరైనా, సీనియరైనా, జూనియరైనా ఆ రోజు మెరుగైన ప్రదర్శన చేసినవారే విజేతలుగా నిలుస్తారు. షూటింగ్ గణిత శాస్త్రం లాంటిది. లెక్కల్లో ఏ చిన్న తప్పు చేసినా ఫలితం ఎలా రాదో... షూటింగ్‌లో కూడా అంతే. లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నందున ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా సిద్ధమవుతున్నా.

కష్టానికి తగిన ప్రతిఫలం...

కష్టానికి తగిన ప్రతిఫలం దక్కినప్పుడే అసలైన గుర్తింపు లభించినట్టు. దేశంలో నాతో పాటు ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన వారందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు దక్కాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా పలువురు క్రీడాకారులకు వారి ప్రతిభ ఆధారంగా గత ప్రభుత్వాలు మంచి ఉద్యోగాలిచ్చి ప్రోత్సహించాయి. కానీ నా విషయంలో ఎందుకు జాప్యం జరుగుతుందో తెలియడంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం నా కష్టాన్ని గుర్తించి, ఉద్యోగం ఇస్తే నాకు మరింత ప్రోత్సాహకరంగా ఉంటుంది."

• ఎస్.ఎస్.బి.సంజయ్

ఆత్మసంతృప్తి...

మనం చేసే పనిలో ఆత్మసంతృప్తి ఉండాలి. షూటింగ్‌లో నాకు కావాల్సిన ఆనందం లభిస్తోంది. అందుకే నేను నిలకడగా విజయాలు సాధించగలుగుతున్నా. నా ఆనందం కోసం నేను ఇష్టపడి ఆడుతున్నా కాబట్టే పదేళ్లగా రాణించగలుగుతున్నా. ఇందుకు క్రమశిక్షణ చాలా ముఖ్యం. సమయానికి తినడం, పడుకోవడం, ఏ సమయంలో ఏ పని చేయాలనేది చిన్నప్పుడే మా అమ్మ నాకు నేర్పింది. ఆ క్రమశిక్షణను ఇప్పటికీ కొనసాగిస్తున్నా. రెండు వారాలకు ఒకసారి బ్యాగ్ సర్దుకొని ఏదో ఒక పోటీలకు వెళ్తానే ఉంటా. అందుకే కొంచెం సమయం దొరికినా కుటుంబ సభ్యులతో గడపడానికి ఇష్టపడతా. నాకు మా అమ్మ చేతి వంట చాలా ఇష్టం. తను చేసే పచ్చళ్లు ఎంతో రుచిగా ఉంటాయి.



షూటర్‌ని కాకపోతే..!

నాన్న ర్యాలీ డ్రైవర్ కావడంతో చిన్నప్పటి నుంచి కార్లు, రేసింగ్‌పై మక్కువ ఎక్కువ. అందుకే ఎక్కువగా ఫార్ములా-1 రేస్‌లు చూస్తుంటా. ఒకవేళ షూటర్‌ని కాకపోయుంటే రేసర్‌ని అయ్యేదానినేమో. ప్రస్తుత ఎఫ్-1 డ్రైవర్లలో మ్యాక్స్ వెర్‌స్టాపెన్ ఇష్టం. షూటింగ్ బోరు కొడితే గో-కార్టింగ్‌కి వెళ్తా. షూటింగ్‌కి వీడ్కోలు పలికిన తర్వాత అప్పటికీ ఆసక్తి ఉంటే రేసింగ్‌లోకి అడుగు పెడతా.

ఫైటర్‌ని...

పోటీల ప్రారంభ రౌండ్ నుంచి ఆఖరి రౌండ్ వరకు విజయం కోసం ఫైటర్‌లా పోరాడతా. అదే నా బలం. ఒక్కోసారి మంచి ఆరంభం లభించదు. అలాంటి సందర్భాల్లో తొలి రెండు రౌండ్లలో సరైన స్కోర్లు సాధించలేకపోయినా డీలా పడను. చివరిదాకా పోరాడతా. మరింత మెరుగైన ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తా.

పిల్లల కోసం స్క్రీన్‌ఫ్రీ యాక్టివిటీస్

స్కూల్‌కు సెలవులు రాగానే పిల్లలు టీవీలు, ఫోన్లకు అతుక్కుపోవడం సహజం. అలా కాకుండా వారి సృజనాత్మకతను పెంచేలా వేసవిని ఎలా ప్లాన్ చేయవచ్చో చూద్దాం.

కిచెన్ గార్డెనింగ్: పిల్లలకు మట్టితో ఆడుకోవడం అంటే ఇష్టం. చిన్నచిన్న కుండీల్లో టమాటా, పచ్చిమిర్చి వంటి మొక్కలు నాటించి వాటికి రోజూ నీళ్లు పోసే బాధ్యత వారికి అప్పగించండి. మొక్క పెరగడాన్ని వారు రోజూ గమనిస్తూ ఎంతో నేర్చుకుంటారు.

వంటలో సాయం: వేడి లేని వంటలు.. అంటే ఫ్రూట్ సలాడ్ చేయడం, నిమ్మరసం కలపడం, శాండ్‌విచ్‌లు సిద్ధం చేయడం వంటివి పిల్లలకు నేర్పండి. ఇది వారికి స్వయం సమృద్ధిని నేర్పుతుంది.

బోర్డ్ గేమ్స్, పజిల్స్: పాతకాలపు ఆటలైన అష్టాచెమ్మా, వామనగుంటలు, లేదంటే చెస్, మోనోపోలీ వంటి ఆటలు ఆడించడం వల్ల వారి ఆలోచనా శక్తి పెరుగుతుంది. వారితో కలిసి మీరు కూడా ఆడితే ఆ బంధం మరింత బలపడుతుంది.

రీడింగ్ చాలెంజ్: ఈ వేసవిలో కనీసం 5-10 పుస్తకాలు చదవాలనే లక్ష్యాన్ని వారికి ఇవ్వండి. చదివిన తర్వాత ఆ కథలోని సారాన్ని అందరికీ చెప్పమని ప్రోత్సహించండి. ఇది వారి భాషా నైపుణ్యాలను మెరుగుపరుస్తుంది.



పొలం గట్టుపై సిక్సర్!

చేతిలో బ్యాట్.. గుండెలో ఆత్మవిశ్వాసం.. కళ్లలో గెలుపు పిలుపు! వంటింటి గడప దాటడమే సాహసమనుకున్న చోట ఒక గ్రామీణ మహిళా రైతు తన జట్టును చాంపియన్‌గా నిలబెట్టింది. మహారాష్ట్రలో సామాజిక విప్లవానికి నాంది పలికిన 'ప్యాడీ కప్' విజేత స్వాతి జెండే స్ఫూర్తిదాయక కథ ఇది.





ఆమె చేతులు బురద పొలంలో నాట్లు వేస్తాయి. అవే చేతులు పిచ్‌పై బ్యాట్ పట్టి బంతిని బౌండరీల ఆవలకు పంపుతాయి. వంటింటి పొగకు, పొలం పనుల ఒత్తిడి మధ్య నలిగిపోయే సగటు గ్రామీణ మహిళ.. తన క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా ఎదిగారు. మహారాష్ట్రలో వినూత్నంగా నిర్వహించిన 'ప్యాడీ కప్'లో తన జట్టును విజేతగా నిలిపిన స్వాతి జెండే ప్రస్థానం ఒక సామాజిక విప్లవం.

వరి కోతలే కాదు.. వికెట్లు కూడా

పూణె జిల్లాలోని భోర్, వెల్హే (రాజ్‌గఢ్) తాలూకాలు వరిసాగుకు ప్రసిద్ధి. అయితే ఈ ప్రాంతంలో ఫిబ్రవరి వచ్చిందంటే చాలు వాతావరణం మారిపోతుంది. దశాబ్ద కాలంగా 'సైబేజ్ ఆశా' సంస్థ నిర్వహిస్తున్న 'ప్యాడీ కప్' ఇప్పుడు పరాకాష్టకు చేరుకుంది. 2025-26 సీజన్‌లో సుమారు 4,500 మంది రైతులు, 40కిపైగా మహిళా జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో స్వాతి జెండే ఒక శక్తిగా ఆవిర్భవించారు తెల్లవారుజామునే లేచి పశువుల పాకను శుభ్రం చేసి, కుటుంబానికి వండిన తర్వాత చీరకట్టుపైనే క్రికెట్ కిట్ తగిలించుకుని మైదానంలోకి దిగడం ఆమెకు అలవాటు.

వ్యవసాయ పిచ్‌పై క్రికెట్ కోత

ఈ టోర్నమెంట్ వెనుక ఉన్న అసలు రహస్యం దాని నిర్వహణ పద్ధతి. రైతులు కేవలం మైదానంలో ఆడితే సరిపోదు. ఏడాది పొడవునా పదిమంది రైతులు ఒక బృందంగా ఏర్పడి 'శాస్త్రీయ పద్ధతిలో వరిసాగు చేయాలి. స్వాతి జెండే తన బృందాన్ని కేవలం గ్రౌండ్‌లోనే కాదు, బురద పొలాల్లోనూ అద్భుతంగా నడిపించారు. వారు పాటించిన 'సిస్టమ్ ఆఫ్ రైస్ ఇంటెన్సిఫికేషన్ (ఎస్ఆర్ఐ) పద్ధతి వల్ల తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించారు.

విజేతను నిర్ణయిస్తారిలా..

విజేతలను నిర్ణయించడానికి నిర్వహించే 500 మార్కుల స్కోరింగ్ విధానం చాలా కఠినంగా ఉంటుంది. ఇందులో క్రికెట్ గెలుపునకు మాత్రమే మార్కులుండవు. వారు పొలంలో వాడిన సేంద్రియ ఎరువులు, పంట నాణ్యత, గ్రూపు సభ్యుల మధ్య ఉన్న సయోధ్య వంటి అంశాలకు 80 శాతం మార్కులు ఉంటాయి. అంటే, స్వాతి జట్టు ఇటు సాగులోను, అటు ఆటలోనూ నూటికి నూరుశాతం ప్రతిభ కనబర్చడంతోనే చాంపియన్ ట్రోఫీ ఆమె సొంతమైంది.

పిచ్ నుంచి పంచాయతీ వరకు

"మొదట్లో క్రికెట్ బ్యాట్ పట్టుకోవడానికి చేతులు వణికేవి. గ్రామస్థులు చూసి నవ్వుతారేమో అని భయం వేసేది. కానీ ఈ రోజు నేను మా జట్టును నడిపిస్తున్న తీరు చూసి మా ఊరి మగవాళ్లే ఆశ్చర్యపోతున్నారు" అని స్వాతి చిరునవ్వుతో చెబుతారు. జట్టుకు కెప్టెన్‌గా ఉండటం ఆమెకు కొత్త గుర్తింపును ఇచ్చింది. గతంలో గ్రామంలో ఏవైనా సమస్యలు వచ్చినా, గ్రామ సభలు జరిగినా మహిళలు ఒక మూలన కూర్చుని వినేవారు తప్ప మాట్లాడే ధైర్యం చేసేవారు కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. స్వాతి ఇప్పుడు గ్రామ సభల్లో నిలబడి సమస్యలను ప్రశ్నిస్తున్నారు. "నేను పదిమంది సభ్యుల క్రికెట్ టీంను వ్యూహాలతో నడిపిస్తున్నప్పుడు, నా ఊరి సమస్యలపై ఎందుకు మాట్లాడలేను?" అన్న ఆమె ప్రశ్నలో ఆత్మవిశ్వాసం కనిపిస్తోంది.

కుటుంబ మద్దతు

స్వాతి ప్రయాణంలో మరో ఆసక్తికరమైన అంశం కుటుంబాల నుంచి వచ్చిన మద్దతు. ఈ టోర్నీ ఫైనల్ జరుగుతున్నప్పుడు మైదానంలో గ్యాలరీ అంతా మహిళల భర్తలు, పిల్లలతో నిండిపోయింది. తమ భార్యలు బౌండరీలు బాదుతుంటే వారు ఈలలు వేస్తూ ప్రోత్సహించడం గ్రామీణ ప్రాంతాల్లో అరుదైన దృశ్యం. "మా అమ్మ గ్రౌండ్‌లో ఆడుతుంటే గర్వంగా అనిపిస్తుంది" అని స్వాతి కుమారుడు అంటుంటే, అది ఒక తరాన్నే మార్చేస్తున్న విప్లవంలా అనిపిస్తుంది.

అంతులేని ఆశయాల ప్రయాణం

స్వాతి జెండే వంటి నాయకురాలు ఇప్పుడు పూణెకే పరిమితం కాదు. ఆమె మాటలు ఇప్పుడు ఆ చుట్టుపక్కల 40 గ్రామాల్లోని మహిళలకు వేదవాక్కులు. "మనకు కావాల్సింది కేవలం కప్పుకాదు. ఈ ఆట ద్వారా దొరికే స్వేచ్ఛ. వంటింటి చాకిరీ నుంచి కొన్ని గంటల విరామం, మమ్మల్ని మేము నిరూపించుకునే అవకాశం. అదే అసలైన విజయం" అంటారు స్వాతి. చీరకట్టుతో సిక్సర్లు కొడుతూ సామాజిక అడ్డంకులను చెరిపేస్తున్న స్వాతి జెండే ఒక 'సోషల్ కెప్టెన్'. ఆమె ప్రయాణం ఇప్పుడు లక్షల మంది మహిళల కలలకు కొత్త రెక్కలు తొడుగుతోంది.

'స్వచ్ఛ'మైన పరిష్కారం

'వ్యర్థాల సమస్యకు పునర్వినియోగమే పరిష్కారం' అని నిరూపిస్తున్నారు విక్టోరియా జోస్లిన్ డిసౌజా. వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ కోసం ఆమె ప్రారంభించిన స్వచ్ఛంద సంస్థ, స్టార్టప్ వేల మందికి ఉపాధి కూడా కల్పిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ కోసం ఇరవయ్యేళ్లుగా కృషి చేస్తున్న బెంగళూరుకు చెందిన విక్టోరియా ప్రయాణం ఇది.



"మన కళ్లముందు ఏదైనా సమస్య కనిపిస్తున్నప్పుడు... నాకెందుకులే అనుకోకుండా దాని పరిష్కారం కోసం వీలైనంత తీవ్రంగా పోరాడాలి... ఇది మా నాన్న నాకు నేర్పిన పాఠం. ఆయన స్కూల్ టీచర్. వ్యవసాయం కూడా చేసేవారు. మా గ్రామ సమస్యలు తీర్చడానికి ఆయన కృషి చేసేవారు. సమాజానికి నావంతు మేలు చేయాలనే తపన బహుశా నాన్నను చూస్తూ పెరగడం వల్లే నాలో ఏర్పడిందనుకుంటాను. మాది కర్ణాటకలోని నాగనహళ్ళి అనే చిన్న గ్రామం. నా చిన్నప్పుడు మా ఊర్లో కరెంట్ ఉండేది కాదు. పన్నెండో క్లాసు వరకూ పెట్రోమాక్స్ లైట్ దగ్గరే చదువుకున్నాను. కబిని నదీ తీరంలో ఉన్న మా ఊరు ఎంతో అందంగా ఉంటుంది. ప్రకృతి అన్నా, పర్యావరణం అన్నా నాకున్న ఇష్టానికి ఇది ప్రధాన కారణం. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో డిప్లమా చేశాక... ఉద్యోగం కోసం బెంగళూరు వెళ్ళాను. నాలుగేళ్ళపాటు వివిధ కంపెనీల్లో పని చేశాను. సొంతగా ఏదైనా చేస్తే బాగుంటుందనిపించింది. ఈవెంట్ మేనేజిమెంట్ కంపెనీ ప్రారంభించాను. మొదట్లో ఉత్సాహంగానే ఉన్నా... ఉరుకుల పరుగుల జీవితపు ఒత్తిడి వల్ల ఏదో వెలితిగా అనిపించేది. దానినుంచి ఎలా బయటపడాలో అర్థమయ్యేది కాదు.

వార్డుకో కేంద్రం

ఒక రోజు బెంగళూరు ఫ్రీడమ్ పార్కులో వాకింగ్‌కు వెళ్ళినప్పుడు... ఒక కార్యక్రమం జరుగుతోంది. దాన్ని 'ఆప్' ఆధ్వర్యంలో అవినీతి వ్యతిరేక ఉద్యమంలో భాగంగా నిర్వహిస్తున్నారు. జనం భారీ సంఖ్యలో ఉన్నప్పటికీ... నిర్వహణ సరిగ్గా లేకపోవడం గమనించాను. అయితే... వారి లక్ష్యం నాకు నచ్చింది. నిర్వాహకులను కలిసి "నేనొక ఈవెంట్ మేనేజర్‌ని. మీరు అవకాశం ఇస్తే... స్వచ్ఛందంగా పని చేస్తాను" అని చెప్పాను. కొన్నాళ్ళపాటు వారితో ప్రయాణం సాగింది. ఈ క్రమంలో పరిచయమైన డాక్టర్ మీనాక్షి భరత్ లాంటి ఉద్యమకారుల వల్ల వ్యర్థాల నిర్వహణ ఆవశ్యకత గురించి మరింత స్పష్టంగా తెలుసుకున్నాను. పర్యావరణం పరిరక్షణ, వేస్ట్ మేనేజిమెంట్ కోసం పాటుపడుతున్న ఎన్జీవోలతో కలిసి పని చెయ్యడం మొదలుపెట్టాను. 2007లో మరో ఇద్దరు మిత్రులతో కలిసి 'స్వచ్ఛ' అనే ఎన్జీవోను, దానిలో భాగంగా 'స్వచ్ఛ ప్రాజెక్ట్- బెంగళూరు'ను ప్రారంభించాను. తడి చెత్తతో ఎరువులు, కంపోస్ట్, బయోగ్యాస్ లాంటివి తయారు చేయవచ్చు. అలాగే పొడి చెత్తను కూడా పునర్వినియోగించుకోవచ్చు. కానీ సాధారణంగా మన ఇళ్ళలో తడి చెత్తను, పొడి చెత్తను కలిపి పారేస్తూ ఉంటాం. ఈ పద్ధతి మానాలని బెంగళూరు నగరంలో ఇంటింటికీ వెళ్ళి ప్రచారం చెయ్యడం ప్రారంభించాం. అయితే... మామూలు వ్యక్తులు చెబితే జనం వినరని త్వరలోనే అర్థమయింది. 'బృహత్ బెంగళూరు మహానగర పాలిక' (బిబిఎంపి) అధికారులను కలిసి మా ఉద్దేశాలను వివరించాం. దానికి సానుకూల స్పందన లభించింది. ఒక ప్రణాళిక రూపుదిద్దుకుంది. దాని ప్రకారం ప్రతి వార్డులో పొడి చెత్త సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశాం. చెత్తను సేకరించే కార్మికులకే వాటి బాధ్యతలు అప్పగించాం. అది మంచి ఫలితాలను ఇచ్చింది. సరే... మరి సేకరించిన చెత్తను ఏం చెయ్యాలి? అధికారుల సూచన మేరకు... కుటుంబం నుంచి, మిత్రుల నుంచి 20 లక్షల రూపాయలు సేకరించి 'స్వచ్ఛ ఎకో సొల్యూషన్స్' అనే స్టార్టప్‌ను 2012లో స్థాపించాను.



ఈ ప్రయత్నం అందుకోసమే...

అప్పటికి రీసైక్లింగ్ అనేది కొత్త. ఇక్కడ చెత్తను కొనే వాళ్ళు లేరు. సేకరించిన పొడి చెత్త నుంచి ప్లాస్టిక్‌ను తీసి పుణే పంపించేవాళ్ళం. అక్కడ దాంతో డ్రిప్ ఇరిగేషన్ పైపులు తయారయ్యేవి. ఆ తరువాత మెల్లగా మేమే రకరకాల వస్తువుల తయారీ చేపట్టాం. మా కృషికి గుర్తింపుగా ప్రభుత్వం నుంచి, ప్రైవేటు సంస్థల నుంచి అనేక పురస్కారాలు అందుకున్నాం. ఇప్పుడు మాకు బెంగళూరులో, హోసూరులో రెండు రీసైక్లింగ్ యూనిట్స్ ఉన్నాయి. పలు ప్రదేశాల నుంచి చెత్త సేకరించి, దాన్ని ప్రాసెస్ చేస్తున్నాం. దీనిద్వారా దాదాపు అయిదు లక్షలమందికి పైగా జీవితాలపై ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మా సంస్థలు ప్రభావం చూపించాయి. లక్షా పాతికవేల టన్నులకు పైగా చెత్తను చెత్త కుప్పల మీద నుంచి తొలగించగలిగాం. దాదాపు 70 వేల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేశాం. వాటితో పలు ఉత్పత్తులు తయారవుతున్నాయి. సుమారు మూడువేల మందికి ఉపాధి కల్పించాం. వీరిలో ఎక్కువమంది మహిళలే. చెత్తను ఎక్కడపడితే అక్కడ పారేస్తే... మన ఆరోగ్యాలు, పర్యావరణం దెబ్బతింటాయి. ఈ సమస్యకు... పునర్వినియోగమే పరిష్కారం. ఈ దిశగా ప్రజల్లో అవగాహన కల్పించడం చాలా ముఖ్యం. ఇరవయ్యేళ్ళుగా నేను చేస్తున్న ప్రయత్నమంతా దానికోసమే."

నేటి మ్యాచ్‌లు	అఫ్ఘానిస్థాన్ X యూఏఈ (ఉ. 11 గం. నుంచి)
	ఇంగ్లండ్ X ఇటలీ (మ.3 గం.)
	ఆస్ట్రేలియా X శ్రీలంక (రా.7 గం.)

1 టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్‌లో ఆరుగురు స్పిన్నర్లను ఉపయోగించిన ఏకైక జట్టుగా పాక్.

టీ20 వరల్డ్‌కప్



బాబర్ ఆజమ్ (5) క్లీన్‌బౌల్డ్

యూఎస్‌ఏ 132.. నమీబియా 116. ఈ టీ20 వరల్డ్‌కప్‌లో భారత్‌పై పసికూన జట్లు సాధించిన స్కోర్లివి. కానీ ఎప్పుడెప్పుడా అని క్రికెట్ ప్రేమికులు ఆత్రుతగా ఎదురుచూసిన మ్యాచ్‌లో పాకిస్థాన్ చేసింది 114 పరుగులే. టోర్నీ ఆరంభానికి ముందు.. ఆ తర్వాత కూడా భారత్-పాక్ పోరుపై ఎంత హైడ్రామా సాగిందో! కానీ బరిలోకి దిగాక మాత్రం మనోళ్ల దెబ్బకు.. వార్ వన్‌సైడ్ అయిపోయింది. 176 పరుగుల ఛేదనలో పాక్ జట్టు ఏమాత్రం పోటీ ఇవ్వకుండానే బ్యాట్లెత్తేసింది. ఫలితం.. మహా శివరాత్రి పర్వదినాన భారత అభిమానులు పులకించిపోగా, పాక్ ఫ్యాన్స్‌కు ఆదివారం కాళరాత్రిగా మిగిలింది. మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ మెరుపు ఇన్నింగ్స్ హైలైట్. ఈ ఘనవిజయంతో భారత్ సగర్వంగా సూపర్-8కు చేరింది.

వార్ వన్‌సైడ్


బుమ్రా (2-0-17-2)

టీమిండియా చేతిలో పాక్ చిత్తు


ఇషాన్ కిషన్ (40 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 77)

ఇషాన్ కిషన్ తుఫాన్ ఇన్నింగ్స్ ● బెదరగొట్టిన బౌలర్లు

సూపర్-8లో సూర్యసేన

కొలంబో: సంచలనమేమీ లేదు. టీ20 వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్‌పై భారత జట్టు తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. ఓపెనర్ ఇషాన్ కిషన్ (40 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 77) తుఫాన్ ఇన్నింగ్స్‌కు జతగా బౌలింగ్ విభాగం దుమ్ము రేపడంతో సూర్య సేన 61 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. అలాగే హ్యాట్రిక్ విజయాలతో గ్రూప్ 'ఏ' నుంచి జట్టు సూపర్-8కి చేరింది. అంతేకాకుండా ఈ మెగా టోర్నీలో పాక్‌పై భారత్ ఆధిక్యం 8-1కి పెరిగింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 175 పరుగులు చేసింది. సూర్య (32), దూబే (27), తిలక్ (25) ఫర్వాలేదనిపించారు. స్పిన్నర్ సయీమ్ అయూబ్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో పాక్ 18 ఓవర్లలో 114 పరుగులకు కుప్పకూలింది. ఉస్మాన్ ఖాన్ (44), షహీన్ (23 నాటౌట్) మినహా అంతా విఫలమయ్యారు. బుమ్రా, వరుణ్, హార్దిక్, అక్షర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఇషాన్ నిలిచాడు.

పోటీ లేకుండానే..

'మా బ్యాటర్లు కచ్చితంగా ఈ స్కోరును ఛేదిస్తారు'.. భారత్ ఇన్నింగ్స్ ముగిశాక స్పిన్నర్ ఉస్మాన్ తారిఖ్ అన్న మాటలివి. కానీ బరిలోకి దిగాక పాక్ బ్యాటర్లు పోటీ కాదు కదా.. ఆ దరిదాపుల్లోకి కూడా రాలేకపోయారు. 0, 6, 4, 5 పాక్ టాప్-4 బ్యాటర్ల స్కోర్లివి. పేసర్లు హార్దిక్, బుమ్రాల ధాటికి తొలి రెండు ఓవర్లలోనే ముగ్గురు పెవిలియన్‌లో కూర్చోవడంతో పాక్ పరిస్థితి అర్థమైంది. మిడిలార్డర్‌లో ఉస్మాన్ ఖాన్ ఒక్కడే కాసేపు నిలదొక్కుకున్నాడు. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు ప్రభావం చూపడంతో పాటు వికెట్ల వేట సాగించడంతో ఓ దశలో వంద పరుగులు కూడా కష్టమే అనిపించింది. కానీ చివర్లో షహీన్ బౌండరీలతో కాస్త పరువు కాపాడాడు. హార్దిక్ ఆఖరి వికెట్‌తో పాక్ ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లోనే ముగిసింది.

అటు ఇషాన్.. ఇటు స్పిన్నర్లు

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్ పాక్ స్పిన్నర్ల ధాటికి రెండు రకాలుగా సాగింది. పిచ్ స్పిన్‌కు అనుకూలిస్తున్నా ఓపెనర్ ఇషాన్ ధనాధన్ ఆటతీరుతో వహ్వా అనిపించాడు. అతడి ఎడాపెడా షాట్లతో స్కోరుబోర్డు దూసుకెళ్లింది. కానీ తన నిష్క్రమణ తర్వాత అదే పిచ్‌పై మిగతా బ్యాటర్లకు టర్నింగ్ బంతిని ఎదుర్కోవడం చాలా కష్టంగా మారింది. పాక్ ఏకంగా ఆరుగురు స్పిన్నర్లను బరిలోకి దించి 18 ఓవర్లను వేయించడం విశేషం. దీంతో క్రీజులో తిలక్, సూర్య, దూబే ఉన్నప్పటికీ ఆశించిన మేర పరుగులు సాధించలేకపోయింది. వారు భారీ షాట్లకు ప్రయత్నించినా మైదానం పెద్దది కావడంతో బంతి బౌండరీ దాటడం గగనమైంది. ముఖ్యంగా సయీమ్ అయూబ్ బంతిని అద్భుతంగా టర్న్ చేసి భారత్‌పై ఒత్తిడి పెంచాడు. ఇదంతా ఓ వైపు.. కానీ ఆరంభంలో ఇషాన్ ఆడిన తీరుకు పాక్ బౌలర్లలో వణుకు పుట్టింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌ను కెప్టెన్ సల్మాన్ వేయడమే కాకుండా ప్రమాదకర అభిషేక్‌ను డకౌట్ చేశాడు. తన చివరి ఆరు ఇన్నింగ్స్‌లో అభిషేక్‌కిది నాలుగో డకౌట్ కావడం గమనార్హం. రెండో ఓవర్ పేసర్ షహీన్‌కు ఇవ్వగా.. ఇషాన్ 6,4 తిలక్ 4తో 15 రన్స్ వచ్చాయి. స్పిన్నర్ అబ్రార్ తొలి ఓవర్‌లోనూ ఇషాన్ 6,4తో చెలరేగడంతో పవర్‌ప్లేలో జట్టు 52/1 స్కోరుతో పటిష్ఠంగా కనిపించింది. అందులో ఇషాన్‌వే 42 పరుగులుండడం విశేషం. ఆ తర్వాతా తన ధాటిని కొనసాగిస్తూ ఏడో ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో విరుచుకుపడిన ఇషాన్.. స్పిన్నర్ షాదాబ్ ఓవర్‌లో 6,4తో 17 రన్స్ రాబట్టాడు. ఓవర్‌కు పది పరుగుల రన్‌రేట్‌తో స్కోరుబోర్డు దూసుకెళుతున్న వేళ స్పిన్నర్ సయీమ్ భారత్‌కు షాక్ ఇచ్చాడు. తొమ్మిదో ఓవర్‌లో అతడు ఇషాన్‌ను బౌల్డ్ చేయడంతో రెండో వికెట్‌కు 87 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత ఒక్కసారిగా స్కోరు నెమ్మదించింది. స్పిన్నర్లు ప్రభావం చూపడంతో తిలక్-సూర్య జోడీ భారీ షాట్లకు వెళ్లే సాహసం చేయలేదు. దీనికి తోడు 15వ ఓవర్‌లో సయీమ్ డబుల్ ఝలక్ ఇస్తూ వరుస బంతుల్లో తిలక్, హార్దిక్ (0)ల వికెట్లు తీశాడు. 18వ ఓవర్‌లో సూర్య 4, దూబే (27) 6 తో 14 రన్స్‌తో స్కోరు 150 దాటింది. కానీ తర్వాతి ఓవర్‌లోనే సూర్యను తారిఖ్ అవుట్ చేయగా.. చివరి ఓవర్‌లో జట్టు 16 రన్స్ సాధించి రెండు వికెట్లను కోల్పోయింది.



1 భారత్-పాక్ మధ్య జరిగిన టీ20ల్లో పవర్‌ప్లేలో ఎక్కువ పరుగులు (42) చేసిన బ్యాటర్‌గా ఇషాన్



నో షేక్‌హ్యాండ్..

ఆసియాకప్ సంప్రదాయాన్నే టీమిండియా ఇక్కడా కొనసాగించింది. టాస్ సమయంలో పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘాతో భారత సారథి సూర్యకుమార్ కరచాలనం చేయలేదు. ఇదే విషయమై మ్యాచ్‌కు ముందు రోజు ఇరు జట్ల కెప్టెన్లను విలేకరులు అడిగితే.. వేచి చూడాల్సిందిగా బదులిచ్చారు. అయితే మ్యాచ్ రోజు అందరూ ఆసక్తిగా గమనించినప్పటికీ ఎప్పటిలాగే ఎవరికి వారు ప్రజెంటర్‌తో మాట్లాడి వెళ్లిపోయారు. ఇదే ఆనవాయితీ అటు మహిళల వన్డే వరల్డ్‌కప్, అండర్-19 వరల్డ్‌కప్‌ల్లోనూ కొనసాగించిన విషయం తెలిసిందే.



అతిరథుల సందడి

భారత్-పాక్ మ్యాచ్‌ను తిలకించేందుకు శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే తరలివచ్చారు. వీవీఐపీ గ్యాలరీలో ఆయనతో పాటు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చీఫ్ మొహిసిన్ నఖ్వీ, శ్రీలంక క్రికెట్ బోర్డు (ఎఎల్‌సీ) అధ్యక్షుడు షమ్మి సిల్వ, పీసీబీ సీఓఓ సల్మాన్ నసీర్ కూడా ఉన్నారు. అయితే ఐసీసీ చైర్మన్ జైషా, టోర్నీ అంబాసిడర్ రోహిత్ శర్మ, ఐపీఎల్ చైర్మన్ ధూమల్, బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా మాత్రం వీళ్లతో కాకుండా మరో గ్యాలరీలో కూర్చుని మ్యాచ్‌ను తిలకించడం గమనార్హం.



ఎన్ని డ్రామాలాడినా..

మ్యాచ్‌కు ముందు ఎంత డ్రామా! ఎన్ని రోజుల సస్పెన్స్! భారత్‌తో ఐసీసీ టోర్నీ మ్యాచ్ అనగానే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఎప్పుడూ వివాదం సృష్టిస్తూనే ఉంటుంది. అయితే ఈసారి పీసీబీకి బదులు ఏకంగా ఆ దేశ ప్రభుత్వమే వివాదంలో తలదూర్చింది. భారత్‌లో ఆడేందుకు ససేమిరా అన్న బంగ్లాదేశ్‌ను టీ20 వరల్డ్ కప్ నుంచి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తప్పిస్తే..ఆ దేశానికి మద్దతుగా పాకిస్థాన్ ప్రభుత్వం రంగంలోకి దిగింది! బంగ్లాదేశ్‌కు సంఘీభావంగా ప్రపంచ కప్‌లో భారత్‌తో మ్యాచ్ బహిష్కరిస్తున్నట్టు స్వాక్షాత్తూ పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే బహిష్కరణ నిర్ణయాన్ని కనుక మార్చుకోకుంటే నిబంధనల ప్రకారం పాకిస్థాన్‌పై కఠిన చర్యలకు వెనుకాడబోమని ఐసీసీ హెచ్చరించింది. మరోవైపు పాకిస్థాన్ ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. అప్పులు చేస్తే తప్ప దేశం నడవలేని గడ్డు పరిస్థితి. ఇక పీసీబీ ఆర్థిక పరిస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. బోర్డు కాంట్రాక్టులో ఉన్న ఆటగాళ్లకు కూడా జీతాలు చెల్లించలేని దైన్య స్థితి. ఈ నేపథ్యంలో భారత్‌తో మ్యాచ్ ఆడకుండే ఆర్థికంగా ఏర్పడే పరిణామాలు భయపెట్టిన వేళ పాకిస్థాన్ దిగివచ్చింది. మరోవైపు శ్రీలంక, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డులు కూడా నచ్చజెప్పడంతో టీమిండియాతో తలపడేందుకు పాకిస్థాన్ అంగీకరించింది. దాంతో వరల్డ్ కప్‌లో అసలు సిసలు సమరానికి మార్గం సుగమమైంది. కానీ మ్యాచ్ ఫలితం మాత్రం అదే. ఐసీసీ టోర్నమెంట్లలో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై తన సంపూర్ణ ఆధిపత్యాన్ని భారత్ మరోసారి ప్రదర్శించింది. మిస్టరీ స్పిన్నర్ పేరిట ఉస్మాన్ తారిఖ్‌ను బరిలోకి దించినా, టీమిండియా బ్యాటర్లకు కళ్లెం వేసేందుకు మరో ఐదుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగింది. 20 ఓవర్లలో 18 ఓవర్లు స్పిన్నర్లతోనే వేయించింది. అయితే ఈ వ్యూహం బెడిసి కొట్టింది. సూపర్ ఫామ్‌లో ఉన్న భారత బ్యాటర్లు పాక్ స్పిన్నర్లను ఆడేసుకున్నారు. స్లో బౌలర్లకు సహకరించిన ప్రేమదాస స్టేడియం పిచ్‌పై 176 పరుగుల లక్ష్యం క్లిష్టమైనదే. దాంతో ఛేదనలో మన స్పిన్నర్ల ఎదుట పాకిస్థాన్ పూర్తిగా తేలిపోయింది. బ్యాటర్లంతా ఇలా వచ్చి అలా వికెట్లు అప్పగించేసి వెళ్లడంతో భారత్ మరో ఘన విజయం అందుకుంది. పాకిస్థాన్‌పై తనకు తిరుగులేదని నిరూపించింది. ఇక..అంతర్జాతీయ క్రికెట్‌పై భారత పెత్తనమేమిటంటూ, బీసీసీఐకి ఐసీసీ పూర్తిగా లొంగిపోయిందంటూ, ఐసీసీకి ప్రత్యామ్నాయంగా అంతర్జాతీయ క్రికెట్ పాలనకు మరో సంస్థ రావాలంటూ బీరాలు పలికిన పాకిస్థాన్ చిత్తుగా ఓటమిపాలై చివరకు నవ్వుల పాలైంది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)


మ్యాచ్‌కు ముందు ట్రోఫీతో టోర్నీ అంబాసిడర్ రోహిత్ శర్మ, పాకిస్థాన్ మాజీ కెప్టెన్ వసీం అక్రమ్

2 టీ20 వరల్డ్‌కప్‌లో పాక్ జట్టుకిది రెండో (61 రన్స్‌తో) భారీ ఓటమి. గతంలో విండీస్‌పై 84 రన్స్‌తో ఓడింది.

3 టీ20 వరల్డ్‌కప్ అరంగేట్రంలో తామాడిన తొలి రెండు మ్యాచ్‌ల్లోనూ డకౌటైన మూడో బ్యాటర్‌గా అభిషేక్. గతంలో నెహ్రా, ఇమ్రుల్ కయేస్ ఉన్నారు.

పాయింట్ల పట్టిక

గ్రూప్-ఎ					
జట్టు	ఆ	గె	ఓ	పా	ర.రే
భారత్	3	3	0	6	3.050
అమెరికా	4	2	2	4	0.788
పాకిస్థాన్	3	2	1	4	-0.403
నెదర్లాండ్స్	3	1	2	2	-1.352
నమీబియా	3	0	3	0	-2.443
గ్రూప్-సి					
వెస్టిండీస్	3	3	0	6	1.820
ఇంగ్లండ్	3	2	1	4	-0.143
స్కాట్లాండ్	3	1	2	2	0.359
ఇటలీ	2	1	1	2	-0.352
నేపాల్	3	0	3	0	-1.942

ఆ: ఆడినవి; గె: గెలిచినవి; ఓ: ఓడినవి; పా:పాయింట్లు; ర.రే: రన్‌రేట్

స్కోరుబోర్డు

భారత్: ఇషాన్ (బి) సయీమ్ 77, అభిషేక్ (సి) షహీన్ (బి) సల్మాన్ 0, తిలక్ (ఎల్బీ) సయీమ్ 25, సూర్యకుమార్ (సి) సయీమ్ (బి) తారిఖ్ 32, హార్దిక్ (సి) బాబర్ (బి) సయీమ్ 0, దూబే (రనౌట్) 27, రింకూ (నాటౌట్) 11, అక్షర్ (సి) సయీమ్ (బి) షహీన్ 0; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 20 ఓవర్లలో 175/7. వికెట్ల పతనం:** 1-1, 2-88, 3-126, 4-126, 5-159, 6-175, 7-175. **బౌలింగ్:** సల్మాన్ ఆఘా 2-0-10-1, షహీన్ 2-0-31-1, సయీమ్ 4-0-25-3, అబ్రార్ 3-0-38-0, షాదాబ్ 1-0-17-0, నవాజ్ 4-0-28-0, తారిఖ్ 4-0-24-1.

పాకిస్థాన్: సాహిబ్‌జాదా (సి) రింకూ (బి) హార్దిక్ 0, సయీమ్ (ఎల్బీ) బుమ్రా 6, సల్మాన్ (సి) హార్దిక్ (బి) బుమ్రా 4, బాబర్ (బి) అక్షర్ 5, ఉస్మాన్ (స్టంప్) ఇషాన్ (బి) అక్షర్ 44, షాదాబ్ (సి) దూబే (బి) తిలక్ 14, నవాజ్ (సి) దూబే (బి) కుల్దీప్ 4, ఫహీమ్ (సి) రింకూ (బి) వరుణ్ 10, షహీన్ (నాటౌట్) 23, ఎబ్రార్ (ఎల్బీ) వరుణ్ 0, ఉస్మాన్ (బి) హార్దిక్ 0; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 18 ఓవర్లలో 114 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-0, 2-6, 3-13, 4-34, 5-73, 6-78, 7-78, 8-97, 9-97, 10-114. **బౌలింగ్:** హార్దిక్ 3-1-16-2, బుమ్రా 2-0-17-2, అక్షర్ 4-0-29-2, వరుణ్ 3-0-17-2, కుల్దీప్ 3-0-14-1, తిలక్ 2-0-11-1, రింకూ 1-0-9-0.


సంజయ్ (68 నాటౌట్)

అమెరికా..

గెలిచి నిలిచింది!

- 31 రన్స్‌తో నమీబియా ఓటమి
- సంజయ్, మోనంక్ హాఫ్ సెంచరీలు

చెన్నై: సూపర్-8 రేసులో నిలవాలంటే గెలవాల్సిన మ్యాచ్‌లో అమెరికా దుమ్ము రేపింది. సంజయ్ కృష్ణమూర్తి (33 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్స్‌లతో 68 నాటౌట్), కెప్టెన్ మోనంక్ పటేల్ (30 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 52) హాఫ్ సెంచరీలతో రెచ్చిపోయిన వేళ 31 పరుగులతో నమీబియాను చిత్తు చేసింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తొలుత అమెరికా 20 ఓవర్లలో 199/4 స్కోరు చేసింది. పొట్టి క్రికెట్‌లో ఆ జట్టుకిదే అత్యధిక స్కోరు కావడం విశేషం. ఈ క్రమంలో గత టీ20 ప్రపంచ కప్‌లో కెనడాపై చేసిన 197/3 రన్స్ స్కోరును అమెరికా అధిగమించింది. చివర్లో మిలింద్ కుమార్ (28) మెరుపులు మెరిపించాడు. షైబర్గ్, ఎరాస్మస్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. భారీ ఛేదనలో నమీబియా 20 ఓవర్లలో 168/6 స్కోరుకే పరిమితమై ఓడింది. స్టీన్‌కాంప్ (58), స్మిట్ (31) రాణించారు. ఈటన్ (28) పర్లేదనిపించాడు. షాక్విక్ రెండు వికెట్లు సాధించాడు. సంజయ్ కృష్ణమూర్తి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

సంక్షిప్త స్కోర్లు: అమెరికా: 20 ఓవర్లలో 199/4 (సంజయ్ కృష్ణమూర్తి 68 నాటౌట్, మోనంక్ పటేల్ 52, మిలింద్ కుమార్ 28, జహంగీర్ 22, షైబర్గ్ 2/22, గెరార్డ్ ఎరాస్మస్ 2/27); **నమీబియా:** 20 ఓవర్లలో 168/6 (స్టీన్‌కాంప్ 58, స్మిట్ 31, ఈటన్ 28, షాల్విక్ 2/30).

మనమ్మాయిలు పాక్‌ను పడగొట్టారు

స్పిన్నర్ల విజృంభణ ● ఆసియా కప్ రైజింగ్ స్టార్స్

బ్యాంకాక్: టీ20 ప్రపంచకప్‌లో ఆదివారం భారత పురుషుల జట్టు పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడిస్తే... ఇదేరోజు భారత జూనియర్ అమ్మాయిలు కూడా పాక్ పని పట్టారు. మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో భాగంగా ఆదివారం ఇక్కడ జరిగిన గ్రూప్-ఎ పోరులో భారత-ఎ జట్టు 8 వికెట్ల తేడాతో పాక్‌ను ఓడించింది. జట్టు కెప్టెన్, స్పిన్నర్ రాధా యాదవ్ (2/11)కు తోడు సైమా ఠాకూర్ (2/14), ప్రేమా రావత్ (2/16) బౌలింగ్‌లో విజృంభించడతో.. పాక్ 18.5 ఓవర్లలో 93 పరుగులకే కుప్పకూలింది. షవాల్ జుల్ఫికర్ (23) టాప్‌స్కోరర్. స్వల్ప ఛేదనలో దినేశ్ బ్రింద (55) అజేయ అర్ధ సెంచరీతో భారత్ 10.1 ఓవర్లలోనే 97/2 స్కోరు చేసి అలవోకగా గెలిచింది. అనుష్క శర్మ (24) రాణించింది. ఈ టోర్నీలో భారత-ఎ జట్టుకిదే తొలి గెలుపు. అంతకుముందు శుక్రవారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో యూఏఈ చేతిలో భారత్ ఓటమిపాలైంది.



పోటెత్తిన అభిమానం

కొలంబో: టోర్నమెంట్ ఏదైనా సరే.. భారత్, పాకిస్థాన్ పోరుకు ఉండే క్రేజే వేరు. అందులోనూ విశ్వకప్‌లో ఇరుజట్ల మధ్య మ్యాచ్ అంటే.. క్రికెట్ ఫీవర్ మరింత హీటెక్కడం ఖాయం. ఇప్పుడు టీ20 ప్రపంచకప్‌లోనూ అదే జరిగింది. ఆదివారం సెలవు రోజు కావడంతో దాయాది జట్ల పోరును కనులారా వీక్షించేందుకు అభిమానులు ప్రేమదాస స్టేడియానికి పోటెత్తారు. స్థానికంగా ఉండే ప్రేక్షకులే గాకుండా.. ఇరు దేశాల నుంచి అనేక మంది శ్రీలంక రాజధాని కొలంబోకు తరలివచ్చారు. భారత్ నుంచి 18వేలకు పైగా మద్దతుదారులు, పాక్ తరఫున 12వేలకు పైగా అభిమానులు హాజరై తమ జట్లను ఉత్సాహపరిచారు. మ్యాచ్ రాత్రి ఏడు గంటలకు మొదలైనా, స్టేడియం గేట్లు మధ్యాహ్నం మూడు గంటలకే తెరవడంతో ముందే స్టేడియం నిండిపోయింది. బాయ్‌కాట్ వార్తల నేపథ్యంలో తొలుత ఇండో-పాక్ మ్యాచ్ జరగడంపై సందేహం నెలకొన్నా, ఆ తర్వాత పాక్ తమ నిర్ణయాన్ని ప్రకటించడంతో విమాన టిక్కెట్లకు రెక్కలొచ్చాయి. కొలంబోలో బుకింగ్స్ కూడా ముందుగానే జరిగిపోయాయి. ఒకరకంగా ఈ మ్యాచ్‌తో శ్రీలంక పర్యాటక శాఖకు భారీగా ఆదాయం చేకూరింది.

2వేల మంది పోలీసులతో భద్రత..: ఇండో-పాక్ పోరు కావడంతో ఈ మ్యాచ్‌కు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఓవరాల్‌గా 2వేల మంది పోలీసులు భద్రతను పర్యవేక్షించారు. 600 మంది పారా మిలటరీ దళాలను బరిలోకి దించారు.

అదరగొట్టిన అరుంధతి, శ్రీచరణి

భారత మహిళల బోణీ ● ఆసీస్‌తో తొలి టీ20


అరుంధతి (4/22)

సిడ్నీ: భారత మహిళల జట్టు ఆస్ట్రేలియా పర్యటనను విజయంతో ఆరంభించింది. ఆదివారం జరిగిన తొలి టీ20లో భారత్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన 21 పరుగుల తేడాతో నెగ్గింది. దీంతో మూడు టీ20ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సాధించింది. తెలుగమ్మాయిలు అరుంధతి రెడ్డి నాలుగు, శ్రీచరణి రెండు వికెట్లతో కట్టడి చేయగా.. ఆసీస్ 18 ఓవర్లలో 133 పరుగులకే ఆలౌటైంది. వేర్‌హమ్ (30), లిచ్‌ఫీల్డ్ (26), ఎలిస్ (20) మోస్తరుగా ఆడారు. రేణుకా సింగ్‌కు రెండు వికెట్లు దక్కాయి. తర్వాత ఛేదనలో భారత్ 5.1 ఓవర్లలో 50/1 స్కోరు దగ్గర భారీ వర్షం కురిసింది. మ్యాచ్ రద్దు అయినప్పటికీ డ/లూ పద్ధతిన అదనంగా 21 రన్స్ చేయడంతో భారత్‌ను విజేతగా ప్రకటించారు. షఫాలీ (21), మంధాన (16 నాటౌట్) రాణించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అరుంధతి నిలిచింది.

సంక్షిప్త స్కోర్లు: ఆస్ట్రేలియా: 18 ఓవర్లలో 133 ఆలౌట్ (వేర్‌హమ్ 30, లిచ్‌ఫీల్డ్ 26; అరుంధతి 4/22, శ్రీచరణి 2/14, రేణుకా 2/14); **భారత్:** 5.1 ఓవర్లలో 50/1 (షఫాలీ 21, మంధాన 16 నాటౌట్; మోలినెక్స్ 1/13).

రాహుల్, పడిక్కళ్ సెంచరీలు

కర్ణాటక 355/2 ● ఉత్తరాఖండ్‌తో రంజీ సెమీస్

లఖ్‌నవూ: ఉత్తరాఖండ్‌తో రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో కర్ణాటక భారీ స్కోరు దిశగా సాగుతోంది. ఆదివారం మొదలైన ఈ మ్యాచ్‌లో టాస్ కోల్పోయి బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక జట్టులో ఓపెనర్ కేఎల్ రాహుల్ (141), దేవ్‌దత్ పడిక్కళ్ (148 నాటౌట్) శతకాలతో విజృంభించడంతో తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్లకు 355 పరుగులు చేసింది. మరో ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (18) ఆదిలోనే వెనుదిరిగినా.. రాహుల్, దేవ్‌దత్ స్కోరుబోర్డును నడిపించారు. వీరిద్దరు రెండో వికెట్‌కు 278 పరుగులు జోడించారు. తొలిరోజు ఆట ముగిసేసరికి పడిక్కళ్‌కు తోడుగా కరుణ్ నాయర్ (37 నాటౌట్) క్రీజులో ఉన్నాడు.

ఘరామి అజేయ శతకం: బెంగాల్ 249/5

పశ్చిమ బెంగాల్‌లోని కళ్యాణి వేదికగా జమ్మూ కశ్మీర్‌తో జరుగుతున్న రెండో సెమీఫైనల్లో బెంగాల్ ఆటగాడు సుదీప్‌కుమార్ ఘరామి (136 నాటౌట్) అజేయ శతకంతో విజృంభించాడు. దీంతో ఆట ముగిసేసరికి తొలి ఇన్నింగ్స్‌లో బెంగాల్ 5 వికెట్లకు 249 పరుగులు చేసింది. కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (49), షాబాజ్ అహ్మద్ (42) రాణించారు. జమ్ము బౌలర్లలో సునీల్ కుమార్, ఆకిబ్ నబి చెరో రెండు వికెట్లు పడగొట్టారు.


హోల్డర్ (4/27)

సూపర్-8కు విండీస్

9 వికెట్లతో గెలుపు ● నేపాల్ అవుట్

ముంబై: రెండుసార్లు చాంపియన్ వెస్టిండీస్ టీ20 ప్రపంచ కప్‌లో అజేయంగా దూసుకెళ్తోంది. గ్రూప్-సిలో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో నేపాల్‌ను 9 వికెట్లతో చిత్తుచేసి హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. ఓవరాల్‌గా ఆరు పాయింట్లను ఖాతాలో వేసుకున్న కరీబియన్ జట్టు అందరికంటే ముందుగా టోర్నీలో సూపర్-8 బెర్త్‌ను దక్కించుకుంది. మరోవైపు వరుసగా మూడో పరాజయంతో నేపాల్ టోర్నమెంట్ నుంచి నిష్క్రమించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన నేపాల్.. జేసన్ హోల్డర్ (4-0-27-4) దెబ్బకు 20 ఓవర్లలో 133/8 స్కోరుకే పరిమితమైంది. మాథ్యూ ఫోర్డ్ (4-1-10-1) పొదుపుగా బౌలింగ్ చేశాడు. దీపేంద్రసింగ్ ఐరీ (58) అర్ధ సెంచరీతో రాణించాడు. సోంపాల్ కామి (26 నాటౌట్) ఫర్వాలేదనిపించగా, మిగతా వారంతా విఫలమయ్యారు. ఛేదనలో కెప్టెన్ షాయ్ హోప్ (44 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 61 నాటౌట్) సత్తా చాటడంతో విండీస్ 15.2 ఓవర్లలోనే 134/1 స్కోరు చేసి గెలిచింది. హోప్‌కు హెట్‌మయెర్ (46 నాటౌట్), బ్రాండన్ కింగ్ (22) సహకరించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా హోల్డర్ నిలిచాడు.

సంక్షిప్త స్కోర్లు: నేపాల్: 20 ఓవర్లలో 133/8 (దీపేంద్రసింగ్ 58, సోంపాల్ 26 నాటౌట్; హోల్డర్ 4/27, మాథ్యూ 1/10, చేజ్ 1/10); **వెస్టిండీస్:** 15.2 ఓవర్లలో 134/1 (హోప్ 61 నాటౌట్, హెట్‌మయెర్ 46 నాటౌట్, బ్రాండన్ 22; నందన్ యాదవ్ 1/24).

'ఆరోగ్యం'లో

గేట్స్ టెక్నాలజీ!



- సామాన్యుడి చెంతకు అంతర్జాతీయ వైద్యసేవలు
- 'గేట్స్' సహకారంతో ఏపీలో డిజిటల్ హెల్త్
- ఇప్పటికే కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా 'సంజీవని'
- రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించేందుకు ప్రణాళికలు
- మరింత సహకారం కోరనున్న సీఎం చంద్రబాబు
- ప్రజారోగ్యంపైనే ఫోకస్

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య రంగంలో సాంకేతిక విప్లవం ద్వారా సామాన్యులకు మెరుగైన, సత్వర వైద్యసేవలను అందించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత గేట్స్ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్రంలోని ఆరోగ్యవ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధంచేసింది. రాష్ట్రంలో విద్యావైద్య, వ్యవసాయ రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ ఇప్పటికే అన్నిస్సహకారంతోపాటు టెక్నాలజీ పరంగా మరింత సహకారం అందించేక్రమంలో సీఎం చంద్రబాబు ఆహ్వానం మేరకు నేడు గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ ఏపీ వస్తున్నారు. ఈసందర్భంగా ఆయన విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అమలవుతున్న ఆధునిక పద్ధతులు, పాటించాల్సినవిధానాలపై ప్రభుత్వానికి కీలకసూచనలు చేయనున్నారు. ముఖ్యంగా జబ్బుల బారినపడిన వారికి వైద్యం అందించే సంప్రదాయ విధానానికి భిన్నంగా.. వ్యాధుల సోకడాన్ని ముందుగానే పసిగట్టి, వాటి నివారణా చర్యలతో పాటు ప్రజల ప్రజారోగ్య స్థితిగతుల్ని వ్యక్తిగతంగా సమగ్రంగా పరిశీలించి, వారికి జబ్బులొచ్చే అవకాశాన్ని ముందుగానే హెచ్చరికలు చేయడం, వ్యక్తిగత హెల్త్ కార్డుల్ని రూపొందించడం, డిజిటల్ ఆరోగ్య సేవల (టెలిమెడిసిన్) అందించే దిశగా వైద్య ఆరోగ్య వ్యవస్థను ప్రక్షాళన చేయాలన్న అంశాలపై కీలకమైన నిర్ణయాలు తీసుకోనున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య సంరక్షణకు ఉన్న విధానాలు, పద్ధతులను సమగ్రంగా సమీక్షించి ఆరోగ్యాంధ్ర సాధనకు చేపట్టాల్సిన విధానాలపై నివేదించేందుకు గేట్స్ ఫౌండేషన్ సూచనల మేరకు 10 మంది అంతర్జాతీయ నిపుణులతో ఒక ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై సీఎం చంద్రబాబు బిల్‌గేట్స్‌కు వివరించనున్నారు. అంతేకాకుండా గేట్స్ ఫౌండేషన్ సూచించిన మేరకు వివిధ పథకాల అమలుకు భాగస్వామ్యం ద్వారా కార్యాచరణను ప్రారంభించడంతో పాటు ఇంటిగ్రేటెడ్ విధానంలో సాంకేతిక సహకారంతో వివిధ ఆరోగ్య కేంద్రాల సమన్వయంతో రియల్ టైమ్‌లో ప్రజల ఆరోగ్య భద్రత కోసమే ప్రత్యేకంగా సంజీవని పథకాన్ని ప్రారంభించింది. చిత్తూరు జిల్లా కుప్పంలో పైలట్ ప్రాజెక్టును అమలు చేసి, ఇప్పుడు చిత్తూరు జిల్లాకు విస్తరించింది. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు సిద్ధమైంది. దీనికి గేట్స్ ఫౌండేషన్ సహకారం మరింత కావాలని ప్రభుత్వం కోరనుంది. ఆపై ఆరోగ్యశాఖను ఆర్టీజీఎస్ లోని అవేర్ ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానం చేసి వ్యాధుల ప్రబలతను ముందుగానే పసిగట్టే దిశగా ప్రభుత్వ చర్యలు చేపడుతుంది. నూతనంగా డేటా ఆధారిత ముందస్తు వ్యూహాలు, విధానాల రూపకల్పనకు గేట్స్ ఫౌండేషన్‌తో భాగస్వామ్యం తోడ్పడుతుంది. ఏఐ ఆధారిత డయాగ్నోస్టిక్ పరీక్షలు, సంచార పరీక్ష కేంద్రాల్లో సులువుగా నిరంతరం వాడే పరికరాలు, దూర ప్రాంతాల్లో వైద్యం, టెలిమెడిసిన్‌కు సంబంధించిన ఉపకరణాలు ఎంపికకు గేట్స్ ఫౌండేషన్ టెక్నికల్ సపోర్టు అందిస్తుంది.

వైద్య రంగంలో టెక్నాలజీ అవసరం: సత్యకుమార్

వైద్య రంగంలో ఆశించిన మార్పులను సాధించడానికి, వైద్యం అందరికీ సులువుగా అందించడానికి టెక్నాలజీ సహకారం ఎంతో అవసరం. ఈ దిశగా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ముందుకు సాగుతున్నాం. ఇందులో భాగంగాఏఐ ఆధారిత జాతీయ విధాన రూపకల్పన దిశగా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో విజయవాడలో వివిధ రాష్ట్రాలతో మొదటి విడత చర్చలు జరిపాం. ఆరోగ్యశాఖకు టెక్నాలజీ అనుసంధానంపై ఫౌండేషన్ సహకారం తీసుకుంటాం.

నేడు అమరావతికి బిల్ గేట్స్

అమరావతి, గుంటూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్ గేట్స్ సోమవారం అమరావతికి వస్తున్నారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తో ఆయన సమావేశమవుతారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో నిర్వహిస్తున్న ప్రాజెక్టులను గేట్స్ బృందం పరిశీలించనుంది. ఉదయం 10 గంటలకు సచివాలయంలోని ఆర్‌టీజీఎస్‌కు చేరుకుని వాట్సాప్ ద్వారా మనమిత్ర పేరిట పౌరులకు అందిస్తున్న 800కుపైగా సేవల గురించి తెలుసుకుంటారు. ప్రకృతి వైపరీత్యాలపై ముందస్తుగా సమాచారం ఇవ్వడం ద్వారా ప్రాణ నష్టాన్ని ఎలా నివారిస్తున్నామో బిల్ గేట్స్‌కు లోకేశ్ వివరిస్తారు. ఇందుకు ఇటీవల రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన తుఫానులు, వాటి ప్రభావంతో జరిగిన నష్టాలను నామమాత్రం చేయడం వంటి అంశాలను కూడా బిల్ గేట్స్ బృందానికి లోకేశ్ వివరించనున్నారు. సీఎం చంద్రబాబు నివాసానికి సమీపంలోని పచ్చటి అరటితోటలో గేట్స్‌తో చర్చలకు వేదికని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆయన సంజీవని ప్రాజెక్టు గురించి చర్చించడంతో పాటు టెక్నాలజీని వినియోగించి సాగు చేస్తున్న రైతులతోనూ సమావేశం అవుతారు.

నాడు విజన్ 2020... నేడు 2047

గతంలో విజన్-2020 లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని పాలన సాగించిన చంద్రబాబు ఇప్పుడు స్వర్ణాంధ్రప్రదేశ్-2047 లక్ష్యాన్ని గురించి గేట్స్‌కు వివరించనున్నారు. దీనిలోభాగంగా ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య వంటి ప్రధానాంశాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలను గురించి వివరిస్తూనే.. ఈ కార్యక్రమాల అమలులో బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారాన్ని కోరనున్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో చేపడుతున్న కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తారు. గేట్స్ ఫౌండేషన్ ద్వారా నడుస్తోన్న సంజీవని ప్రాజెక్టు గురించి చెప్పనున్నారు. తర్వాత ఉండవల్లిలో వ్యవసాయ క్షేత్రాన్ని గేట్స్ పరిశీలిస్తారు. ఇక్కడ కృత్రిమ మేధ సహకారంతో చేస్తున్న సాగు గురించి బిల్ గేట్స్ తెలుసుకుంటారు. ఆదివారం గుంటూరు జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్, ఇతర అధికారులు బిల్ గేట్స్‌తో సమావేశం జరిగే అరటి తోట పరిసర ప్రాంతాలను సందర్శించారు.

మళ్లీ తెరపైకి బాక్సైట్!

- మన్యంలోని ఆరు బ్లాకుల్లో 615 మిలియన్ టన్నుల నిల్వలు
- మైనింగ్‌కు ఏపీఎండీసీకి లీజులివ్వాలి
- నామినేషన్ లేదా వేలంలో ఇప్పించాలి
- ప్రభుత్వానికి గనుల శాఖ నివేదిక

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

లీజు ఒప్పందాల్లో అక్రమాలు.. కాగ్ నివేదిక, ఆదివాసీల ఆందోళనలతో ఆంధ్రప్రదేశ్‌లో కనుమరుగైన బాక్సైట్ మైనింగ్ మళ్లీ పురుడుపోసుకుంటోంది. కేంద్రం ప్రకటించిన క్రిటికల్ మినరల్ పాలసీ(సీఎంపీ) కింద బాక్సైట్ తవ్వకాలపై పరిశీలించాలని రాష్ట్రప్రభుత్వాన్ని గనుల శాఖ కోరింది. ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)కి మైనింగ్ లీజులు ఇప్పించే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తూ నివేదిక సమర్పించినట్లు తెలిసింది. విశాఖ మన్యంలోని అరకు అటవీప్రాంతంలో గుర్తేడు, చింతపల్లి, అనంతగిరి సహా ఆరు బ్లాకుల్లో 615 మిలియన్ టన్నుల బాక్సైట్ నిల్వలు ఉన్నాయని.. మైనింగ్ ప్రారంభిస్తే విలువ ఆధారిత పరిశ్రమలు కూడా వస్తాయని.. దరిదాపుగా రాష్ట్రానికి రూ.1,50,000 కోట్ల పెట్టుబడులు వస్తాయని.. అందుచేత దీనిపై దృష్టిసారించాలని సూచించింది.



దేశవ్యాప్తంగా 4,958 మిలియన్ టన్నుల బాక్సైట్ నిల్వలు ఉన్నాయి. ఒడిసాలో అత్యధికంగా 41 శాతం నిల్వలు.. అంటే 2,057 మిలియన్ టన్నులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో.. ఉమ్మడి విశాఖ పరిధిలోని అరకు-చింతపల్లి అటవీ ప్రాంతం (షెడ్యూల్డ్ ఏరియా)లో ఆరు బ్లాకులు.. చింతపల్లి, సప్పర్ల, అనంతగిరి, గుర్తేడు, గూడెం, కాటంరాజ్ కొండల్లో సుమారుగా 615 మిలియన్ టన్నుల బాక్సైట్ నిల్వలు ఉన్నాయి. 1980లోనే బాక్సైట్ నిల్వల గురించి జియోలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) నివేదికలు ఇచ్చింది. బాక్సైట్ మైనింగ్ కోసం ఉమ్మడి ఏపీ నుంచి విభజిత ఆంధ్రప్రదేశ్ వరకు ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. ఇందుకు విధానపరమైన లోపాలు, ఒప్పందాల్లోని అక్రమాలు, ఆదివాసీల పోరాటాలే కారణం. ఉమ్మడి విశాఖ జిల్లాలోని దట్టమైన అరకు-చింతపల్లి అటవీ ప్రాంతంలో బాక్సైట్ నిల్వలున్నాయి. ఇది షెడ్యూల్డ్ ఏరియా. నిబంధనల ప్రకారం మైనింగ్ ప్రైవేటు ఏజెన్సీలు చేపట్టడానికి వీల్లేదు. ఆదివాసీలు లేదా ప్రభుత్వ రంగ సంస్థల పేరిటే మైనింగ్ లీజులు ఇవ్వాలి. ఈ లెక్కన రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఏపీఎండీసీకి మైనింగ్ లీజులు దక్కాయి. ఏపీఎండీసీ మైనింగ్ బాధ్యతలు నేరుగా నిర్వహించదు కాబట్టి ప్రైవేటు కంపెనీలతో జతకట్టింది. దీంట్లో భాగంగా అరకు, సప్పర్ల ఏరియాల్లో మైనింగ్‌తోపాటు అల్యూమినియం రిఫైనరీ ఏర్పాటుకు జిందాల్ సౌత్‌వెస్ట్ హోల్డింగ్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ తర్వాత చింతపల్లి అటవీప్రాంతంలోని జెర్రెల బ్లాకులో అల్యూమినియం రిఫైరీ ఏర్పాటుకు 2007లో రస్‌అల్‌ఖైమాతో ఏపీఎండీసీ ఒప్పందం చేసుకుంది. ఆ తర్వాత రస్‌అల్‌ఖైమా పెన్నా కంపెనీతో కలిసి జాయింట్ వెంచర్ కంపెనీ ఆన్‌రాక్‌ను ఏర్పాటు చేసుకుంది. ఈ మేరకు ఏపీఎండీసీ ఆన్‌రాక్‌తో బాక్సైట్ సరఫరా ఒప్పందం కుదుర్చుకుంది. అనంతర కాలంలో కేంద్రం నుంచి అవసరమైన ఒప్పందాలు చేసుకుంది. అయితే ఈ ప్రాజెక్టు ఒప్పందాలు, అందులోని అంశాలపై 2013లో కాగ్ ఓ సంచలన నివేదిక ఇచ్చింది. అనేక లోపాలను ఎత్తిచూపింది. ఆసక్తి వ్యక్తీకరణ ఒప్పందం (ఈవోఐ) లేకుండా.. ఏపీఎండీసీకి తీవ్రస్థాయిలో నష్టం జరిగేలా ఒప్పందంలో క్లాజులున్నాయని.. రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థకు కేవలం 1.5 శాతం ఈక్విటీ ఇచ్చారని.. ఇలా పలు కీలక అంశాలను లేవనెత్తింది. ఇది నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రకంపనలు సృష్టించింది. మరోవైపు ఆన్‌రాక్ ప్లాంటు ఏర్పాటును వ్యతిరేకిస్తూ.. ఆదివాసీలు, మావోయిస్టులు, ప్రజాసంఘాలు పెద్దఎత్తున పోరాటాలు చేశాయి. దీంతో ఆన్‌రాక్‌తో ఏపీఎండీసీ చేసుకున్న బాక్సైట్ ఒప్పందం ఆమోదానికి సంబంధించిన 222, 289 జీవోలను ప్రభుత్వం 2016లో రద్దుచేసింది. ఈ మేరకు జీవో 44 జారీ చేసింది. అలాగే.. ఏపీఎండీసీకి బాక్సైట్ బ్లాక్ లీజుల కేటాయింపును కూడా రద్దుచేస్తూ 2019లో ఉత్తర్వులిచ్చింది. కేంద్ర గనులు, ఖనిజాల నియంత్రణ, అభివృద్ధి చట్టం-2015లోని సవరించిన క్లాజుల ప్రకారం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పరిణామాలపై ఆన్‌రాక్ హైకోర్టుల్లో, తర్వాత సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేసింది. ఎక్కడా ఊరట లభించకపోవడంతో లండన్‌లోని ఆర్బిట్రేషన్ కోర్టులో వాజ్యం దాఖలు చేసింది. ఒప్పందాల రద్దు వల్ల తనకు రూ.2,500 కోట్ల నష్టపరిహారం ఇప్పించాలని కోర్టును కోరింది. దీనిపై మార్చి 26న విచారణ జరుగనుంది.

సీఎంసీ పాలసీతో మళ్లీ కదలిక..

మరోవైపు.. కేంద్రం గనులు, ఖనిజాల రంగంలో సంచలన నిర్ణయం తీసుకుంది. క్రిటికల్ మినరల్స్ పాలసీ (సీఎంసీ)ని ప్రకటించింది అత్యంత అరుదైన ఖనిజాల మైనింగ్‌లో స్వయం సమృద్ధిని సాధించేలా ఈ విధానాన్ని తీసుకొచ్చింది. దీని ప్రకారం అరుదైన ఖనిజాల మైనింగ్ చేపట్టాలని నిర్ణయించింది. అంటే బీచ్‌శాండ్‌తోపాటు బాక్సైట్ కూడా ఇందులో భాగమే. ఈ నేపథ్యంలో గనుల శాఖ రాష్ట్రంలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న బాక్సైట్ మైనింగ్‌ను మళ్లీ తెరపైకి తెచ్చింది. సీఎంసీలో భాగంగా రాష్ట్రంలో బాక్సైట్ మైనింగ్ చేపడితే.. అల్యూమినియం రిఫైనరీల ఏర్పాటుతోపాటు విలువ ఆధారిత పరిశ్రమలు కూడా వస్తాయని.. ఫలితంగా ఏపీకి రూ.1.50 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని జనవరి చివరి వారంలో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా 60 వేల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని కూడా తెలిపింది.

అరకు-చింతపల్లి అటవీ ప్రాంతంలోని 6 బ్లాకుల్లో మైనింగ్ లీజులు నేరుగా గిరిజన ఆదివాసీలు, ప్రభుత్వ రంగ సంస్థల పేరిటే ఇవ్వాలి. అందుచేత తన శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థ ఏపీఎండీసీ పేరిట మైనింగ్ లీజులు ఇప్పించాలని గనుల శాఖ కోరింది. నామినేషన్ పద్ధతిన లేదా వేలం విధానంలో అయినా

ఖనిజాభివృద్ధి సంస్థ పేరిటే లీజులు..

లీజులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపింది. ఏపీఎండీసీకి లీజులు ఇప్పిస్తే మైనింగ్, అల్యూమినియం రిఫైనరీల ఏర్పాటుకు అది డెవలపర్‌ను నియమించుకుంటుందని నివేదికలో పేర్కొంది. అంటే.. మైనింగ్ రంగంలో పేరున్న ప్రైవేటు కంపెనీతో ఒప్పందాలు చేసుకుని డెవలపర్‌గా ఎంపిక చేసుకుంటుంది. ప్రస్తుతం బీచ్‌శాండ్ కాంట్రాక్టుల్లో భాగంగా అదానీ గ్రూపునకు చెందిన 'అల్లూవియల్ హెవీ మినరల్స్' కంపెనీని డెవలపర్‌గా నియమించుకుంది. బీచ్‌శాండ్ మైనింగ్‌లో ఆ కంపెనీకి 90శాతం వాటా ఉండగా.. ఏపీఎండీసీకి 10 శాతమే ఉంది. దీనిపై హైకోర్టులో కేసు నడుస్తోంది. బాక్సైట్ మైనింగ్‌లోనూ డెవలపర్‌ను ఎంపిక చేసుకునే వెసులుబాటు కల్పించాలని గనులశాఖ కోరుతోంది. అయితే లీజుల నిర్ణయాధికారం కేంద్రం పరిధిలో ఉంది. బాక్సైట్ లీజులను ఏపీఎండీసీకి ఇవ్వాలంటే తొలుత రాష్ట్రప్రభుత్వం ఓ విధాన నిర్ణయం తీసుకోవాలి. ఏపీఎండీసీకి లీజులివ్వాలని కోరుతూ కేంద్రానికి సిఫారసు చేయాలి. ఆ తర్వాత కేంద్రమే నిర్ణయం తీసుకుంటుంది. రాష్ట్రప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుని కేంద్రానికి సిఫారసు చేస్తే ఏపీఎండీసీ పేరిట లీజులు మంజూరవడం ఖాయమని అధికార వర్గాలు చెబుతున్నాయి.


బిజినెస్

మేఘా గ్రూప్ కంపెనీలో జేడీ లక్ష్మీ నారాయణ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఐపీఎస్ మాజీ అధికారి, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీ నారాయణ రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. మేఘా ఇంజినీరింగ్ అనుబంధ సంస్థ ఈవీ ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఆపరేషన్స్ విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా చేరారు. ఈ కంపెనీ ఒలెక్ట్రా పేరుతో ఎలక్ట్రిక్ బస్సులు తయారు చేసి దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల రోడ్డు రవాణ సంస్థలకు సరఫరా చేస్తుంది. వైఎస్ఆర్ సీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి కేసు దర్యాప్తుతో జేడీ పేరు దేశవ్యాప్తంగా మార్మోగిపోయింది. ఉద్యోగానికి మధ్యలోనే రాజీనామా చేసి రాజకీయాల్లో ప్రవేశించి 2019లో జనసేన తరపున విశాఖ లోక్‌సభ ఎంపిగా పోటీ పడినా ఆయనకు కలిసి రాలేదు. తర్వాత సొంతంగా పార్టీ పెట్టినా పెద్దగా రాణించలేదు. దీంతో లక్ష్మీ నారాయణ రాజకీయాలకు స్వస్తి చెప్పి కార్పొరేట్ రంగాన్ని ఎంచుకున్నారని భావిస్తున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	525
వరంగల్	522	గోదావరి	515
చిత్తూరు	593	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	115
వరంగల్	115	గుంటూరు	115
కరీంనగర్	115	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	95
కర్నూలు	115	నెల్లూరు	100
విశాఖపట్నం	115	అనంతపురం	100
గోదావరి	115		

25800పైన బుల్లిష్

(ఫిబ్రవరి 16-20 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ: 25471 (-223)

నిఫ్టీ గత వారం 26444-26009 పాయింట్ల మధ్యన కదలాడి 223 పాయింట్ల నష్టంతో 254671 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25800 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25768, 25764, 25547, 25595 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 26800 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 25075
నిరోధ స్థాయిలు: 25675, 25775, 25875 (25575 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 25275, 25175, 25075 (25375 దిగువన బేరిష్)

ఎంట్రీ లెవెల్ ఉద్యోగాలపైనే ఏఐ ప్రభావం



న్యూఢిల్లీ: ఉద్యోగ నియామకాలపై కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఇది అందరూ భయపడేంత భారీ స్థాయిలోగాక పరిమిత స్థాయిలో మాత్రమే కనిపిస్తోందని ఒక నివేదిక తెలిపింది. ఏఐ ముఖ్యంగా జనరేటివ్ ఏఐని ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచే సాధనంగా చూడాలే తప్ప, మానవ సృజనకు ప్రత్యామ్నాయంగా చూడలేమని స్పష్టం చేసింది. ఓపెన్ ఏఐ సంస్థ మద్దతుతో భారత అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల పరిశోధనా మండలి (ఇక్రియెర్) రూపొందించిన నివేదిక ఈ విషయం పేర్కొంది. గత ఏడాది నవంబరు నుంచి ఈ ఏడాది జనవరి వరకు దేశంలోని 10 ప్రధాన నగరాల్లో 650 ఐటీ కంపెనీల నియామకాల తీరుతెన్నులను పరిశీలించి ఈ నివేదిక రూపొందించారు.

నేటి నుంచి ఏఐ ఎక్స్‌పో

దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం నుంచి 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో' ప్రారంభమవుతోంది. స్థానిక భారత్ మండపంలో జరిగే ఈ ఎక్స్‌పోని ప్రధాని మోదీ సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభిస్తారు. దేశ. విదేశాలకు చెందినే పలువురు ప్రముఖులతో పాటు దాదాపు 600 స్టార్టప్ కంపెనీలు ఈ ఎక్స్‌పోలో తమ సరికొత్త ఏఐ టూల్స్‌ను ప్రదర్శించబోతున్నాయి. ఈ నెల 20 వరకు ఈ ఎక్స్‌పో జరుగుతుంది.

నిపుణులకు ఢోకా లేదు

ఈ నివేదిక కోసం సర్వేలో పాల్గొన్న సంస్థల్లో 63% కీలక పనుల కోసం ఏఐని వినియోగిస్తున్నట్టు చెప్పాయి. దీంతో నియామకాలు ముఖ్యంగా ఎంట్రీ లెవల్ ఉద్యోగ నియామకాలు తగ్గినట్టు తెలిపాయి. ఇదే సమయంలో ఏఐ, డేటా నైపుణ్యాలు ఉన్న అభ్యర్థులకు మాత్రం మంచి డిమాండ్ ఏర్పడింది. నియామకాల్లో చోటు చేసుకుంటున్న ఈ మార్పులతో మిడ్, సీనియర్ ఉద్యోగులు కంపెనీలు మారడం బాగా తగ్గిపోయింది. ఏఐ ప్రభావం ఎక్కువగా ఉంటుందని భావించిన సాఫ్ట్‌వేర్ డెవలపర్లు, డేటా బేస్ అడ్మినిస్ట్రేటర్లకు కూడా ఇప్పుడు మంచి డిమాండ్ ఉందని ఆ నివేదిక తెలిపింది.

బంగారం లక్ష దిగేనా?

డాలర్ల చెల్లింపులకు రష్యా సై అనడం కారణమంటున్న పరిశీలకులు

'పెరుగుట విరుగుట కొరకే' అనే సూక్తి బంగారం విషయంలో నిజం కానుందా... పసిడి మార్కెట్ కుప్పకూలనుందా బ్లూమ్‌బర్గ్ వార్తా సంస్థ ప్రచురించిన ఒక కథనం చూస్తుంటే అవుననే అనిపిస్తోంది. తన అంతర్జాతీయ వాణిజ్య లావాదేవీల సెటిల్‌మెంట్లు డాలర్లలో నిర్వహించేందుకు రష్యా సిద్ధమవుతున్నట్టు బ్లూమ్‌బర్గ్ ఒక వార్తా కథనం ప్రచురించింది. ఇలాంటి కథనాలపై వెంటనే స్పందించే రష్యా, ఈ కథనంపై పూర్తి మౌనం పాటిస్తోంది. దీంతో అంతర్జాతీయ పరిశీలకులు సైతం బహుశా ఇది నిజమే కావచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో పసిడి ధర పతనానికి ఇదే ప్రధాన కారణమనే వాదన సైతం వినిపిస్తోంది.

గత నెల చివర్లో ఒక దశలో మల్టీ కమోడిటీస్ ఎక్స్ఛేంజిలో (ఎంసీఎక్స్) రూ.1,80,779కి చేరిన 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) గత శుక్రవారం రూ.1,56,200 వద్ద ముగిసింది. బ్లూమ్‌బర్గ్ వార్తా కథనం నిజమైతే ఫ్యూచర్ మార్కెట్లతో పాటు, స్పాట్ మార్కెట్‌లోనూ పసిడి ధరల భారీ పతనం తప్పదని మార్కెట్ వర్గాల అంచనా. 'మన దేశంలో పసిడి ధర ఇప్పటికే 15% తగ్గింది. రష్యా డాలర్ల సెటిల్‌మెంట్‌కు ఒప్పుకోవడం నిజమైతే ముందుగా గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో భారీ అమ్మకాలు పోటెత్తుతాయి. ఆ ప్రభావం ఫిజికల్ గోల్డ్ ధరలపై పడి వచ్చే ఏడాది చివరికి దేశంలో 10 గ్రాముల పసిడి ధర రూ.లక్ష దిగువకు వచ్చే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ పసిడి ధర అప్పటికి 3,000 డాలర్లకు తగ్గవచ్చు' అని బ్రోకరేజి సంస్థ పేస్ 360 చీఫ్ గ్లోబల్ స్ట్రాటజిస్ట్ అమిత్ గోయల్ అంచనా.

ప్రపంచ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు

ప్రపంచ మార్కెట్ల నుంచి వరుసగా ప్రతికూల సంకేతాలు వస్తున్న కారణంగా దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారంలోనూ ఆటుపోట్లకు లోనయ్యే అవకాశముంది. అమెరికా, జపాన్ దేశాల్లో బాండ్ రాబడులు పెరగడం, పశ్చిమాసియా ఉద్రిక్తతలు, యుద్ధ వాతావరణం, ఐటీ షేర్లు కుప్పకూలడం వంటివి కీలకంగా మారాయి. క్రితం వారం ఐటీ సూచీ ఏకంగా 8% పతనమైంది. మీడియా, పీఎస్‌యూ బ్యాంకులు, ఆటో, హెల్త్‌కేర్ సూచీలు రాణించాయి. మదుపరులు ఎంపిక చేసిన స్టాక్స్‌లోనే పెట్టుబడులు పెట్టాలి.

స్టాక్ రికమెండేషన్స్

టెక్ మహీంద్రా: స్వల్ప పుల్‌బ్యాక్ తర్వాత మంచి మూమెంటమ్ ప్రదర్శించిన ఈ కౌంటర్‌లో రూ.1830 వద్ద నిరోధం ఎదురైంది. ఐటీ సూచీ పతనం ప్రభావం దీనిపై పడింది. అయితే క్రితం సెషన్లో మెరుగ్గా రాణించి రూ.1534 వద్ద ముగిసింది. ఇన్వెస్టర్లు రూ. 1650/1720 టార్గెట్ ధరతో రూ.1500 శ్రేణిలో పొజిషన్ తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.1470.

బజాజ్ ఫైనాన్స్: జీవితకాల గరిష్ఠం తర్వాత ఈ షేర్లలో 20% మేర దిద్దుబాటు జరిగింది. కీలక స్థాయి రూ.932 వద్ద మద్దతు తీసుకుని మళ్లీ అప్‌ట్రెండ్ బాట పట్టింది. నిఫ్టీతో పోలిస్తే మెరుగ్గా కనిపిస్తోంది. చివరి పది సెషన్లలోనే 16% రాబడినిచ్చింది. గత శుక్రవారం రూ.1024 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.1100 టార్గెట్ ధరతో రూ.980పై స్థాయిలో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ : రూ.960.

యూబీఎల్: జీవితకాల గరిష్ఠ స్థాయి నుంచి 38% దిద్దుబాటుకు లోనైన ఈ షేర్లు ప్రస్తుతం దూకుడు ప్రదర్శిస్తున్నాయి. నిఫ్టీతో పోలిస్తే మెరుగ్గా రాణిస్తున్నాయి. రిలేటివ్ స్ట్రెంత్, వాల్యూమ్ అనూహ్యంగా పుంజుకున్నాయి. చివరి 13 సెషన్లలో 18% మేర రాబడినందించాయి. గత శుక్రవారం రూ.1628 ముగిసిన ఈ కౌంటర్లో రూ.1680 టార్గెట్ ధరతో రూ.1600 శ్రేణిలో పొజిషన్ తీసుకోవాలి. స్టాప్‌లాస్ : రూ.1575.

బయోకాన్: కొన్ని నెలలుగా ఈ షేర్లు పరిమిత పరిధిలోనే కదలాడుతున్నాయి. ప్రస్తుతం ట్రయాంగిల్ పాటర్న్ ఏర్పడింది. ఫలితాలు విడుదలవడంతో ఇన్వెస్టర్ల ఆసక్తి పెరిగింది. రిలేటివ్ స్ట్రెంత్ మెరుగ్గా ఉంది. క్రితం సెషన్లో రూ.377 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.415/425 టార్గెట్ ధరతో రూ.370 శ్రేణిలో కొనుగోలు చేయాలి. స్టాప్‌లాస్ : రూ.350.

టొరెంట్ ఫార్మా: జీవితకాల గరిష్ఠ స్థాయి నుంచి 40% పతనమైన ఈ షేర్లు ప్రస్తుతం టర్న్ అరౌండ్ అయ్యాయి. తిరిగి అప్‌ట్రెండ్ బాటపట్టాయి. చివరి మూడు నెలల్లో 20% మేర రాణించాయి. రిలేటివ్ స్ట్రెంత్ మెరుగవుతోంది. గత శుక్రవారం రూ.1462 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో రూ.1600 టార్గెట్ ధరతో రూ.1460 వద్ద పొజిషన్ తీసుకోవచ్చు.
స్టాప్‌లాస్ : రూ.1430.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ

25500 పైన నిలదొక్కుకోవడం కీలకం

గత వారం నిఫ్టీ మానసిక అవధి 26,000 వరకు వెళ్లినా నిలదొక్కుకోవడంలో విఫలం కావడమే కాకుండా అంత కన్నా దిగువనే ముగిసింది. ఇది అప్రమత్త సంకేతం. చివరి రెండు రోజుల్లో 500 పాయింట్ల మేరకు కరెక్షన్ సాధించి వారం మొత్తం మీద 220 పాయింట్ల నష్టంతో 25,470 వద్ద ముగిసింది. నిఫ్టీ ప్రస్తుతం ఇటీవల నమోదైన గరిష్ఠ స్థాయి 26,500, కనిష్ఠ స్థాయి 24,500 మధ్యన నిలిచి ఉంది. ఇది అనిశ్చిత ధోరణికి సంకేతం. సుమారు గత ఏడాది కాలం నుంచి ప్రధాన సైడ్‌వేస్ ధోరణిలో ట్రేడవుతున్న నిఫ్టీ ప్రధాన దిశ తీసుకునేందుకు ప్రస్తుతం సమాయత్తం అవుతోంది. ప్రపంచ మార్కెట్ల ట్రెండ్ ఆధారంగా ఈ వారం మార్కెట్ పాజిటివ్‌గా ప్రారంభమై కీలక స్థాయి 25,500 వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ ప్రస్తుతం 25,500 వద్ద నిలిచి ఉంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి. మైనర్ నిరోధ స్థాయి 25,650. ఆ పైన 25,800. ప్రధాన స్వల్పకాలిక నిరోధం 26,000.

బేరిష్ స్థాయిలు: భద్రత కోసం మార్కెట్ 25,500 వద్ద నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే బలహీనపడుతుంది.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25580, 25650
మద్దతు	25500, 25410



వి. సుందర్ రాజా

ప్రధాన మద్దతు స్థాయిలు 25300, 25000. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశిస్తుంది.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం 61,000 నుంచి రియాక్షన్ సాధించిన ఈ సూచీ 60,200 వద్ద వారానికి ముగిసింది. జీవితకాల గరిష్ఠ స్థాయిల వద్ద నిలకడగా ఉంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం నిరోధ స్థాయి 60,600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. బలంగా కనిపిస్తున్న ప్రధాన నిరోధం 61,000. ప్రధాన మద్దతు స్థాయిలు 59600, 59000.


పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం 100, 200 డీఎంఏల వద్ద మరో పరీక్ష ఎదుర్కొనవచ్చు. సానుకూలత కోసం ఈ స్థాయిల కన్నా పైన నిలదొక్కుకోవాలి. అలాగే 25,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవడం కీలకం.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్స్ ఉండవచ్చు.

ఎన్టీఆర్ ట్రస్ట్‌కు చంద్రబాబు శుభాభినందనలు

» 30 ఏట అడుగుపెట్టిన ట్రస్ట్

» భువనేశ్వరి సమర్థ సేవలకు అభినందనలు: సీఎం చంద్రబాబు



అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకులు, తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం నిరంతరం పరితపించిన మహనీయుడు, అధికారం అంటే పేదలకు సేవ అని భావించిన నాయకుడు ఎన్టీఆర్ ఆశయాలను, సేవలను కొనసాగించేలా ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ప్రస్థానం సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ట్రస్ట్ స్థాపించి ఫిబ్రవరి 15తో 29 సంవత్సరాలు పూర్తి చేసుకుని, 30వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ట్రస్ట్ తరఫున సేవలందిస్తున్న వారికి సీఎం శుభాకాంక్షలు తెలిపారు. విద్య, వైద్యం, రక్తదానం, విపత్తుల్లో సాయం వంటి కార్యక్రమాలతో ట్రస్ట్ సమాజంపై తిరుగులేని ముద్ర వేసిందన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్త చిన్నారులకు నిరంతరం సేవలందించడంలో ఎన్టీఆర్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అసామాన్యం అన్నారు. అత్యంత సమర్థవంతమైన సేవలు అందిస్తున్న సంస్థగా ట్రస్ట్‌ను నడుపుతున్న ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరికి, వారి బృందానికి అభినందనలు తెలిపారు.

వలిని త్వరలోనే కలుస్తా.. కోవా బన్ రుచి చూస్తా..!

» కోవా బన్ వ్యాపారికి మద్దతుగా మంత్రి లోకేశ్ పోస్టు



బన్ వ్యాపారి వలీ

అమరావతి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన కోవా బన్ వ్యాపారి వలీకి మంత్రి లోకేశ్ మద్దతుగా నిలిచారు. త్వరలోనే ఆయనను కలిసి, కోవా బన్ రుచి చూస్తానని 'ఎక్స్' వేదికగా తెలియజేశారు. 'డియర్ వలీ.. మీరు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవాల్సి రావడం బాధ కలిగించింది. సామరస్యం, పరస్పర గౌరవం, సోదరభావం కోసం ఎల్లప్పుడూ నిలబడే మన తెలుగు సమాజంలో ఇటువంటి విభజన, మతపరమైన ప్రవర్తనకు చోటు లేదు. నేను త్వరలోనే మిమ్మల్ని కలుస్తాను. మీరు తయారు చేసే కోవా బన్‌ను రుచి చూసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. మేం మీకు అండగా నిలబడతాం' అని లోకేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. కర్నూలు చెందిన చిరు వ్యాపారి వలీ.. ఇటీవల మేడారం జాతరలో కోవా బన్‌లు అమ్ముతుండగా.. ఓ యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు అతని వద్దకు వెళ్లి కోవా బన్ నాణ్యతపై ప్రశ్నించాడు. ఏదో కల్తీ చేసి ఉంటా వంటూ అనుమానాలు వ్యక్తం చేశాడు. ఆధార్ కార్డు చూపించాలని, పేరు చెప్పాలని ఒత్తిడి చేస్తూ.. ఆ చిరు వ్యాపారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించాడు. తాను అమ్మే బన్ నాణ్యమైనదేనని నిరూపించుకోవడానికి.. ఆ చిరు వ్యాపారి నిస్సహాయ స్థితిలోనే దాన్ని తిని చూపించాల్సి వచ్చింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కోవా బన్ వ్యాపారికి రాజకీయ పార్టీల నుంచి కూడా మద్దతు లభిస్తోంది.

ఉత్తరాంధ్ర భవిష్యత్తుకు బలమైన బడ్జెట్: శిరీష



అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పలాస, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాలకు తాగు, సాగునీరు అందించే మహేంద్ర తనయ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేసేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారని చెప్పారు. నీతీ ఆయోగ్ సహకారంతో విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్‌కు ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించారని, దీని ద్వారా శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకు సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.

పేదరిక నిర్మూలనకు రూ.1,876 కోట్లు

» గతేడాది కంటే రూ.143 కోట్లు అధికం: మంత్రి కొండపల్లి

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేదరిక నిర్మూలన కార్యక్రమం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.1,876 కోట్లు కేటాయించిందని ఆ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది రూ.143 కోట్లు అధికం అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల సాధికారత, గ్రామీణ జీవనోపాదుల పురోగతిపై రాష్ట్ర ప్రభుత్వ ధృడ సంకల్పాన్ని ఇది ప్రతిబింబిస్తోందన్నారు. సీఎం చంద్రబాబు ప్రకటించిన కుటుంబానికో పారిశ్రామికవేత్త మహత్తర లక్ష్య సాధనలో భాగంగా సుమారు ఐదు లక్షల మంది మహిళలను ఔత్సాహికులుగా తీర్చిదిద్దడం, రైతు ఉత్పత్తి సంస్థలను బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత శక్తివంతం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

నేటి నుంచి సహకార ఉద్యోగుల సమ్మె

విజయవాడ(గాంధీనగర్), ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు సోమవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నారు. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురామ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు డిసెంబరు 5 నుంచి దశలవారీ ఆందోళనలు చేపట్టామని, యాజమాన్యం, ప్రభుత్వం నుంచి దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ రాకపోవడంతో సమ్మెకు దిగుతున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,051 సహకార సంఘాల్లోని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. సానుకూల స్పందన రాకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామన్నారు.

అమెరికాలో బెంగళూరు విద్యార్థి మృతదేహం లభ్యం



సాకేత్ శ్రీనివాసయ్య

బెంగళూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అమెరికాలో వారం క్రితం కనిపించకుండా పోయిన బెంగళూరు విద్యార్థి సాకేత్ శ్రీనివాసయ్య(22) మృతదేహం లభించింది. బర్కిలీలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో సాకేత్ కెమికల్ అండ్ బయోమాలిక్యులర్ ఇంజనీరింగ్ పీజీ చదువుతున్నారు. ఈ నెల 9న క్యాంపస్ నుంచి కిలోమీటరు దూరంలో చివరిసారిగా కనిపించిన తర్వాత అతని ఆచూకీ లేకుండా పోయింది. పార్క్ హిల్స్ ప్రాంతంలోని అతని నివాసం సమీపంలో సాకేత్ పాస్‌పోర్ట్, ల్యాప్‌టాప్ ఉన్న బ్యాగ్‌ను పోలీసులు గుర్తించారు. చెరువు ఒడ్డున అతని దుస్తులు, చెప్పులు, వ్యక్తిగత వస్తువులు లభించినట్టు తెలుస్తోంది. దీంతో గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు అతని మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత రాయబార కార్యాలయం ధ్రువీకరించింది. సాకేత్ మృతిపై తీవ్ర విచారం వ్యక్తం చేసింది. మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది. ఈ క్లిష్ట సమయంలో సాకేత్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని శనివారం 'ఎక్స్'లో చేసిన పోస్టులో పేర్కొంది. ఐఐటీ మద్రాస్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన సాకేత్.. హైపర్‌లూప్ టెక్నాలజీకి సంబంధించి పేటెంట్‌లో భాగస్వామి అయ్యారు. కాగా, సాకేత్ మరణం ప్రమాదమా.. లేక మానసిక ఒత్తిడితో బలవన్మరణానికి పాల్పడ్డాడా అనేది తేలాల్సి ఉంది.



రాప్తాడు మండలం టీటీడీసీ శిక్షణ కేంద్రం ప్రాంగణంలో చెట్ల కింద వదిలేసిన వందల టన్నుల స్టీలు

ఉక్కు.. తుక్కు!

(మొదటి పేజీ తరువాయి)

దండుకున్నట్టు విజిలెన్స్ విచారణలో బయటపడింది. 2022లో స్టీల్ కొనుగోలుకు సంబంధించి కంపెనీలకు మార్కెట్ ధరకు మించి రూ.10.28 కోట్లు దోచిపెట్టినట్టు వెల్లడైంది. పేదల ఇళ్ల నిర్మాణం కోసం 'సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్' విధానంలో భారీగా సేకరించిన సిమెంటు కొనుగోలులో నాటి సీఎం జగన్ సొంత కంపెనీ 'భారతి సిమెంట్స్'కు లబ్ధి చేకూర్చిన సంగతి తెలిసిందే. అర్హతకు మించి మూడు రెట్లు ఎక్కువ ఆర్డర్లు ఇచ్చి దాదాపు రూ.165 కోట్లు చెల్లించిన విషయం విజిలెన్స్ విచారణలో తేలింది. అదే తరహాలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా భారీస్థాయిలో సేకరించిన స్టీల్, ఇతర మెటీరియల్స్ కొనుగోలు వ్యవహారంలోనూ జరిగిన భారీ అవినీతి తాజాగా వెలుగులోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ డబ్బులతో పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తామని ప్రగల్భాలు పలికిన జగన్ ఆ పేదలను మోసం చేశారు.

కమీషన్ల కక్కుర్తితో..

రాష్ట్రంలో పేదలకు పక్కా గృహాలు నిర్మించడం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు చొప్పున సబ్సిడీ ఇస్తోంది. ఆ డబ్బులతో లబ్ధిదారులు సొంతంగా ఇళ్లు నిర్మించుకోవచ్చు. కానీ ఈ మొత్తంతో ఇళ్లు కట్టుకోలేని పేదలకు రాష్ట్ర ప్రభుత్వమే మూడో ఆప్షన్ కింద నిర్మించి ఇస్తుందని గత ప్రభుత్వంలో జగన్ గొప్పలు చెప్పారు. ఆయన మాటలను నమ్మి రాష్ట్రవ్యాప్తంగా 3.51 లక్షల మంది ఆప్షన్-3ని ఎంపిక చేసుకున్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.వేల కోట్ల నిధులను కొట్టేసేందుకు వైసీపీ పెద్దలు కుట్ర పన్నారు. ఆప్షన్-3 ఇళ్లను రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ద్వారా కట్టించకుండా సొంత మనుషులకే కాంట్రాక్టులు ఇప్పించారు. కాంట్రాక్టర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులు కుమ్మక్కై కోట్లాది రూపాయలను ఎడాపెడా లూఠీ చేసేశారు. నిర్మాణాలు చేయకముందే బిల్లులు చెల్లించారు. లబ్ధిదారులకు తెలియకుండా, వారి ప్రమేయం లేకుండానే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణ కోసం స్టీలు, ఇతర మెటీరియల్ కొనుగోలు చేశారు. హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా లక్షలాది టన్నుల ఇనుము (స్టీలు), ఇతర గృహోపకరణాల సామగ్రి (అదర్ మెటీరియల్స్) వివిధ కంపెనీల ద్వారా కొన్నారు. మార్కెట్ ధరల కంటే తక్కువకే పేదల ఇళ్లకు స్టీల్‌ను సరఫరా చేయడం కోసం సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని అనుసరించినట్లు పైకి చెప్పారు. అయితే ప్రభుత్వం నిర్దేశించిన రేట్ల కంటే ఎక్కువ ధరలకు హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు స్టీల్ కొనుగోలు చేసి ప్రభుత్వ నిధులను దోచిపెట్టారు. ఆయా కంపెనీల నుంచి భారీ మొత్తాల్లో కమీషన్లు దండుకున్నారు. 2022లో రెండో దశ (సెకండ్ స్పెల్)లో 12 కంపెనీల నుంచి మొత్తం 1,91,812 టన్నుల స్టీల్ కొనుగోలు చేసి రూ.1300 కోట్ల బిల్లులు చెల్లించారు. మార్కెట్ రేట్ల కంటే ఏకంగా రూ.10.28 కోట్లు అదనంగా చెల్లించినట్లు విజిలెన్స్ నిగ్గు తేల్చింది. ఈ మేరకు ప్రభుత్వానికి నష్టం వాటిల్లిందని నివేదికలో పేర్కొంది.

ఇతర మెటీరియల్ కొనుగోలులోనూ అవినీతి

ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్, స్టీల్‌తో పాటు ఇనుప వాకిళ్లు, తలుపులు, విండో ఫ్రేమ్‌లు, శానిటరీ, ఎలక్ట్రికల్ పరికరాలు, రంగులు, వాటర్ ట్యాంకులు తదితర నిర్మాణ సామగ్రి కొనుగోలులోనూ భారీ అవినీతి జరిగింది. లబ్ధిదారుల ప్రమేయం లేకుండానే హౌసింగ్ అధికారులు మార్కెట్ రేటు కన్నా ఎక్కువ ధరలకు ఒకేసారి కొనుగోలు చేసేసి గోడౌన్లలో డంప్ చేసేశారు. కొన్ని జిల్లాల్లో హౌసింగ్ ఏఈలు, డీఈఈలు వద్దన్నా జిల్లాల హౌసింగ్ హెడ్స్ ద్వారా ఒత్తిడి తీసుకువచ్చి వారి నుంచి బలవంతంగా రిక్వెస్ట్ లెటర్స్ తీసుకుని మరీ భారీస్థాయిలో నిర్మాణ సామగ్రిని కొనుగోలు చేశారు. 2021 జనవరిలో స్టీల్‌తో సహా 13 రకాల నిర్మాణ సామగ్రి కొనుగోలుకు కాంట్రాక్టు సంస్థల నుంచి సరైన స్పందన రాకపోవడంతో.. నిబంధనలను సవరించి మళ్లీ టెండర్లు పిలిచారు. అప్పుడు వివిధ రాష్ట్రాల నుంచి 10 సంస్థలు ముందుకు వచ్చాయి. వాటికి టెండర్లు ఖరారు చేయడానికి ముందే ఆయా సంస్థల నుంచి అప్పటి హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు భారీ మొత్తాల్లో కమీషన్లు దండుకున్నారు. ఆయా కంపెనీల నుంచి ఒక్కో ఇంటికి రూ.లక్షకు పైగా విలువ చేసే సామగ్రిని ఒకేసారి రూ.350 కోట్లు పెట్టి కొన్నారు. అన్ని జిల్లాలు, మండల కేంద్రాల్లోని గోడౌన్లలోకి డంప్ చేసేశారు. మార్కెట్ రేట్ల కంటే ఎక్కువ ధరలకు కొనుగోలు చేసిన ఆ వస్తువులు అత్యంత నాసిరకంగా ఉన్నాయి.

గోదాముల్లోని సిమెంట్, మెటీరియల్ మాయం

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గోదాముల్లో, బయట నిల్వ చేసిన స్టీల్, ఇతర మెటీరియల్స్‌లో కాస్తో కూస్తో పనికొస్తాయనుకున్న సామగ్రిని క్షేత్రస్థాయిలోని హౌసింగ్ అధికారులే పక్కదారి పట్టించారు. అమ్మేసుకుని సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాటికి సంబంధించి ఆన్‌లైన్‌లో చూపిస్తున్న నిల్వలకు, ప్రస్తుతం గోదాముల్లో ఉన్న నిల్వలకు మధ్య భారీ వ్యత్యాసాన్ని విజిలెన్స్ గుర్తించింది. గోడౌన్లలో దింపిన సిమెంట్ స్టాకు రికార్డులను సరిగా నిర్వహించ లేదు. లబ్ధిదారులకు ఇచ్చినట్లు చూపుతున్న సిమెంటుకు స్టాక్ రిజిస్టర్లలో లబ్ధిదారుల అక్నాలెడ్జిమెంట్లు లేవు. వాటికి రసీదులు, వే బిల్లులు, కూపన్ల స్టాక్ ఫైల్స్ గోడౌన్ల ఇన్‌చార్జిల దగ్గర లేవు. హౌసింగ్ అధికారులు గోడౌన్ల నిర్వహణపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో రూ.వందల కోట్ల మెటీరియల్ పనికి రాకుండా పోయింది.

తుప్పుపట్టిన 16 వేల టన్నుల స్టీల్

జగన్ హయాంలో సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో పెద్దఎత్తున కొనుగోలు చేసిన స్టీల్‌ను రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు తరలించారు. ఆ స్టీల్‌ను భద్రంగా దాచడానికి గోడౌన్లలో ఖాళీ లేకపోవడంతో దాదాపు అన్నిచోట్లా ఆరు బయటే వదిలేశారు. ఈ స్టీల్ భద్రత గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో చాలావరకు పక్కదారి పట్టింది. మిగిలి ఉన్న స్టీల్‌ను పేదల ఇళ్లకు వినియోగించకపోవడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పు పట్టిపోయింది. చివరికి పనికి రాకుండా పోయింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కలిపి 16 వేల టన్నులకు పైగా స్టీల్ ఎందుకూ పనికి రాకుండా పోయింది. దాని విలువ ఎంత తక్కువ వేసుకున్నా దాదాపు రూ.100 కోట్లు ఉంటుందని అంచనా. తుప్పు పట్టి వినియోగానికి పనికిరాకుండా పోయిన ఈ స్టీల్‌ను ఏం చేయాలో పాలుపోక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

సెంటు ఇల్లు.. 1.12 లక్షల సామగ్రి

ప్రభుత్వం ఒక సెంటు స్థలంలో నిర్మించే చిన్న ఇంటికి ఎలక్ట్రికల్ పరికరాలకే రూ.5,730, ఫ్లష్ డోర్ షట్టర్లకు రూ.6,920, జీఐ విండో ఫ్రేములకు రూ.7,276, ఎంఎస్ డోర్ ఫ్రేములకు రూ.2,982, ఎంఎస్ యాంగిల్ ఫ్రేములకు రూ.6,709, 200 లీటర్ల డబుల్ లేయర్ పీవీసీ వాటర్ ట్యాంక్‌కు రూ.3,090, పీవీసీ టాయిలెట్ డోర్ ఫ్రేములకు రూ.2,640లు వెచ్చించారు. ఇలా ఒక్కో ఇంటికి మొత్తం రూ.1,12,117 పెట్టి సామగ్రి కొనుగోలు చేశారు. ఆ నాసిరకపు నిర్మాణ సామగ్రి నాలుగేళ్లుగా గోడౌన్లలో పడి ఉండటంతో ఇప్పుడు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి.

కేంద్రం పరిశీలనకు బీసీ బిల్లు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదించిన చట్టానికి బీసీ నేతలు, నిపుణులతో చర్చించి, మంత్రివర్గ ఉపసంఘం నియమించి ముసాయిదా సిద్ధం చేసింది. బీసీలపై దాడులకు పాల్పడితే ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధించేలా నిబంధనలు రూపొందించింది. ప్రస్తుతం న్యాయశాఖ పరిశీలనలో ఉన్న ముసాయిదాను అక్కడినుంచి క్యాబినెట్ ముందుకు, ఆ తర్వాత అసెంబ్లీ ఆమోదానికి పంపాలని భావించారు. అయితే న్యాయకోవిదుల సూచనల మేరకు బిల్లును ఢిల్లీలోని జాతీయ బీసీ కమిషన్ పంపి, పరిశీలన అనంతరం అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బీసీ రక్షణచట్టం మన రాష్ట్రంలోనే మొదటిసారి తీసుకొస్తుండటంతో ఈ చట్టం రూపకల్పనపై ఉన్న అడ్డంకులను అధిగమించేందుకు మరికొంత సమయం తీసుకోవాలని యోచిస్తున్నారు. దీంతో అసెంబ్లీలో చట్టం చేసేముందు జాతీయ బీసీ కమిషన్‌కు ముసాయిదాను పంపి, వారి సూచనలు, సలహాలతో చట్టం చేయాలని నిర్ణయించారు. తాజా అసెంబ్లీ సమావేశాల్లో పనిదినాలు తక్కువగా ఉండటంతో ఈలోపు జాతీయ బీసీ కమిషన్ నుంచి ముసాయిదా పరిశీలన పూర్తయి రావడం కుదరదని భావిస్తున్నారు. దీంతో వచ్చే సమావేశాల్లోనో లేదా ఆర్డినెన్స్ ద్వారానో చట్టం చేసే అవకాశముంది. తాజా అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లు ప్రవేశపెట్టే అవకాశం లేదని పేర్కొంటున్నారు. ఈచట్టం శిక్షలకు సంబంధించినది. ఈ అంశం రాజ్యాంగంలో ఉమ్మడి జాబితాలో ఉన్నందున కేంద్రం అనుమతి అవసరం.

ప్రతి జిల్లాలో ప్రత్యేక కోర్టులు

బీసీల రక్షణ చట్టం ముసాయిదాను ఇప్పటికే బీసీ కమిషన్ అధికారులు సిద్ధం చేశారు. బీసీలపై సామాజిక బహిష్కరణ, దాడులు, దూషణలు, వేధింపులు, ఇతర అఘాయిత్యాలకు పాల్పడితే ఆర్నెల్ల నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధించనున్నారు. రెండోసారి అదే నేరానికి పాల్పడితే ఏడాది నుంచి రెండేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. ఈ శిక్షను న్యాయస్థానం మరింత పెంచే వీలుంది. బీసీలపై వేధింపులకు సంబంధించిన కేసుల్లో ముందస్తు బెయిల్ పొందేందుకు అవకాశం ఉండదు. కేసుల విచారణకు ప్రతి జిల్లాలో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసేలా ముసాయిదాలో పేర్కొన్నారు. అవసరమైతే సెషన్స్ కోర్టును ప్రత్యేక న్యాయస్థానంగా నియమించనున్నారు. చార్జిషీట్ దాఖలు నుంచి రెండు నెలల్లోనే కేసు పరిష్కరించే లక్ష్యంగా రూపొందించారు. ప్రత్యేక కోర్టులో న్యాయం జరగలేదని భావిస్తే, తీర్పు వెలువడిన 90 రోజుల్లో బాధితులు హైకోర్టును ఆశ్రయించవచ్చు. గరిష్ఠంగా 180 రోజుల వరకు అవకాశం కల్పించారు. బీసీ వ్యక్తులపై అభియోగాలు వచ్చినప్పుడు, ఆ వ్యక్తికి మరణదండన లేదా జీవితఖైదు శిక్షపడేలా ఉద్దేశపూర్వకంగా తప్పుడు సాక్ష్యం సృష్టించిన వారికి జీవితఖైదుతో పాటు జరిమానా విధిస్తారు. చార్జిషీట్ దాఖలు, విచారణ ప్రక్రియలో ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసిన ఏ ప్రభుత్వ ఉద్యోగికైనా ఆర్నెల్ల నుంచి గరిష్ఠంగా సంవత్సరం పాటు జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. కేసుల విచారణ సందర్భంగా బాధితులు, సాక్షులకు ప్రభుత్వం రక్షణ కలిస్తుంది. ప్రయాణం, పోషణ ఖర్చులు కూడా అందిస్తుంది.

బీసీ అట్రాసిటీ అంటే..

బీసీలను భయపెట్టడం, బహిరంగంగా అవమానించడం, కులం పేరుతో అవమానకర పదాలు లేదా సంకేతాలతో అవమానించడం, తక్కువ చేయడం. ఆర్థిక వ్యవహారాలు, వ్యాపారాలు, ఉపాధి, సేవలను నిరాకరించడం, సామాజిక బహిష్కరణకు గురిచేయడం, ప్రజాసేవల్లో వివక్ష అంటే.. విద్య, ఆరోగ్యం, ప్రజావనరులు, గృహవసతి కల్పనకు, ప్రభుత్వ ఉద్యోగాలకు కులం ఆధారంగా నిరాకరించడం వంటివి బీసీ అట్రాసిటీగా పేర్కొన్నారు. చట్టబద్ధ అధికారం లేదా పరిహారం లేకుండా నివాసం/భూమి నుంచి బలవంతంగా పంపడం, ప్రభుత్వ సేవలు, పథకాలు అందకుండా అడ్డుకోవడం, దాడి చేయడం లేదా శారీరక గాయం కలిగించడం, లైంగిక వేధింపులు, దాడులు చేయడం, మహిళలపై లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడటం, హాని చేసే ఉద్దేశంతో తప్పుడు కేసులు పెట్టడం, భూమి, పంటలు, పశువులు తదితరాలు ఆక్రమించడం, నివాసం, జీవనోపాధి, పంటలు దెబ్బతీయడం, మత సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనకుండా అడ్డుకోవడం కూడా అట్రాసిటీనే. అదేవిధంగా బహిరంగ ప్రదేశాల్లో బీసీలకు అడ్డంకులు సృష్టించడం, రహదారులు, బావులు, ఘాట్లు, శ్మశానాలు, ఆలయాలు వంటి ప్రదేశాల వినియోగాన్ని నిరోధించడం, అక్కడికి ప్రవేశాన్ని అడ్డుకోవడం కూడా నేరంగా భావిస్తారు.

కార్యకర్త కష్టాన్ని గుర్తిద్దాం

» పార్టీకి లక్షల మెదళ్లను కదిలించేవాళ్లు కావాలి

» జనసేన పార్టీ భావజాలం చాలా బలమైనది

» అందుకే తమిళనాడు, కర్ణాటక నుంచి ఆహ్వానం

» జనసేన రాష్ట్రానికో, ప్రాంతానికో పరిమితం కాదు

» యువశక్తి అనే ఇంధనం మీదే పార్టీ నడుస్తోంది

» పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రారంభం

» రూ.2 కోట్లు విరాళం అందించిన అధినేత పవన్



మంత్రి మనోహర్‌కు రూ.2కోట్ల విరాళం చెక్కు అందిస్తున్న పవన్

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): 'పార్టీలో నాయకుడిగా ఎదగాలనుకొనేవారు క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్త కష్టాన్ని గుర్తించాలి. పార్టీ ఉన్నతి కోసం ఉద్యమి, సాధక్, ప్రదాతగా మారి పనిచేయాలి. అప్పుడే వారు సంపూర్ణ నాయకులుగా ఎదుగుతారు' అని డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మహా శివరాత్రి సందర్భంగా ఆదివారం ఉదయం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పార్టీ తొలి సభ్యత్వం తీసుకున్న ఆయన కార్యకర్తల బీమా కోసం రూ.2 కోట్ల విరాళం చెక్కును పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, మంత్రి మనోహర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ జనసేన ఐదో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 26 నుంచి మొదలవుతుందని, పిఠాపురం నియోజకవర్గంలో మాత్రం ఒకవారం ముందు నుంచే ప్రారంభమవుతుందని పవన్ తెలిపారు. 'ఏ వ్యవస్థ అయినా మనుగడ సాధించాలంటే నిబద్ధత, నిజాయతీ కలిగిన నాయకత్వం చాలా అవసరం. జనసేన పార్టీకి వందలు, వేల మంది అవసరం లేదు. లక్షల మెదళ్లను కదిలించే వాళ్లు కావాలి. అలాంటివాళ్లు పది మంది ఉన్నా ఈ సమాజంలో మార్పు తీసుకురావచ్చు. జనసేన పార్టీ భావజాలం చాలా బలమైనది. 21వ శతాబ్దానికి ఇది రైట్ ఐడియాలజీ. ఈరోజు మనల్ని తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రకు ఆహ్వానించడానికి కారణం మన భావజాలమే. ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను కాపాడేవారికి సముచిత స్థానం కల్పించాలి. ఇందులో కులం, మతం, ప్రాంతాలను పక్కనపెట్టాలి. పార్టీ భావజాలాన్ని లోతుగా అర్థం చేసుకుని, పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పని చేసేందుకు ముందుకొచ్చి పార్టీ సభ్యత్వం తీసుకునే వారిని ఉద్యమిగా పిలుస్తాం. జనసైనికుడికి, పార్టీ నాయకులకు మధ్య సమన్వయకర్తగా, పార్టీ పోరాటానికి మరింత బలాన్ని అందించి, కొత్త రక్తాన్ని తీసుకొచ్చి, సభ్యత్వ నమోదు చేయించే వారిని సాధక్‌గా, జనసేన చేస్తున్న ప్రజా, రాజకీయ పోరాటానికి పరోక్షంగా తమ వంతు సమయాన్ని, ఆర్థిక, సాంకేతిక, సేవా, మేధో సహాయ సహకారాలు అందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసేవారిని ప్రదాతగా వ్యవహరిస్తాం' అని పవన్ పేర్కొన్నారు. ఇకనుంచి పార్టీ క్రియాశీలక సభ్యత్వాన్ని ఉద్యమి మెంబర్ షిప్‌గా ప్రకటిస్తున్నామని తెలిపారు.

ఒక ప్రాంతానికి పరిమితమవ్వం

'మొన్న జరిగిన తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో నేను వెళ్లి ప్రచారం చేయకపోయినా, ఎన్నికల్లో పార్టీ నిలబడాలి, మన గళం తెలంగాణలో వినిపించాలనే ఆకాంక్షతో పోటీ చేసిన రెండు స్థానాల్లో గెలుపొందారు. అది చిన్న గెలుపే కావచ్చు.. కానీ అది మార్పునకు బలమైన సంకేతం. జనసేన పార్టీ ఒక రాష్ట్రానికో, ఒక ప్రాంతానికో పరిమితం కాదు. పార్టీకి ఆయువు పట్టు యవత. వాళ్ల శక్తి అనే ఇంధనం మీదే పార్టీ నడుస్తోంది. బాధ్యతయుతమైన యువతను నాయకత్వం వైపు తీసుకెళ్లమే లక్ష్యం" అని పవన్ తెలిపారు. ఈ సందర్భంగా గత ఏడాది అత్యధిక సభ్యత్వాలు చేసిన వారి సమక్షంలో ఆదివారం ఉదయం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారితో పవన్ కాసేపు సరదాగా గడిపారు. ఆప్యాయంగా పేరుపేరునా యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారికి స్వయంగా అల్పాహారం వడ్డించారు. కార్యక్రమంలో జనసేన ఎమ్మెల్సీ హరిప్రసాద్, పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కల్యాణం శివశ్రీనివాస్ పాల్గొన్నారు.

అనుకూల తీర్పు రావాలంటే..
హైకోర్టు జడ్జికి 50 లక్షలు ఇవ్వాలి..!

పిటిషనర్ నుంచి తీసుకున్నారని న్యాయవాదిపై ఆరోపణ

» కేంద్ర న్యాయశాఖకు అందిన ఫిర్యాదుతో కలకలం



చెన్నై, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తమకు అనుకూలంగా తీర్పు వెలువరించేందుకు మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తికి ఇవ్వాలని ఓ సీనియర్ న్యాయవాది.. పిటిషనర్ వద్ద రూ.50 లక్షలు తీసుకున్నాడంటూ కేంద్ర న్యాయశాఖకు అందిన ఫిర్యాదు న్యాయవర్గాల్లో కలకలం రేపుతోంది. ఆ ఫిర్యాదును కేంద్ర న్యాయశాఖ మద్రాసు హైకోర్టుకు పంపగా... దీన్ని సదరు న్యాయవాది తీవ్రంగా ఖండించారు. ఎలాంటి విచారణకైనా సిద్ధమేనని ప్రకటించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో సదరు కేసు విచారణ నుంచి తప్పుకొన్న న్యాయమూర్తి.. ఈ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు చేపట్టాలని రిజిస్ట్రీని ఆదేశించారు. తమిళనాడులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఉదంతం వివరాలిలా వున్నాయి... 2008-09లో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పాల్గొంటూ ఇండియన్ మెటల్స్ అండ్ మినరల్స్ ట్రేడింగ్ కార్పొరేషన్‌ను రూ.113.38 కోట్ల మేర మోసం చేశారనే ఆరోపణలపై నరేశ్ ప్రసాద్ అగర్వాల్, గణేశ్ అగర్వాల్‌లపై సీబీఐ కేసు నమోదు చేసింది. వివిధ పరిణామాల అనంతరం ఈ వ్యవహారంపై విచారణ... మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.నిర్మల్‌కుమార్ ముందుకు వచ్చింది. ఈ కేసులో అనుకూలమైన తీర్పు రావాలంటే న్యాయమూర్తికి రూ.50 లక్షలు ఇవ్వాలంటూ పిటిషనర్ల నుంచి సీనియర్ న్యాయవాది మురళీకుమరన్ తీసుకున్నారని 'ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్' నుంచి కేంద్ర న్యాయశాఖకు ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదును కేంద్ర న్యాయశాఖ మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపింది. ఈ నేపథ్యంలో ఇటీవల ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యవహారం న్యాయమూర్తి దృష్టికి వచ్చింది. దీనిపై న్యాయమూర్తి సీనియర్ న్యాయవాది మురళీకుమరన్‌ను ప్రశ్నించగా.. ఆయన ఈ ఆరోపణలు ఖండించారు. ఈ వ్యవహారంలో తాను ఎలాంటి విచారణను ఎదుర్కొనేందుకైనా సిద్ధమని ప్రకటించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శ్రీనివాసన్ స్పందిస్తూ.. న్యాయమూర్తిపై నిరాధార ఆరోపణలు చేసినవారిపై చర్యలు తీసుకోవాలని, న్యాయవ్యవస్థ గౌరవానికిభంగం కలిగించే అలాంటి లేఖను తిరస్కరించాలని అభ్యర్థించారు.జస్టిస్ నిర్మల్‌కుమార్ స్పందిస్తూ ఈ వ్యవహారంలో పిటిషనర్ నుంచి న్యాయవాది నగదు తీసుకున్నారో లేదో తేల్చేందుకు విచారణ చేపట్టాలని రిజిస్ట్రీని ఆదేశించారు. అంతేగాక ఈ పిటిషన్‌పై విచారణను మరో బెంచ్‌కి బదిలీ చేసేందుకు అనువుగా ప్రధాన న్యాయమూర్తి ముందుంచాలని ఆదేశించారు.

పట్టు రైతుకు లాభాల గూళ్లు

» కొకూన్ ధరల పెరుగుదల ఫలితం

» ప్రస్తుతం గరిష్ఠంగా రూ.959

» త్వరలో 1000 దాటే అవకాశం

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పట్టు గూళ్ల (కొకూన్) ధరలు భారీగా పెరిగాయి. సగటు ధర కూడా గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలోని అన్ని పట్టు గూళ్ల మార్కెట్లలో 2వారాల నుంచి కిలో కొకూన్ గరిష్ఠ ధర రూ.959 ఉండగా, సగటు ధర రూ.812 నుంచి రూ.848కి చేరింది. కర్ణాటకలోని రాంనగర్ మార్కెట్‌లో గరిష్ఠ ధర రూ.1,000 ఉండగా, సగటు ధర రూ.798 నుంచి రూ.824కు చేరింది. గత పక్షం రోజుల్లో కర్ణాటకలో కన్నా ఏపీలో సగటు ధర ఎక్కువగా ఉంది. కర్ణాటకలో గరిష్ఠ ధరతో పరిమితంగానే క్రయవిక్రయాలు జరిగినట్లు సమాచారం. కానీ ఏపీలో ధర పెరుగుదల కారణంగా ఎక్కువ మంది పట్టు రైతులకు లబ్ధి చేకూరిందని చెప్తున్నారు. సగటు ధరను అంచనా వేసినప్పుడు రాష్ట్రంలోని పట్టు రైతులు పోటీతత్వ, లాభదాయక ధరలు పొందుతున్నారని పట్టు పరిశ్రమ శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. గతేడాది రూ.700 పలికిన కొకూన్.. ప్రస్తుతం రూ.959కు చేరింది. మరికొద్ది రోజుల్లో రూ.1,000దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సంప్రదాయంగా పట్టు ఉత్పత్తి చేసే రాష్ట్రాల్లో ఏపీ రెండో అతి పెద్దది. రాష్ట్రంలో 1.52 లక్షల ఎకరాల్లో పట్టు సాగవుతోంది. 2025-26లో పట్టు పథకాల కింద 90% రాయితీతో ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.4.90 కోట్లు కూటమి ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇటీవల పట్టు రైతులకు బకాయిలు కూడా చెల్లించింది. 2026-27 బడ్జెట్‌లో పట్టు పరిశ్రమకు 95.87 కోట్లు ప్రతిపాదించింది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.